www.jagritiweekly.com

సంపుటి : 75 సంచిక : 52 పుటలు : 52

# జాగృతి

కలి 5125 - శ్రీ శోభకృత్ ఆశ్వీయుజ శుద్ధ విదియ

16-22 అక్టోబర్ 2023

వెల : ₹20/-



# 'శతపతక' భారత్

71 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా 107 పతకాలతో నాలుగో స్థానంలో భారత్ సగర్వంగా నిలిచింది

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

75 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక




# ఇది 'జాగృతి' అమృతోత్సవం


రా. స్వ. సం. పై ప్రభుత్వం దాడి

నిషేధం వెంటనే తొలగింప బడాలి!

- ☞ గాంధీజీ హత్య నిందను ఆర్‌ఎస్‌ఎస్‌ ఎలా ఎదుర్కొన్నది?
- ☞ జైలుకు వెళుతూ పూజనీయ గురూజీ ఏమన్నారు?
- ☞ గాంధీజీని చంపినట్టు నీలాపనిందను ఎదుర్కొన్న ఆర్‌ఎస్‌ఎస్‌ ఆయన బాటలోనే ఎలా పోరాడి గెలిచింది?
- ☞ కక్షపూరితంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వంతో ఆర్‌ఎస్‌ఎస్‌ కోసం ఎవరు మధ్యవర్తిత్వం వహించారు?
- ☞ ఆర్‌ఎస్‌ఎస్‌పై నిషేధం చట్ట విరుద్ధమని ఎంతమంది చెప్పినా కేంద్రం ఆలకించిందా?
- ☞ నెహ్రూ మరణం పట్ల జాగృతి ఎంత నిర్మాణాత్మకంగా వ్యవహరించింది?
- ☞ శాస్త్రీజీ మరణం పట్ల జాగృతి ఏమన్నది?
- ☞ అండమాన్‌ జైలు శిక్షను సైతం లెక్క చేయని వీర సావర్కర్‌ చివరి క్షణాలు కాంగ్రెస్‌ హయాంలో ఎలా గడిచాయి?
- ☞ భారత్‌తో ఇరుగు పొరుగు యుద్ధాలు ఎందుకు జరిగాయి?
- ☞ 1969 రాష్ట్రపతి ఎన్నిక, అంతరాత్మ ప్రబోధం ఏమిటి? ఎందుకు? తెలుసుకోండి.









స్వతంత్ర భారతదేశ చరిత్ర మీ చేతులలోకి వస్తోంది! **త్వరపడండి!!**

## 2023 నవంబర్‌ 13-19 దీపావళి ప్రత్యేక సంచికలో!!!

అదనపు కాపీల కోసం పాఠకులు, ఏజెంట్లు అక్టోబర్‌ 31లోగా జాగృతి కార్యాలయానికి 9959997013 నంబరుకు ఫోన్‌ చేసి లేదా వాట్సప్‌లో సంప్రదించవచ్చు.

**పేజీలు : 250**
**వెల : 125/-**

- ➡ *10 నుంచి 25 కాపీలు ఆర్డరు చేసిన వారికి 30 శాతం*
- ➡ *26 నుంచి 99 కాపీలు ఆర్డరు పెట్టుకున్న వారికి 35 శాతం*
- ➡ *100, ఆ పైన కాపీలకు 40 శాతం డిస్కౌంట్‌ లభిస్తుంది.*
- ✿ *పార్శిల్‌ ఖర్చులు అదనం*

jagritiweekly.com | facebook.com Jagriti Telugu Weekly | youtube.com/@Jagrititv | 3-4-228/4/1, Kachiguda, Hyderabad-027.

# యువత యుద్ధవిద్యలు నేర్వాలి

## ఛత్రపతి శివాజీ రథయాత్ర ప్రారంభ సభలో శ్రీ సిద్ధయోగి స్వామీజీ



యువత యుద్ధ విద్యలు కూడా నేర్చుకోవాలని ఉత్తరాఖండ్‌కు చెందిన శ్రీ సిద్ధయోగి స్వామీజీ పేర్కొన్నారు. దేశాన్ని కాపాడుకోవడానికి శాస్త్రంతో పాటు శస్త్రం కూడా అవసరమన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ 350వ పట్టాభిషేకం సందర్భంగా అక్టోబర్ 8న అలంపూరంలోని జోగులాంబ దేవాలయం నుంచి ఛత్రపతి శివాజీ మహారథయాత్ర ప్రారంభమైంది. దేశంలోనే మొట్టమొదటిసారిగా ఇటువంటి యాత్ర ప్రారంభిస్తున్నట్లు శివాజీ స్ఫూర్తికేంద్రం సంఘటనా కార్యదర్శి సోమయాజుల నాగేశ్వరరావు, కృష్ణ కిశోర్  తెలిపారు.





యాత్ర వారం రోజులు కొనసాగి హైదరాబాద్ భాగ్యలక్ష్మి ఆలయం వద్దకు చేరడంతో ముగుస్తుందన్నారు. రెండో విడత బాసర నుంచి, మూడో విడత భద్రాచలం నుంచి ఉంటుందని వివరించారు. యాత్ర ప్రారంభ సమయంలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి కల్గిభగవాన్, విష్ణుదేవానంద్, నావల్ కిషోర్, శ్రీనివాస్‌బాబా, హిమాలయ బాబా వంటి అనేకమంది మఠాధిపతులు,  పీఠాధిపతులు, ఇతర సాధుసంతులు, వనపర్తి జిల్లా సంఘచాలక్ గోపాలరావు, పాలమూరు జిల్లా సంఘచాలక్ వసంతపు వెంకటేశ్వర్లు, యాత్ర కో కన్వీనర్ కాగితపు వెంకటేశ్వరరావు తదితరులు హాజరయ్యారు.



Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. And published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.

**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

**జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013**

## చందాదారులకు విన్నపం

జాగృతి వారపత్రికలను క్రమంతప్పకుండా అందజేయుటకు తపాలశాఖ వారు ఈ మధ్యనే **'మ్యాగజైన్ పోస్ట్'** అనే పేరుతో **'ట్రాకింగ్ సిస్టం'** ప్రవేశ పెట్టారు. ట్రాకింగ్ ఉంటుంది కాబట్టి పత్రిక తప్పనిసరిగా అందుతుంది. చందాదారునికి పత్రిక పోస్ట్ చేసిన తేదీ, పత్రిక అందజేసిన విషయం ఎస్ఎంఎస్ ద్వారా తపాలా శాఖవారు తెలియజేస్తారు. జాగృతి వారపత్రికను **'మ్యాగజైన్ పోస్ట్'** ద్వారా పొందుటకు అదనంగా సంవత్సరానికి **రూ. 624/-** (వారానికి రూ. 12/-) తపాలాశాఖకు చెల్లించాల్సి ఉంటుంది. కాబట్టి ఈ సదుపాయం పాఠకులు వినియోగించుకోవాలని విన్నపం. అందుకోసం జాగృతి అకౌంట్‌కు అదనంగా రూ. 624/- చెల్లించగలరు. ప్రస్తుత చందా దారులు రాబోయే వారాలకు తగిన మొత్తం (వారానికి రూ. 12/- చొప్పున) పంపిన వివరాలతోపాటు తమ చందా నెంబరు వివరాలు, పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెంబరు తెలుపగలరు. ఈ వివరాలు అందిన 15 రోజుల నుండి **'మ్యాగజైన్ పోస్ట్'** ద్వారా పత్రిక పంపే ప్రక్రియ మొదలవుతుంది.

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust, 92001006140 5325, Axis Bank, Kothapet Branch.**

**IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**

**మరిన్ని వివరాలకు**

**040-27561453/9959997013** నెంబర్లలో సంప్రదించవచ్చు.

– సర్క్యులేషన్ మేనేజర్

**విడి ప్రతి రూ.20**

**5 సం॥ల చందా రూ.4000** | **సంవత్సర చందా రూ.850**

**చందా పంపవలసిన చిరునామా :**

✦ 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

| | |
|---|---|
| కె. దుర్గారెడ్డి | అసోసియేట్ ఎడిటర్ |
| సబ్ ఎడిటర్ | 9959991304 |

డిజైనర్ : సిహెచ్. కుమార్

ప్రజాస్వామ్యం కాబట్టి ఎన్నికలు అనివార్యం. వాటి ఫలితాలు ఎటువైపు ఉన్నా స్వాగతించడం ప్రజాస్వామ్యాన్ని నమ్మేవారి కర్తవ్యమే కూడా. కానీ ఎన్నికల ఫలితాలకు వక్రభాష్యాలు వెలగబెట్టడం దుష్ట సంస్కృతిని పెంచిపోషించడమే. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా, పార్లమెంటు చేసిన నిర్ణయాన్ని అపహాస్యం చేసే రీతిలో దుర్వ్యాఖ్యానాలు చేయడం విపరిణామాలకు దారితీసేదే. అందునా చైనా కన్ను పడిన ప్రాంతంలో ఇలాంటి పరిణామం బాధాకరం. లద్దాఖ్ హిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్-కార్గిల్‌కు జరిగిన ఎన్నికల ఫలితాల గురించి కొన్ని పార్టీలు చేస్తున్న ప్రకటనలు నిస్సందేహంగా విద్రోహ చింతనను ధ్వనించేవే.

ఆ కౌన్సిల్ పరిధిలోని 26 స్థానాలకు ఈ అక్టోబర్ 4న ఎన్నికలు జరిగాయి. 8వ తేదీన ఫలితాలు వెలువడినాయి. లద్దాఖ్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా ఏర్పరిచిన తరువాత జరిగిన తొలి ఎన్నికలివి. ఇదంతా ఆగస్ట్ 5, 2019న జరిగిన 370 అధికరణం రద్దు తరువాతి పరిణామం. నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్, ఇతర పార్టీలతో కూడిన కూటమి గెలిచింది. నేషనల్ కాన్ఫరెన్స్ 12 స్థానాలు, కాంగ్రెస్ 10 స్థానాలు, వీరి మిత్రులు రెండు స్థానాలు కైవసం చేసుకున్నారు. బీజేపీ రెండు స్థానాలకు పరిమితమైంది. ఇది పరాజయమే. మొత్తం 30 స్థానాలతో ఏర్పాటు చేయదలచిన ఈ కౌన్సిల్‌లో 26 స్థానాలు ఎన్నికల ద్వారా భర్తీ అవుతాయి. నలుగురిని నామినేట్ చేస్తారు. అభ్యర్థులను నిలపడంలో కూటమి సమయానుకూలంగా నడుచుకుంది తప్ప, పూర్తిగా పొత్తు ధర్మాన్ని పాటించలేదు. దీనికి నిదర్శనం నేషనల్ కాన్ఫరెన్స్ 17 చోట్ల, కాంగ్రెస్ 22 చోట్ల అభ్యర్థులను నిలిపాయి. అంటే 26 స్థానాలలో ఆ రెండు పార్టీలు 29 మందిని నిలిపాయి. బీజేపీకి బలం ఉన్నచోట మాత్రం ఏక మయ్యాయి. ఆ కేంద్రపాలిత ప్రాంత పరిధిలో కార్గిల్, లే జిల్లాలు ఉన్నాయి. 1.4 లక్షల జనాభా ఉన్న ఈ రెండు జిల్లాలలో లక్షకు పైగా ముస్లింలు ఉన్నారు. బౌద్ధులు 20,000, హిందువులు 10,000 మంది ఉన్నారు.

370 అధికరణ రద్దు నిర్ణయాన్నీ, బీజేపీనీ తూర్పార పట్టడానికి ఎంత

**శాలివాహన 1945 శ్రీ శోభకృత్ ఆశ్వీయుజ శుద్ధ విదియ**


**లోపలి పేజీలలో...**




ముఖపత్ర కథనం
ఆసియా క్రీడల్లో
**'శతపతక' భారత్**
6లో

అంతర్జాతీయం
**ఆపరేషన్ క్లీనప్?**



14లో



22
ధారావాహిక నవల
**మహా సంకల్పం**
– పి. చంద్రశేఖర ఆజాద్
20లో

# జాగృతి

## సంపాదకీయం

# చిన్న ఎన్నిక, పెద్ద వ్యాఖ్యలు

చిన్న అవకాశం వచ్చినా వదులుకోని 'ఇండియా' కూటమి నేతలు ఈ విజయంతో రెచ్చిపోయి మాట్లాడుతున్నారు. అప్రజాస్వామికంగా, రాజ్యాంగ విరుద్ధంగా రాష్ట్రాన్ని విడదీసిన శక్తులకూ, పార్టీలకూ ఈ ఫలితాలు పెద్ద గుణపాఠమని నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. 2019 ఆగస్ట్‌లో కేంద్ర ప్రభుత్వం చేసినది పెద్ద తప్పిదమని, అది తమను దగా చేయడమేనని నేషనల్ కాన్ఫరెన్స్ కార్గిల్ జిల్లా అధ్యక్షుడు హనీఫా జన్ ఈ ఎన్నికల ఫలితాల గురించి మాట్లాడుతూ అన్నాడు. 370 అధికరణం రద్దు వ్యవహారాన్ని తమతో సంప్రదించకుండానే కేంద్రం పూర్తి చేసింది కాబట్టి, ఈ ఎన్నికలలో వచ్చిన ఫలితం ఆ నిర్ణయం మీద రిఫరెండం మాత్రమేనని జన్ చెబుతున్నాడు. సరిగ్గా ఇవే మాటలు సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఇస్సా అలీ నోటి నుంచి కూడా వెలువడినాయి. 370 అధికరణం రద్దు నిర్ణయం కార్గిల్‌కు మొదటి నుంచి సమ్మతం కాదన్న సంగతి ఈ ఫలితాలతో రుజువైందని అలీ వ్యాఖ్యానించాడు. కార్గిల్‌లో బీజేపీకి స్థానమే లేదని అతడి వాదన. ప్రజానీకం ఈ విభజనను అంగీకరించడం లేదని, జమ్ముకశ్మీర్‌తో కలసి ఉండడమే తమ అభిమతమని నిర్ద్వంద్వంగా వెల్లడించారని తనదైన భాష్యం చెప్పారు.

370 అధికరణం, 35ఎ అధికరణం రాజ్యాంగంలో తాత్కాలిక ప్రాతిపదికతోనే ఏడు దశాబ్దాలు తిష్ట వేశాయి. 370 అధికరణం ఫలితంగా భారతదేశం భారీ మూల్యమే చెల్లించింది. ప్రాణనష్టం, ధననష్టం అపారంగా జరిగిపోయింది. అయినా దీనితో లాభపడినది మూడు నాలుగు కుటుంబాలేనన్న చిదంబర రహస్యం ఆ అధికరణాల రద్దు తరువాత బహిర్గతమైంది. అందులో ఒకటి నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధిపతులు అబ్దుల్లాల కుటుంబం. షేక్ అబ్దుల్లా, ఫరూఖ్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లా రాష్ట్రాన్ని వేర్పాటువాదుల స్వర్గంగా, ముస్లిం మతోన్మాదుల, పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదుల నిలయంగా మార్చేశారు. దశాబ్దాల తరబడి అప్పనంగా అనుభవించిన ఆ భోగం చేజారిపోయిందన్న బాధ మాత్రమే ఒమర్ అబ్దుల్లా మాటలలో ధ్వనిస్తున్నది. పైకి ఎన్ని చెప్పినా ఈ పార్టీ కశ్మీర్‌ను భారత్‌లో అంతర్భాగంగా చూడడానికి అంగీక రించదు. ఫలితాలు వచ్చిన తరువాత కాంగ్రెస్ నాయకులు రాహుల్ జోడో యాత్ర ఫలితంగానే అక్కడ పార్టీ విజయం సాధించిందని సంబరపడ్డారు. ఆగస్ట్‌లో రాహుల్ గాంధీ లే ప్రాంతంలో పర్యటించినప్పుడు చైనా ఆక్రమణల గురించి మాత్రమే ప్రస్తావిం చారు. ఏమైనా ఈ రెండు పార్టీలు 370 అధికరణను పునరుద్ధరించేందుకు ఉవ్విళ్లూరుతున్న మాట నిజం. అదెంత వరకు సాధ్యమన్న సంగతి తరువాత. ఈ విషయంలో వాటి ఆలోచనలు ప్రశ్నార్థకమే. లాల్‌చౌక్ దగ్గర మళ్లీ జాతీయ పతాకం ఎగరనీయని పరిస్థితులు తలెత్తడానికి, మూడు దశాబ్దాల తరువాత తిరిగి కశ్మీర్‌కు చేరుకున్న ఆ కొద్ది మంది పండిత్‌లు మళ్లీ తిరుగు ప్రయాణం కట్టడానికి మాత్రమే ఈ పార్టీల నాయకుల ప్రకటనలు ఉపకరిస్తాయి. సుప్రీంకోర్టు కూడా 370 రద్దు అంశం మీద కేంద్ర నిర్ణయం జోలికి పోకుండానే, ఆ నిర్ణయాన్ని వ్యతిరేకించే వారి వాదనలు వినడానికి మాత్రమే పరిమితమైంది. దీనిని బట్టి అయినా వాస్తవిక పరిస్థితులను బీజేపీయేతర పార్టీల నేతలు గమనించాలి. కశ్మీర్‌కు ప్రధాన వనరు పర్యాటక రంగం ఇప్పుడిప్పుడే గాడిన పడుతున్న తరుణంలో ఆయా పార్టీల నాయకులు ఇలాంటి ప్రకటనలు చేయడం ప్రమాదం. ఈ ధోరణిలోని ప్రమాద ఘంటికలను అధిష్టానాలు గమనించలేదా? గమనించినా మిన్నకున్నాయా? ఇవన్నీ పాకిస్తాన్ మరింత రెచ్చిపోవడానికి ఆస్కారం కల్పించేవని అవి గుర్తించాలి. జరిగింది చిన్న ఎన్నిక. మాటలు మాత్రం పెద్దవి. ★

16 అక్టోబర్ 2023, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్



40లో

కథ

**కానుక**

– మధురాంతకం రాజారాం

ధరహాసం





| | | | | | |
|---|---|---|---|---|---|
| అదంతా అసత్యాల బురద, అబద్ధాల వరద (వేదిక) | - | 12 | మరో యుద్ధం (అంతర్జాతీయం-1) | - | 30 |
| ప్రభుత్వ తీరుపై సర్వత్రా నిరసన వెల్లువ (ఆంధ్రప్రదేశ్) | - | 16 | ఆధునిక సాహిత్య దృష్టికి 'సాక్షి' (సాహిత్యం) | - | 34 |
| చైనా, పాశ్చాత్య దేశాల 'పొగలేని యుద్ధాలు' (జాతీయం) | - | 23 | ఏకాత్మతా ప్రతిమకు వందనం (అద్వైతమూర్తి) | - | 43 |
| మహిళా హక్కుల వేగుచుక్క నార్గీస్ (మహిళ) | - | 26 | మెంటల్ తెప్పించే 'మామా మశ్చీంద్ర' (సినిమా) | - | 50 |

**19వ ఆసియా క్రీడల్లో భారత్ సరికొత్త చరిత్ర సృష్టించింది. క్రీడాకారుల స్వేదానికి, అంకితభావానికి ప్రధాని నరేంద్ర మోదీ దార్శనికత తోడు కావడంతో 'శత'పతకాల వర్షం కురిసింది. గత 71 సంవత్సరాలలో ఎన్నడూ లేనంతగా 107 పతకాలతో భారత్ పతకాల పట్టిక నాలుగో స్థానంలో సగర్వంగా నిలిచింది. చైనా వినువీధిలో 28 సార్లు మువ్వన్నెల జెండా రెపరెపలకు తోడు జాతీయ గీతాలాపనతో భరతజాతి మెరిసి మురిసింది.**

# ఆసియా క్రీడల్లో 'శతపతక'

చైనాలోని హాంగ్జు వేదికగా ముగిసిన 19వ ఆసియా క్రీడలు భారత క్రీడాశక్తిని ప్రపంచం ముందు సరికొత్తగా ఆవిష్కరించాయి. 1951లో మొదలైన ఆసియా క్రీడల్లో తన ప్రస్థానం ప్రారంభించిన భారత్ శత పతకాల లక్ష్యాన్ని చేరటానికి 7 దశాబ్దాల పాటు వేచిచూడాల్సి వచ్చింది.

**పతకాల హోరు**

చైనా గడ్డపై గత రెండు వారాలుగా సాగిన 45 దేశాల ఈ క్రీడా సమరంలో 655 మంది అథ్లెట్ల భారీ సైన్యంతో పాల్గొన్న భారత్.. రికార్డు స్థాయిలో మొత్తం 107 పతకాలు గెలుచుకొంది. ఇందులో 28 బంగారు, 31 రజత, 48 కాంస్యాలతో సహా మొత్తం 107 పతకాలతో సరికొత్త రికార్డు నెలకొల్పింది. 72 సంవత్సరాల ఆసియా క్రీడల చరిత్రలో మొట్టమొదటిసారిగా పతకాల శతకం నమోదు చేసింది.ఐదేళ్ల క్రితం జకార్తా వేదికగా ముగిసిన 18వ ఆసియా క్రీడల్లో 18 స్వర్ణాలతో సహా మొత్తం 70 పతకాలు మాత్రమే సాధించిన భారత్ కేవలం ఐదేళ్ల వ్యవధిలోనే తన పతకాల సంఖ్యను 107కు పెంచుకోగలిగింది.

**పతకాల పట్టికలో 4వ స్థానం**

1951 ప్రారంభ ఆసియా క్రీడల పతకాల పట్టిక రెండో స్థానంలో నిలిచిన భారత్.. 1962 జకార్తా గేమ్స్‌లో 3వ స్థానం సంపాదించింది. ఆ తరువాత అత్యుత్తమంగా ప్రస్తుత క్రీడల్లో మాత్రమే 4వ స్థానం సంపాదించగలిగింది.

క్రీడల రెండో రోజునే టీమ్ విభాగంలో షూటింగ్ జట్టు 'బంగారు' బోణీ కొట్టడంతో మొదలైన భారత్ పతకాల వేట చివరి రోజు వరకూ అప్రతిహతంగా కొనసాగింది. కబడ్డీ పురుషుల, మహిళల విభాగాలలో స్వర్ణాలతో పాటు.. క్రికెట్ పురుషుల బంగారు పతకం సైతం దక్కడం, దానికి బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్ స్వర్ణం తోడు కావడంతో మొత్తం 107 పతకాలతో భారత్ పతకాల వేట ముగిసింది.

**అథ్లెటిక్స్‌లో అత్యధికం**

ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో భారత్ అత్యధికంగా 6 స్వర్ణాలతో సహా 29 పతకాలు సాధిస్తే.. షూటింగ్‌లో 22 పతకాలు సొంతం చేసుకొంది. కేవలం షూటింగ్‌లోనే భారత్‌కు 7 స్వర్ణాలు దక్కడం విశేషం. పురుషుల రైఫిల్ షూటింగ్‌లో ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్, మహిళల పిస్టల్ షూటింగ్‌లో ఈషా సింగ్ చెరో నాలుగు పతకాలు సాధించారు. గత క్రీడల పురుషుల జావలిన్ త్రో విభాగంలో సాధించిన స్వర్ణాన్ని భారత స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా ప్రస్తుత క్రీడల్లో సైతం నిలుపుకొన్నాడు. 88.88 మీటర్ల రికార్డుతో తిరుగులేని విజేతగా నిలిచాడు. ఇక, విలువిద్యలో 5 స్వర్ణాలతో సహా మొత్తం 9 పతకాలు భారత్ గెలుచుకొంది. ఆర్చర్లు జ్యోతి సురేఖ, ఓజాస్ చెరో మూడు బంగారు పతకాలు చొప్పున సాధించడం ద్వారా విజయవంతమైన అథ్లెట్లుగా నిలిచారు. ఓవరాల్‌గా పురుషుల విభాగంలో 52, మహిళల విభాగంలో 46, మిక్స్‌డ్ విభాగాలలో 9 పతకాలను భారత అథ్లెట్లు సాధించగలిగారు. మొత్తం 34 మంది అథ్లెట్స్ రెండుకు మించి

## 'తెలుగు వెలుగులు'



పతకాలు గెలుచుకొన్నారు.

**అలుపెరుగని వీరుడు సౌరవ్**

స్క్వాష్ పురుషుల సింగిల్స్‌లో గత ఆరు ఆసియా క్రీడల్లో పాల్గొంటూ వచ్చిన భారత వెటరన్ స్టార్ సౌరవ్ గోశాల్ తన ఆఖరి ప్రయత్నంలో పురుషుల టీమ్ గోల్డ్‌తో పాటు, వ్యక్తిగత విభాగంలో రజత పతకం సాధించాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో దీపిక పల్లికల్– స్వర్ణజీత్ సింగ్ జోడీ బంగారు పతకం అందుకొన్నారు. మహిళల టీమ్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాలలో భారత టీనేజ్ అథ్లెట్, 15 సంవత్సరాల అనాహత్ సింగ్ రెండు కాంస్య పతకాలతో తన ఆసియా



# భారత్

క్రీడల ప్రయాణాన్ని ప్రారంభించింది. బ్రిడ్జి క్రీడలో 65 సంవత్సరాల జగ్గీ శివదాసానీ భారత్‌కు రజత పతకం అందించిన అత్యంత పెద్ద వయసున్న అథ్లెట్‌గా రికార్డుల్లో చేరారు.

**19**వ ఆసియా క్రీడల్లో భారత రికార్డు పతకాల సాధనలో తెలుగు రాష్ట్రాల అథ్లెట్లు సైతం తమ వంతు పాత్ర పోషించారు. షూటింగ్, బ్యాడ్మింటన్, ఆర్చరీ, బాక్సింగ్, చదరంగం, అథ్లెటిక్స్ అంశాలలో రాణించారు. మహిళల బాక్సింగ్, పురుషుల క్రికెట్, షూటింగ్ అంశాలలో తెలంగాణ అథ్లెట్లు పతకాలు తెస్తే, విలువిద్య, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ విభాగాలలో ఆంధ్రప్రదేశ్ అథ్లెట్లు బంగారు పంట పండించారు.

**3 స్వర్ణాల బెజవాడ ఆర్చర్**

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన స్టార్ ఆర్చర్ జ్యోతి సురేఖ మూడు విభాగాలలో మూడు బంగారు పతకాలు సాధించడం ద్వారా చరిత్ర సృష్టించింది. కాంపౌండ్ విభాగంలో మహిళల వ్యక్తిగత, టీమ్ విభాగాలతో పాటు మిక్స్‌డ్ డబుల్స్ అంశంలో సైతం బంగారు పంట



పండించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ఓజాస్ దేవ్ తాలేతో జంటగా బరిలో నిలిచిన జ్యోతి సురేఖ తొలి బంగారు పతకం అందుకొంది. కొరియా జోడీతో జరిగిన బంగారు పతకం పోరులో 159– 158 పాయింట్ల తేడాతో భారత్ విజేతగా నిలిచింది. మహిళల టీమ్ విభాగం గోల్డ్ మెడల్ పోరులో చైనీస్ తైపీ జట్టుపై 230– 229 పాయింట్ల తేడాతో భారత్ విజయం సాధించడంలో జ్యోతి సురేఖ, అదితీ గోపీచంద్ స్వామి, ప్రణీత్ కౌర్‌లతో కూడిన భారతజట్టు సఫలమయ్యింది. మహిళల వ్యక్తిగత విభాగంలో సైతం జ్యోతి సురేఖకు ఎదురే లేకుండా పోయింది. బంగారు పతకం కోసం జరిగిన పోరులో కొరియా ఆర్చర్‌ను కంగు తినిపించడం ద్వారా జ్యోతి సురేఖ స్వర్ణాల హ్యాట్రిక్‌ను పూర్తి చేసింది. 19వ ఆసియా క్రీడల్లో మూడు బంగారు పతకాలు సాధించిన ఏకైక తెలుగు అథ్లెట్ ఘనతను సంపాదించింది.

**హైదరాబాదీ షూటర్ అరుదైన ఘనత**

మహిళల పిస్టల్ షూటింగ్ విభాగంలో హైదరాబాద్‌లో పుట్టిపెరిగిన 19 సంవత్సరాల ఈషా సింగ్ ఏకంగా నాలుగు పతకాలు సాధించడం ద్వారా



కృష్ణారావు చొప్పరపు
84668 64969
సీనియర్ జర్నలిస్ట్

భారత్‌కు మాత్రమే కాదు, తెలుగు రాష్ట్రాలకు సైతం గర్వకారణంగా నిలిచింది.

గచ్చిబౌలిలోని షూటింగ్ రేంజ్‌లో ఓనమాలు దిద్దుకొని మహారాష్ట్రలోని గగన్ నారంగ్ అకాడమీలో శిక్షణ పొందిన ఈషా సింగ్ 25 మీటర్ల పిస్టల్ టీమ్ విభాగంలో బంగారు పతకం సాధించింది. ఇదే అంశం వ్యక్తిగత విభాగంలో రజత పతకం సాధించడం ద్వారా తన పతకాల సంఖ్యను రెండుకు పెంచుకొంది. అంతటితో ఆగిపోకుండా 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్, వ్యక్తిగత విభాగాలలో రజత పతకాలు సొంతం చేసుకొంది. మొత్తం 4 పతకాలు గెలుచుకోడం ద్వారా తనకుతానే సాటిగా నిలిచింది.

**నిఖత్ జరీన్ చేజారిన స్వర్ణం**

మహిళల బాక్సింగ్ 50 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించడం ఖాయమనుకున్న తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్..సెమీ ఫైనల్లో ఓటమితో కాంస్య పతకంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ప్రస్తుతం ప్రపంచ చాంపియన్‌గా ఉన్న నిఖత్‌ను ఆసియా క్రీడల సెమీస్‌లో దురదృష్టం వెంటాడింది. థాయ్ బాక్సర్ 3-2 పాయింట్లతో నిఖత్‌పై సంచలన విజయం సాధించడం ద్వారా బంగారు ఆశల్ని వమ్ము చేసింది.

**పురుషుల క్రికెట్‌లో తిలక్ వర్మకు స్వర్ణం**

పురుషుల క్రికెట్లో బంగారు పతకం సాధించిన భారత జట్టులో హైదరాబాదీ బ్యాటర్ తిలక్ వర్మ సైతం సభ్యుడిగా ఉన్నాడు. భారత జట్టు ఫైనల్ చేరడంలో తిలక్ వర్మ అజేయహాఫ్ సెంచరీతో నిలిచాడు.

**బ్యాడ్మింటన్ అపూర్వ విజయం**

బ్యాడ్మింటన్ పురుషుల టీమ్ విభాగంలో భారత్ తొలిసారిగా గోల్డ్ మెడల్ రౌండ్ చేరుకోవడంలో ఆంధ్రప్రదేశ్ ఆటగాళ్లు కిడాంబి శ్రీకాంత్, సాయి సాత్విక్ ప్రధాన పాత్ర పోషించారు. దక్షిణ కొరియాతో జరిగిన సెమీస్ పోరులో భారత్ 3-2తో సంచలన విజయం సాధించడంలో సింగిల్స్ ప్లేయర్ కిడాంబి శ్రీకాంత్, డబుల్స్‌లో సాయి సాత్విక్- చిరాగ్ శెట్టి కీలకంగా వ్యవహరించారు. రెండు జట్లు చెరో రెండు మ్యాచ్‌లు నెగ్గి 2-2తో సమ ఉజ్జీలుగా నిలిచిన సమయంలో జరిగిన నిర్ణయాత్మక ఆఖరి సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ అసాధారణ విజయంతో జట్టును తొలిసారిగా ఫైనల్స్ చేర్చగలిగాడు. బంగారు పతకం కోసం ఆతిథ్య చైనాతో జరిగిన పోరులో భారత్ 2-3తో పోరాడి ఓడి రజత పతకంతో సరిపెట్టుకొంది. డబుల్స్‌లో సాయిసాత్విక్ జోడీ కీలక విజయం సాధించినా.. ఆఖరి సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ పరాజయం పాలయ్యాడు.

**విశాఖ రన్నర్ జ్యోతికి రజతం**

తన కెరియర్‌లో తొలిసారిగా ఆసియా క్రీడల మహిళల 100 మీటర్ల హర్డిల్స్ బరిలోకి దిగిన విశాఖ కమ్ ఆంధ్రప్రదేశ్ రన్నర్ జ్యోతి యర్రాజీ రజత పతకంతో సరిపెట్టుకొంది. ఆసియా చాంపియన్ హోదాలో రేస్‌లో పాల్గొన్న జ్యోతికి అదృష్టం కలసి వచ్చింది. వాస్తవానికి కాంస్య పతకం సాధించిన జ్యోతికి.. ప్రత్యర్థి చైనా రన్నర్ ఫౌల్ చేయడంతో.. రజత పతకం దక్కింది.

**చెస్‌లో అర్జున్ ఇరగేసి, పెంటేల హరికృష్ణ**

చదరంగం పురుషుల టీమ్ విభాగంలో రజత పతకం సాధించిన భారత జట్టు సభ్యుల్లో తెలంగాణ గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఇరగేసి, ఆంధ్ర గ్రాండ్ మాస్టర్ పెంటేల హరికృష్ణ ఉన్నారు.

క్రీడారంగంలో తెలుగు రాష్ట్రాలు ఏమాత్రం వెనుకబడి లేవనటానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు ప్రాతినిథ్యం వహించిన అథ్లెట్లు సాధించిన పతకాలే నిదర్శనంగా నిలిచిపోతాయి. ★

## ప్రధాని మోదీ కల..

ఆసియా క్రీడల్లో వందకుపైగా పతకాలు సాధించడం ద్వారా భారత్ క్రీడాశక్తిగా ఎదగాలని, ప్రపంచం ముందు సగర్వంగా నిలవాలన్నది ప్రధాని నరేంద్ర మోదీ స్వప్నమని, దానిని భారత అథ్లెట్లు సాకారం చేయగలిగారని భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష కొనియాడారు.

ఆసియా క్రీడల 7 దశాబ్దాల చరిత్రలో భారత్ రికార్డు స్థాయిలో 107 పతకాలు సాధించడం వెనక ప్రధాని నరేంద్ర మోదీ దార్శనికత, గత దశాబ్ద కాలంగా కేంద్ర ప్రభుత్వం ఆచరించిన క్రీడావిధానం ఉన్నాయనే చెప్పాలి. భారత్‌ను తిరుగులేని క్రీడాశక్తిగా తీర్చిదిద్దటానికి ప్రధాని ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. అంతర్జాతీయ స్థాయిలో భారత క్రీడాకారులు రాణించడానికి వీలుగా తగిన వనరులు సమకూర్చడంతో పాటు వెన్నుతట్టి ప్రోత్సహిస్తూ వచ్చారు. క్రీడాకారులు, క్రీడాప్రముఖులతో నిరంతర సంబంధాలను కొనసాగిస్తూ ప్రధాన మోదీ స్ఫూర్తిదాయకంగా నిలిచారు.

జకార్తా వేదికగా 2018లో ముగిసిన ఆసియా క్రీడల్లో 70 పతకాలు మాత్రమే సాధించిన భారత్.. కేవలం ఐదేళ్ల కాలంలోనే 107 పతకాలకు చేరుకోడం వెనక కేంద్ర క్రీడామంత్రిత్వ శాఖ, భారత ఒలింపిక్ సంఘం కసరత్తు, కృషి ఎంతో ఉన్నాయి. గతంలో క్రీడల మంత్రిగా పనిచేసిన కిరణ్ రిజిజు, ప్రస్తుత క్రీడల శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్‌లు సైతం తమ వంతు బాధ్యతల్ని అంకితభావంతో నిర్వర్తించారు.

**కొత్తగా.. సరికొత్తగా**

భారత అథ్లెట్లు తొలిసారిగా అశ్వక్రీడల డ్రెస్సాజ్ విభాగంలో బంగారు పతకం, టేబుల్ టెన్నిస్ మహిళల డబుల్స్‌లో రజత పతకం, బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్‌లో బంగారు పతకం, విలువిద్య కాంపౌండ్ విభాగాలలో అరుదైన పతకాలు సాధించింది. విలువిద్య కోసం ఎన్టీపీసీతో 5 సంవత్సరాల పాటు 115 కోట్ల రూపాయల పథకాన్ని ప్రభుత్వం అమలు చేసింది. విలువిద్య క్రీడకు అవసరమైన అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మౌలిక సదుపాయాలు, క్రీడాపరికరాలు అందుబాటులో ఉంచడం కోసం 15 కోట్ల రూపాయలను అదనంగా వ్యయం చేసింది. దక్షిణ

## హాకీలో స్వర్ణోదయం!

ఆసియా క్రీడల్లో 9 ఏళ్ల విరామం తర్వాత భారత్ హాకీ జట్టు బంగారు పతకాన్ని గెలుచుకొంది. ఫైనల్లో విజేత జపాన్‌ను 5-1 గోల్స్‌తో చిత్తు చేయడం ద్వారా పారిస్ ఒలింపిక్స్ బెర్త్ ఖాయం చేసుకొంది.

ఒలింపిక్స్ హాకీ చరిత్రలో ఎనిమిది సార్లు బంగారు పతకాలు సాధించిన భారత్.. ఆసియా క్రీడల్లో మాత్రం 2014 వరకూ మూడుసార్లు మాత్రమే విజేతగా నిలువగలిగింది. అంతర్జాతీయ హాకీలో గత మూడేళ్లుగా అత్యంత నిలకడగా రాణిస్తూ 3వ ర్యాంక్‌కు చేరిన భారత జట్టు.. ప్రస్తుత ఆసియా క్రీడల్లో స్థాయికి తగ్గట్టుగా రాణించింది. పూల్ - ఏ లీగ్ నుంచి నాకౌట్ ఫైనల్ వరకూ భారీ విజయాలు నమోదు చేయగలిగింది. సెమీ ఫైనల్లో దక్షిణ కొరియాను 5-3 గోల్స్‌తో ఓడించిన భారత్‌కు.. బంగారు పతకం పోరులో ఎదురే లేకపోయింది. ఆట రెండో క్వార్టర్ ప్రారంభానికే 3-0 గోల్స్‌తో జపాన్‌పై తిరుగులేని ఆధిక్యం సంపాదించిన భారత్ ఆ తర్వాత ప్రత్యర్థికి ఓ గోల్ ఇచ్చినా ఆఖరి క్వార్టర్ గోలుతో 5-1తో విజేతగా స్వర్ణపతకం అందుకొంది.

ఆట మొదటి క్వార్టర్ 15వ నిమిషంలో సుర్జీత్ సింగ్ భారత్‌కు తొలి గోల్ అందించాడు. ఆ తర్వాత మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీ కార్నర్ ద్వారా రెండో గోల్



# నెరవేరిన వేళ..



కొరియా, ఇటలీ దేశాలకు చెందిన విఖ్యాత శిక్షకుల్ని రప్పించడానికి 2 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. భారత్‌కు చెందిన 50 మంది శిక్షకులను విదేశీ సెమీనార్‌లకు పంపడం ద్వారా అత్యాధునిక నైపుణ్యాలు సమకూర్చుకోడానికి కృషి చేసింది. సైకాలజిస్టులు, పౌష్టికాహార నిపుణులు, స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ నిపుణులకు అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను సమకూర్చడం కోసం మరో 3 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. ప్రభుత్వం తీసుకొన్న ఈ చర్యల వల్ల 2018లో 2 పతకాలు మాత్రమే సాధించిన భారత ఆర్చర్లు తాజా క్రీడల్లో 5 బంగారు పతకాలు సాధించగలిగారు. మహిళల విభాగంలో జ్యోతి సురేఖ, పురుషుల విభాగంలో ఓజాస్ మూడేసి స్వర్ణ పతకాలు సాధించడం ద్వారా దేశానికే గర్వకారణంగా నిలిచారు.

2018 ఆసియా క్రీడల్లో భారత్ 18 రకాల క్రీడల్లో పతకాలు సాధిస్తే..2022 (తాజా) ఆసియా క్రీడల్లో 22 రకాల క్రీడల్లో పతకాలు సంపాదించింది. గత క్రీడలతో పోల్చి చూస్తే షూటింగ్‌లో 20 నుంచి 29కి పతకాల సంఖ్యను పెంచుకొంది. ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో సైతం భారత్ తన పతకాల సంఖ్యను గణనీయంగా పెంచుకోగలిగింది. పురుషుల జావలిన్ త్రోలో స్వర్ణ, రజతాలు రెండు భారత్‌కే దక్కాయి. పురుషుల 3 వేల మీటర్ల స్టీపుల్ చేజ్‌లో అవినాశ్ సాబ్లే, మహిళల 5 వేల మీటర్ల పరుగులో పారుల్ చౌదరీ 'బంగారు' విజయాలు అరుదైనవిగా మిగిలిపోతాయి.

### క్రికెట్, కబడ్డీలో రెండుకు రెండు

క్రికెట్ పురుషుల, మహిళల విభాగాలలో భారత్ రెండుకు రెండు బంగారు పతకాలు సొంతం చేసుకొంది. కబడ్డీ పురుషుల, మహిళల విభాగాలలో సైతం భారత జట్లు స్వర్ణ విజయాలు సాధించాయి. చదరంగం పురుషుల, మహిళల విభాగాలలో భారత్ రజత పతకాలతో మాత్రమే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. మహిళల గోల్ఫ్ వ్యక్తిగత విభాగంలో అదితీ అశోక్ రజత, రోలర్ స్కేటింగ్‌లో రెండు కాంస్య, కనోయింగ్‌లో ఓ కాంస్య పతకం భారత్ కు అదనంగా దక్కాయి.

### బాడ్మింటన్‌లో సరికొత్త చరిత్ర

చైనా, కొరియా, జపాన్, మలేసియా, ఇండోనేసియా దేశాల ఆధిపత్యం కొనసాగిన బ్యాడ్మింటన్‌లో భారత్ సరికొత్త శక్తిగా అవతరించింది. పురుషుల టీమ్ విభాగంలో రజత, వ్యక్తిగత విభాగంలో ప్రణయ్ కాంస్య, డబుల్స్‌లో తొలిసారిగా బంగారు పతకాలతో భారత షట్లర్లు చరిత్ర సృష్టించారు.

గతంలో ఎన్నడూ లేని విధంగా 655 మంది సభ్యుల భారీ బృందంతో 38 రకాల క్రీడాంశాలలో పోటీకి దిగిన భారత్ 28 స్వర్ణాలతో సహా మొత్తం 107 పతకాలతో పతకాల పట్టిక నాలుగో స్థానంలో నిలవడంలో ప్రభుత్వ క్రీడావిధానం, ప్రోత్సాహకాలు ఎంతగానో ఉపకరించాయి. ఈ ఘనత ప్రధాని నరేంద్ర మోదీకి మాత్రమే దక్కుతుంది.

వచ్చే ఏడాది పారిస్ వేదికగా జరిగే ఒలింపిక్స్‌లో సైతం భారత క్రీడాకారులు ఇదే జోరు కొనసాగించాలని, విశ్వక్రీడా వేదికపైన సైతం మెరిసి మురవాలని కోరుకుందాం! ★



సాధించాడు. అమిత్ రోహిదాస్ మూడో గోల్ సాధించడం ద్వారా భారత్ దూకుడు కొనసాగించింది. ఆట 4వ క్వార్టర్‌లో భారత్ ఆధిక్యాన్ని అభిషేక్ 4–0కు పెంచాడు. జపాన్ తరపున సెరెనా తనాకా గోల్ నమోదు చేశాడు. ఆట ముగిసే క్షణాలలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను హర్మన్ ప్రీత్ గోల్‌గా మలచడం ద్వారా 5–1తో విజయం పూర్తి చేశాడు.

### 1966 నుంచి 2023 వరకు

1951 నుంచి భారత్ ఆసియా క్రీడల్లో పాల్గొంటూ వచ్చినా.. ప్రస్తుత 2023 గేమ్స్ వరకూ నాలుగు సార్లు మాత్రమే చాంపియన్‌గా నిలువగలిగింది. 1966లో తొలిసారిగా ఆసియా క్రీడల బంగారు పతకం సాధించిన భారత్ ఆ తర్వాత 1998, 2014 గేమ్స్‌లో సైతం స్వర్ణాలు సాధించింది. 2018 జకార్తా ఆసియా క్రీడల్లో కాంస్య పతకానికి మాత్రమే పరిమితమైంది. కేవలం నాలుగేళ్ల విరామంలోనే తిరిగి బంగారు పతకం అందుకోగలిగింది. ఆసియా క్రీడల హాకీ చరిత్రలో పాకిస్తాన్ అత్యధికంగా 9 సార్లు బంగారు పతకాలు సాధిస్తేచ దక్షిణ కొరియా, భారత్ చెరో నాలుగు సార్లు స్వర్ణాలు సాధించడం ద్వారా ఆ తర్వాతి స్థానాల్లో నిలువగలిగాయి.

### పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత

భారత జట్టు హాంగ్జు ఆసియా క్రీడల విజేతగా నిలవడం ద్వారా ఒకే దెబ్బకు రెండు పిట్టల్ని కొట్టినట్లయ్యింది. ఆసియా క్రీడల విజేతగా నిలవడం ద్వారా వచ్చే ఏడాది పారిస్ వేదికగా జరిగే 2024 ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సంపాదించగలిగింది.

### మహిళా జట్టుకు కాంస్య పతకం

మహిళల విభాగంలో భారత హాకీ జట్టు కాంస్య పతకంతో సరిపెట్టుకొంది. సెమీఫైనల్లో చైనా చేతిలో ఓటమితో కంచు పతకం కోసం జపాన్‌తో పోరాడాల్సి వచ్చింది. గత క్రీడల విజేత జపాన్‌ను భారత్ 2–1 గోల్స్‌తో అధిగమించడం ద్వారా మూడోస్థానం సంపాదించగలిగింది. ★

# పతకాల వెనుక త్యాగం, స్వేదం!

19వ ఆసియాక్రీడల్లో పతకాలు సాధించిన అథ్లెట్లలో భారత్‌లోని భిన్నవర్గాలకు చెందినవారు ఉన్నారు. రాజవంశీకుల నుంచి రోజువారీ కూలీ వరకూ, కవలపిల్లల తల్లి నుంచి కూరగాయల వ్యాపారి కుమార్తె వరకూ వివిధ క్రీడల్లో పతకాలు సాధించడం ద్వారా భారత మువ్వన్నెల జెండాను రెపరెప లాడించిన వారే. ఈ పతక విజేతల వెనుక కుటుంబసభ్యుల త్యాగం, సంవత్సరాల తరబడి సాధన చేస్తూ చిందించిన స్వేదంతో పాటు అంకితభావం, పట్టుదల ఉన్నాయి.

## రోజువారీ కూలీ.. ఆసియాక్రీడల్లో పతక విజేత!



హాంగ్జు ఆసియాక్రీడల్లో తొలిసారిగా ప్రవేశపెట్టిన 35 కిలోమీటర్ల మిక్స్‌డ్ రేస్ వాక్‌లో మంజు రాణీతో కలసి భారత్‌కు కాంస్య పతకం సాధించి పెట్టిన 24 సంవత్సరాల రాంబాబు పడిన కష్టం చూస్తే అతను సాధించిన విజయం ఎంత అమూల్యమైనదో తెలుస్తుంది. ఉత్తరప్రదేశ్‌లో అత్యంత వెనుకబడిన సోనేభద్ర జిల్లాలోని బేహురా గ్రామానికి చెందిన ఓ రోజువారీ కూలీ కుటుం బంలో జన్మించిన రాంబాబు.. తల్లి, ముగ్గురు అక్కచెల్లెళ్ల కోసం తండ్రితో కలసి రోజువారీ పనులకు వెళుతూ ఉండేవాడు. అతనికి స్వతహాగా ఆటలంటే చెప్పలేని ఇష్టం. దైనందిన జీవితంలో నడక ఓ భాగంగా మారింది. 50 కిలోమీటర్ల దూరం నడచినా అలుపుసొలుపు లేని పటుత్వం ఉంది. అదే చివరకు అతనికి వరంగా మారింది. జాతీయస్థాయిలో నిర్వహించిన సుదూర నడక పోటీలలో పాల్గొంటూ భారత సైనికదళంలో సిపాయి ఉద్యోగం సంపాదించాడు. ఆ తర్వాత నుంచి వెనుదిరిగి చూసిందిలేదు. 23 సంవత్సరాల వయసుకే ప్రపంచ పోటీలలో పాల్గొని 27వ స్థానంలో నిలిచాడు. హాంగ్జు ఆసియాక్రీడల్లో 35 కిలోమీటర్ల రేస్ వాక్‌లో 2 గంటల 57 నిముషాల 54 సెకన్ల రికార్డుతో కాంస్య విజేతగా నిలిచాడు.

## జావలిన్ కోసం అప్పులు చేసి....




పురుషుల జావలిన్ త్రోలో రజత పతకం సాధించిన ఒడిషా బల్లెంవీరుడు కిశోర్ కుమార్ జెనా నిధుల లేమితో అల్లాడాడు. పూరీ జిల్లాలోని కొతసాహీ గ్రామానికి చెందిన అతను ఓ నిరుపేద కుటుంబంలో పుట్టినా క్రీడల్లో రాణించేలా తండ్రి, ఇతర కుటుంబసభ్యులు ఎంతగానో ప్రోత్సహించారు. ఫుట్‌బాల్, వాలీబాల్ క్రీడల్లో రాణిస్తూ వచ్చిన కిశోర్ జెనా బల్లెం విసరటం పట్ల ఆసక్తిని పెంచుకొన్నాడు. తగిన శిక్షకుడు లేకుండానే సాధన మొదలు పెట్టాడు. రూ. 28 వేల ఖరీదు గల సొంత జావలిన్ సమకూర్చుకోడానికి జెనా కుటుంబం పడిన పాట్లు అన్నీఇన్నీ కావు. ఒడిషా ప్రభుత్వ సహకారంతో జాతీయస్థాయి అథ్లెట్‌గా ఎదిగిన అతను ప్రపంచ అథ్లెటిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదిగాడు. ఆసియాక్రీడల జావలిన్ త్రోలో విజేత నీరజ్ చోప్రాకు గట్టిపోటీ ఇచ్చి 87.54 మీటర్ల రికార్డుతో రజత పతకం అందుకొన్నాడు. 2024 పారిస్ ఒలింపిక్స్‌కు సైతం అర్హత సంపాదించాడు. దేశానికి పతకంతో పాటు తమ రాష్ట్రానికి గుర్తింపు తెచ్చిన కిశోర్ జెనాకు ఒడిషా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కోటీ 50 లక్షల రూపాయలు నజరానాగా ప్రకటించారు.

## కూరగాయల వ్యాపారి కుమార్తె విజయం...



ముంబై శివారులోని దహీసార్ ప్రాంతంలో తోపుడుబండి మీద కూర గాయాలు అమ్ముకుంటూ వచ్చిన మొత్తంతో కుటుంబసభ్యులు తీర్చిదిద్దిన అథ్లెట్ ఐశ్వర్య అద్భుతాలు సృష్టించింది. ఆసియాక్రీడల మహిళల 400 మీటర్ల రిలేలో రజత పతకం సాధించిన భారతజట్టులో సభ్యురాలిగా ఉన్న తన కుమార్తె ఐశ్వర్యను చూసి కైలాశ్ మిశ్రా పొంగిపోతున్నాడు. తాను కూరగాయలు అమ్మిన కష్టం వృథా కాలేదని, తన కుమార్తె దేశానికి పతకం సాధించి పెట్టడం గర్వకారణంగా ఉందని మురిసిపోతున్నాడు. ముంబై పరిసర ప్రాంతాలలో జరిగే మారథాన్ పరుగు పోటీలలో పాల్గొంటూ వచ్చిన ప్రైజ్ మనీతో కుటుంబానికి అండగా నిలిచిన ఐశ్వర్య ఇప్పుడు ఆసియాక్రీడల పతక విజేత. మహిళల 400 మీటర్ల పరుగులో నాలుగోస్థానంలో నిలిచిన ఐశ్వర్య రిలేలో మాత్రం రజత పతకం అందుకోగలిగింది.

## మాతృప్రేమను పక్కనపెట్టి....



ఆసియాక్రీడల స్క్వాష్ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో హరిందర్ పాల్ సింగ్ సంధూతో కలసి బంగారు పతకం సాధించిన దీపిక పల్లికల్ తన కవల పిల్లలకు గత రెండుమాసాలుగా దూరంగా ఉన్నారు. భారత మాజీ క్రికెటర్, ప్రస్తుత కామెంటేటర్ దినేశ్ కార్తీక్‌ను వివాహం చేసుకొన్న దీపిక.. కవలల తల్లిగా పిల్లల బాగోగులు చూసుకోడం కోసం గత నాలుగేళ్లుగా స్క్వాష్ క్రీడకు దూరంగా ఉంటూ వచ్చింది. అయితే.. కఠోరసాధనతో తిరిగి భారతజట్టులో చోటు సంపాదించడం ద్వారా ఆసియా క్రీడల్లో పాల్గొనగలిగింది. పోటీల సన్నాహాల కోసం గత రెండుమాసాలుగా పిల్లలకూ దూరం కావడం బాధ, అపరాధ భావాన్ని కలిగించాయని, అయితే దేశం కోసం తాను సాధించినబంగారు పతకం విలువ ఏంటో తన పిల్లలు రానున్న కాలంలో తెలుసుకొంటారని తన స్వర్ణ పతక విజయానంతరం చెప్పింది.

# తెలుగు అథ్లెట్లకు ప్రోత్సాహమేదీ?



హాంగ్జు ఆసియా క్రీడల్లో భారత్ రికార్డు స్థాయిలో బంగారు పతకాలు సాధించడంలో విజయవాడ కమ్ ఆంధ్ర ఆర్చర్ జ్యోతి సురేఖ వెన్నం మూడు స్వర్ణాలతో తన వంతు పాత్ర పోషించినా ఆదరణ, ప్రోత్సాహం అంతంత మాత్రంగానే కనిపిస్తున్నాయి. 19వ ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన అథ్లెట్లను పంజాబ్, ఒడిషా రాష్ట్రాలు ఆకాశానికి ఎత్తేసి కోట్ల రూపాయలు నజరానాగా కుమ్మరిస్తుంటే, తెలుగు రాష్ట్రాలలో ఆ పరిస్థితి ఏమాత్రం కనిపించడం లేదు. కేవలం అభినందన సందేశాలతో ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు మమ అనిపించారు.

విజయవాడ శివారులోని తాడేపల్లిలో నివాసం ఉంటున్న జ్యోతి సురేఖ తల్లిదండ్రుల్ని ఇటు మీడియా ప్రతినిధులు కానీ, అటు క్రీడాసంఘాల అధికారులు కానీ పలకరించిన పాపాన పోలేదు. జ్యోతి సురేఖ తండ్రి సురేంద్ర తన కుమార్తె సాధించిన విజయాలకు కృతజ్ఞతగా తమ నివాసానికి సమీపంలో ఉన్న వినాయకుడి గుడికి వెళ్లి వచ్చారు. గత కొద్ది సంవత్సరాలుగా తమ కుటుంబం చేసిన, చేస్తూ వచ్చిన త్యాగాలకు తగిన ఫలం దక్కిందన్నారు. అయితే, ఇతర క్రీడాకారులకు ఇచ్చిన ప్రాధాన్యం తన కుమార్తెకు లభించకపోవడం దురదృష్టకరమని జ్యోతి తండ్రి వాపోతున్నారు.

**ఆస్తులు అమ్మి ఆర్చరీ**

జ్యోతి సురేఖను అంతర్జాతీయ ఆర్చర్‌గా తీర్చిదిద్దడం కోసం తన కుటుంబం అతిపెద్ద త్యాగమే చేసిందని, ఆస్తులు తెగనమ్ముకొని మరీ అండగా నిలిచామని గుర్తు చేసుకున్నారు. గత ఏడాది వరకూ తమకు సొంత ఇల్లు లేదని, ప్రస్తుతం డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం చేస్తున్న తమ కుమార్తె 70 లక్షల లోను తీసుకుంటే గానీ సొంత ఫ్లాట్‌ను సమకూర్చుకోలేక పోయామని చెప్పుకొచ్చారు.

**నాన్ ఒలింపిక్ అంశం కావడమే శాపమా?**



విలువిద్య క్రీడలో రికర్వ్, కాంపౌండ్ అన్న రెండు విభాగాలున్నాయి. అయితే, కాంపౌండ్ తరగతి ఆర్చరీ ఒలింపిక్స్ అధికారిక క్రీడాంశాలలో లేకపోడం జ్యోతి సురేఖ పాలిట శాపంగా మారిందని క్రీడావిశ్లేషకులు భావిస్తున్నారు. ప్రపంచ, ఆసియా క్రీడలు, కామన్వెల్త్ స్థాయిలోనే పతకాలు సాధించే అవకాశం ఉంది. ఒలింపిక్స్‌లో మాత్రం కాంపౌండ్ ఆర్చరీ ఓ ప్రధాన అంశం కాకపోడంతో ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోడం లేదన్న విమర్శ సైతం ఉంది.

**అంతర్జాతీయ స్థాయిలో 30 స్వర్ణాలు**

జ్యోతి సురేఖ గత దశాబ్ద కాలంలో అంతర్జాతీయ, ప్రపంచ, ఆసియా, కామన్వెల్త్ విభాగాల విలువిద్య కాంపౌండ్ విభాగంలో 30కి పైగా బంగారు పతకాలు సాధించింది. అయినా తన కుమార్తెకు తగిన ప్రోత్సాహం లేదంటూ జ్యోతి సురేఖ తల్లిదండ్రులు నిరాశ వ్యక్తంచేస్తున్నారు.

పురుషుల జావలిన్ త్రో విభాగంలో రజత పతకం సాధించిన కిశోర్ కుమార్ జెనాకు ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయిక్ కోటీ 50 లక్షల రూపాయలు నజరానాగా ప్రకటించారు. హాకీలో బంగారు పతకం సాధించిన ఒక్కో ఆటగాడికి 5 లక్షల రూపాయలు చొప్పున అందించారు. అదే.. తెలంగాణ షూటర్ ఈషా సింగ్, ఆంధ్ర ఆర్చర్ జ్యోతి సురేఖలు ఏమాత్రం ఖర్చులేని, ప్రచారానికి మాత్రమే ఉపయోగపడే అభినందన సందేశాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ★

# భారత 'బంగారు కొండలు' వీరే!



1. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ విభాగంలో దివ్యాంశ్ సింగ్ పన్వార్, రుద్రాక్ష పాటిల్, ఐశ్వర్యప్రతాప్ సింగ్ తోమర్‌లతో కూడిన భారతజట్టు తొలి బంగారు పతకం అందు కొంది.
2. క్రికెట్ మహిళల విభాగంలో శ్రీలంకను ఓడించడం ద్వారా భారత్‌కు రెండో స్వర్ణం దక్కింది.
3. అశ్వక్రీడ డ్రెస్సేజ్ టీమ్ విభాగంలో అనూష్ అగర్వాలా, హృదయ్ విపుల్ చద్దా, సుదీప్తి హజేలా, దివ్యాకృతి సింగ్‌లతో కూడిన భారత జట్టు స్వర్ణ విజేతగా నిలిచింది.
4. అశ్వక్రీడ డ్రెస్సేజ్ వ్యక్తిగత విభాగంలో అనూష్ అగర్వాలా భారత్‌కు 4వ స్వర్ణం అందించాడు.
5. షూటింగ్ పిస్టల్ మహిళల టీమ్ విభాగంలో మను బాకర్, ఈషా సింగ్, రిథిమ సంగ్వాన్‌లతో కూడిన భారత జట్టు ఐదో స్వర్ణం అందుకుంది.
6. షూటింగ్ రైఫిల్ మహిళల 50 మీటర్ల 3 పొజిషన్ వ్యక్తిగత విభాగంలో సిఫ్ట్ కౌర్ సమ్రా బంగారు పతకం సాధించింది.
7. షూటింగ్ పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ విభాగంలో సర్బజోత్ సింగ్, అర్జున్ సింగ్ చీమా, శివ నర్వాల్‌లతో

కూడిన భారతజట్టు 7వ స్వర్ణం సంపాదించింది.

8. షూటింగ్ రైఫిల్ పురుషుల 50 మీటర్ల టీమ్ విభాగం 3 పొజిషన్ ఫైనల్లో ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్, స్వప్నిల్ కుశాలే, అఖిల్ షరోన్‌లతో కూడిన భారతజట్టు 8వ బంగారు పతకం సాధించింది.
9. షూటింగ్ మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో పాలక్‌కు స్వర్ణం.
10. టెన్నిస్ మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ బొపన్న-రుతుజా భోంస్లేల జోడీకి స్వర్ణం.
11. స్క్వాష్ పురుషుల టీమ్ విభాగంలో అభయ్ సింగ్, సౌరవ్ గోశాల్, మహేశ్ మంగోకర్‌లకు స్వర్ణం.
12. షూటింగ్ పురుషుల ట్రాప్ టీమ్ విభాగంలో జోర్వార్ సింగ్, కీనన్ దరియస్, ప్రథ్వీరాజ్ తొండైమాన్‌లకు స్వర్ణం.
13. పురుషుల షాట్‌పుట్‌లో తేజిందర్ పాల్ సింగ్ తూర్‌కు స్వర్ణం.
14. పురుషుల 3 వేల మీటర్ల స్టీపుల్ చేజ్‌లో అవినాశ్ సబ్లేకి స్వర్ణం.
15. మహిళల 5 వేల మీటర్ల పరుగులో పారుల్ చౌధరికి స్వర్ణం.
16. మహిళల జావలిన్ త్రోలో అన్ను రాణీకి స్వర్ణం.
17. ఆర్చరీ మిక్స్‌డ్ డబుల్స్‌లో ఒజాస్- జ్యోతి సురేఖ జోడీకి స్వర్ణం.
18. పురుషుల జావలిన్ త్రోలో నీరజ్ చోప్రాకు స్వర్ణం.
19. పురుషుల 400 మీటర్ల రిలేలో అనాస్ మహ్మద్ యాహ్యా, అమోజ్ జేకబ్, మహ్మద్ అజ్మల్, రాజేశ్ రమేశ్ ల జట్టుకు స్వర్ణం.
20. ఆర్చరీ మహిళల కాంపౌండ్ టీమ్ విభాగంలో జ్యోతి సురేఖ, అదితి గోపిచంద్ స్వామి, పర్నీత్ కౌర్ కు స్వర్ణం.
21. స్క్వాష్ మిక్స్‌డ్ డబుల్స్‌లో దీపిక పల్లికల్-హరిందర్ పాల్ సింగ్ సంధూలకు స్వర్ణం.
22. పురుషుల హాకీలో భారత్‌కు స్వర్ణం.
23. ఆర్చరీ మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో జ్యోతి సురేఖకు స్వర్ణం.
24. ఆర్చరీ పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో ఓజాస్ ప్రవీణ్ దేవ్ తాలేకి స్వర్ణం.
25. మహిళల కబడ్డీలో భారత్‌కు స్వర్ణ పతకం.
26. పురుషుల కబడ్డీలో భారత్‌కు స్వర్ణం.
27. బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టిల జోడీకి స్వర్ణం.
28. క్రికెట్ పురుషుల విభాగంలో రుతురాజ్ గయక్వాడ్ నాయకత్వంలోని భారత జట్టుకు స్వర్ణం. ★



# అదంతా అసత్యాల

**నాస్తికులు, చాలామంది హేతువాదులు, క్రైస్తవులు, ఈవీ రామస్వామి ప్రేరేపిత ఉన్మాదులు అంతా కూడా అబద్ధాల ప్రచారంతోనే సనాతన ధర్మాన్ని జయించాలని ఉవ్విళ్లూరారు, ఊరుతూనే ఉంటారు. ఇందిరాగాంధీ వితంతువు కాబట్టి ఆమెను పూరీ జగన్నాథస్వామి ఆలయంలోకి అనుమతించలేదని తెలంగాణ నాస్తికుడొకుడు ఆ మధ్యకాలంలో విపరీతంగా ప్రచారం చేశాడు. సామాజిక మాధ్యమాలలో హోరెత్తించాడు. ఆమె ఒక పార్సీ మతస్థుడిని వివాహం చేసుకున్నది కాబట్టి, వివాహ వ్యవస్థ ప్రకారం ఇక ఆమె హిందువు కాదు కాబట్టి ఆ ఆలయ నిబంధనల మేరకు పూజారులు దర్శనానికి అనుమతించలేదు. హిందువులకు తప్ప అన్యమతస్థులకు ప్రవేశం లేదంటూ గుడి ప్రవేశ ద్వారం పక్కనే గోడ మీద ప్రధాన భాషాలలో ఈ విషయం రాసి ఉంటుంది. గుడిలోకి హిందువులకు మాత్రమే అనుమతి. ఈ క్షణాన వెళ్లి చూసినా అది అర్థమవుతుంది. హిందూ వితంతువులు ఏ అడ్డూ లేకుండా స్వామివారిని దర్శనం చేసుకుని రావచ్చు.**

ద్రవిడవాదులు, ఇతర హిందూ వ్యతిరేకులు సనాతన ధర్మం మీద ప్రచారం చేస్తున్న అంశాలు ఎంత అభూత కల్పనలో తమిళనాడు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ పి.కనగసభాపతి ఇటీవల ఆర్గనైజర్ పత్రికకు రాసిన వ్యాసంలో ఉదహరించారు. ఇలాంటి కొన్ని అబద్ధాల గురించి ఇక్కడ ప్రస్తావించుకోవాలి. అవన్నీ డీఎంకే అనే విధ్వంసక రాజకీయపక్షం ఆడుతున్న అబద్ధాలని వేరే చెప్పక్కరలేదు.

తమిళనాడు క్రీడల మంత్రి ఉదయనిధి స్టాలిన్



# బురద, అబద్ధాల వరద



చెన్నైలో జరిగిన సనాతన ధర్మ నిర్మూలన సదస్సులో నిర్వాహకులు ఉపయోగించిన లోగో

ఈ సంవత్సరం సెప్టెంబర్ 2న ప్రమాదకరమైన ఒక క్రీడను ఆరంభించారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు అన్నామలైకు లభిస్తున్న ఆదరణ ఇందుకు పరోక్ష కారణం. సనాతన ధర్మాన్ని వ్యతిరేకిస్తే సరిపోదు, సమూలంగా నిర్మూలించడమే పరిష్కారం అంటూ ముఖ్యమంత్రి కుమారుడు ఉదయనిధి ఉపన్యాసం ఇచ్చాడు. ఇది దేశమంతటా చర్చను లేవదీసింది. డీఎంకే ప్రముఖులు ఇలాంటి ఎన్ని అబద్ధాలు జనం మీద రుద్దడానికి యత్నించారో కనగసభాపతి వివరించారు. సనాతన ధర్మం కింది కులాలను అణగదొక్కిందని పాడిందే పాడడం ద్రవిడ వాదులు మొదటి నుంచి అనుసరిస్తున్న మైండ్‌గేమ్. కింది కులాల వారు చదువుకునే అవకాశాన్ని ఆ ధర్మం నిరాకరించిందని వారి ఆరోపణ. ఇది పచ్చి అబద్ధం. ఈ మాట ఎవరో మఠాధిపతి ప్రకటించలేదు. ఆ రాష్ట్ర శాసనసభ స్పీకర్ అప్పావు ఒక సభలో చెప్పిన అంశాలే అందుకు నిదర్శనం. తూత్తుకుడి జిల్లాలోని ఒక కళాశాల స్నాతకోత్సవానికి హాజరైన స్పీకర్ తెలిసో తెలియకో ఒక విషయం చెప్పారు. ఈ విషయం కంటే ముందు ఇంకొక విషయం చెప్పాలి. తిరుచ్చిలో 2022 జూన్‌లో కేథలిక్ మిషనరీల కార్యక్రమంలో పాల్గొని చెప్పిన సంగతి అది. ఈ దేశంలోకి క్రైస్తవ మిషనరీలు వచ్చి విద్యను అందరికి అందుబాటులోకి తెచ్చాయి అని ప్రకటించారు అప్పావు. దేశంలోకి సామాజిక న్యాయం తెచ్చినది కూడా మిషనరీలేననీ, దాని కొనసాగింపే ద్రవిడ ఉద్యమమనీ కూడా సెలవిచ్చారు. కానీ ఈ మధ్య తూత్తుకుడి జిల్లాలో మాట్లాడుతూ, ఇంతకు పూర్వం దేశంలో కేవలం ఏడు శాతం ప్రజలకు మాత్రమే విద్య అందుబాటులో ఉందని చెప్పారు. అసలు తమిళనాడు అభివృద్ధికి కారకులు కేథలిక్ మిషనరీలేనని కూడా ప్రకటించేశారు. మిషనరీలే ఇక్కడ అడుగు పెట్టకపోతే ఇదొక బిహార్‌లా ఉండేదని కూడా అప్పావు తేల్చి చెప్పారు. అయితే ఈవీ రామస్వామి నాయకర్, కరుణానిధి చేతులు కట్టుకు కూర్చున్నారని చెప్పదలిచారా అన్నట్టు కొందరు ప్రశ్నిస్తే, తాను కేవలం చరిత్ర చెప్పానని అప్పావు సర్దుకున్నారు. ఇలా మిషనరీలను ఆకాశానికి ఎత్తివేయడం 1949 నుంచి తమిళనాడులో సాగుతున్నదే. కానీ ప్రస్తుత ధోరణి, అంటే పూర్వకాలపు విద్య కేంద్ర బిందువుగా జరుగుతున్న ఈ ప్రచారం కొత్తది. తరచి చూస్తే జాతీయ విద్యావిధానం అమలులోకి వచ్చిన తరువాతి పరిణామమే ఇది. ఎన్ని చెప్పినా డీఎంకే నేతలు రాష్ట్ర ప్రజల మీద రుద్ద దలిచిన విషయం ఒక్కటే. పూర్వం బ్రాహ్మణులు కిందికులాల వారికి విద్యను అందకుండా చేశారనే. ఇదంతా సనాతన ధర్మంలో భాగమని చెప్పడం కూడా. ఇప్పుడు కేంద్రంలో ఉన్న ప్రభుత్వాన్నీ, తమిళనాడులో అన్నామలైకు పెరుగుతున్న ఆదరణనీ ఈ ఒక్క ప్రచారం ఎదుర్కొనవచ్చుననే అపోహ దీని వెనుక ఉందనేది పలువురి అభిప్రాయం. అలాగే అసలు అందరికీ విద్య అనే ఆలోచన బ్రిటిష్ ఇండియాలోనిదేనని కూడా ఈ వర్గం ప్రచారం చేస్తుంది. నిజానికి ఇదే పెద్ద అబద్ధం. ద్రవిడ కజగం, ద్రవిడ మున్నేట్ర కజగం, వామపక్షాలు, ఉదార వాదులు ఇప్పటికీ ఈ అబద్ధాన్నే ప్రచారం చేస్తున్నారు.

చరిత్రలో చూస్తే భారత్ విద్యారంగంలో సమున్నత శిఖరాలను చేరుకుంది. క్రీ.పూ. 2700 సంవత్సరాలకు పూర్వమే ఇక్కడ విశ్వవిద్యాలయం వెలసింది. అదే నలందా విశ్వవిద్యాలయం. ఆసియాకే తొలి విశ్వవిద్యాలయం. సుదూర తీరాల నుంచి, చైనా నుంచి కూడా విద్యార్థులు వచ్చి ఇక్కడ విద్య నేర్చుకున్నారు. ఆధునికయుగం దగ్గరకు వస్తే తమిళ ప్రాంతాలు సహా, దేశంలో ఎందరో ఎన్నో రంగాలలో నైపుణ్యం సాధించినవారు కనిపిస్తారు. 1931లో లండన్‌లోని రాయల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎఫైర్స్‌లో ప్రసంగిస్తూ మహాత్మా గాంధీ ఏమన్నారో గుర్తు చేసుకోవాలి. ఆయన మాట్లాడిన కాలానికి 50 నుంచి 100 ఏళ్ల నుంచే భారతదేశంలో విద్యా వ్యవస్థ పతనం జరిగిందని అన్నారు. బ్రిటిష్ విద్యావిధానం వల్లనే స్వదేశీ విద్య అనే అందమైన వృక్షానికి చేటు మొదలయిందని గాంధీజీ వ్యాఖ్యానించారు. శ్రీలంక చరిత్రకారుడు, భారతీయ వ్యవహారాలలో నిపుణుడు ఆనందకుమారస్వామి వ్యాఖ్యలు కూడా స్మరణీయమైనవే. బ్రిటిష్ వారు ప్రవేశపెట్టిన పునాదిలేని విదేశీ విద్యావిధానంతోనే భారతదేశంలో సామాజిత సమతౌల్యం దెబ్బతిన్నదనే ఆనందకుమారస్వామి నిష్కర్షగా చెప్పారు. అప్పటివరకు సమాజంలోని అన్ని వర్గాల వారు విద్య దగ్గర పోటీపడిన మాట వాస్తవమని ఆయన గుర్తు చేశారు. ప్రఖ్యాత చరిత్రకారుడు విల్ డ్యూరాంట్ చెప్పిన వాస్తవం కూడా విశేషమైనది. 1930 నాటి విద్యా రంగ పరిస్థితిని ఆయన నమోదు చేశారు. ఆ రోజులలో బాలురలో కేవలం 7 శాతం, బాలికలలో 1.5 శాతమే పాఠశాల విద్యకు నోచుకున్నారు. మొత్తంగా ఆ వయసు వారిలో 4 శాతం మాత్రమే పాఠశాలలకు వెళ్లారు. బ్రిటిష్ ఇండియా నాటి విద్య అందరికీ అందుబాటులోకి వచ్చిందని చెప్పడం ఇంకా ఎంత అబద్ధమో కూడా విల్ చెప్పారు. అప్పటి పాఠశాలల్లో చేరడం అంటే విపరీతమైన ఖర్చుతో కూడుకున్నది. దీనితో చాలామంది పాఠశాల విద్యకు దూరంగానే ఉండిపోయారు. ఆ ముగ్గురు చెప్పిన దానిని బట్టి బ్రిటిష్ ఇండియా కాలానికి ముందు దేశంలో విద్యారంగం విస్తృతంగా ఉంది. దానిని ధ్వంసం చేసినవారు ఆంగ్లేయులు. మెకాలే విద్యా విధానం, అందులోని కుట్ర నిన్నటివరకు కమ్యూనిస్టులు కూడా విమర్శించిన సంగతిని విస్మరించలేం. కేవలం గుమాస్తాలను తయారు చేయడమే ధ్యేయంగా మెకాలే విద్యావిధానం తయారుచేశాడని ఎందరో విమర్శించారు. మరి ఒక్కసారిగా ఇంగ్లిష్‌వారి మీద, భారతదేశ విద్యా విధానానికి వారు చేసిన సేవ మీద ఇంత ప్రేమ ఎందుకు పుట్టుకు వచ్చింది? బీజేపీ మీద ద్వేషం బ్రిటిష్ వాడి మీద ప్రేమగా మార్చుకుంటే అది ఆత్మహత్యా సదృశమే తప్ప మరొకటి కాదు.

డీఎంకే, దీని తోకలు చేస్తున్న ప్రచారాల లక్ష్యం సనాతన ధర్మ ధ్వంసమే. ఈ విషయాన్ని వాళ్లేమీ దాచిపెట్టడం లేదు. కాబట్టి చెప్పవలసినది ఒక్కటే. వీళ్లు చెబుతున్న అంశాలేవీ వాస్తవికమైనవి కాదు. హిందూధర్మాన్ని నాశనం చేయడానికి ఇలాంటి కుట్రలు పన్నడం నీచమే తప్ప మరొకటి కాదు. నాస్తికులు, ఉదారవాదులు క్రైస్తవ మిషనరీల ప్రోద్బలంతో చరిత్రను ఎంతగా వక్రీకరించడానికైనా వెనుకాడడం లేదు. వాస్తవాలు తెలుసుకోవడమే ఇప్పుడు అందరి కర్తవ్యం. వాటిని అందుబాటులోకి తేవలసిన అవసరం కూడా హిందూ సమాజం మీద ఉంది.

'ఆర్గనైజర్' నుంచి

# ఆపరేషన్ క్లీనప్?

**నాటి అమెరికా విదేశాంగమంత్రి హిల్లరీ క్లింటన్ మన పెరట్లో పాములను పెంచితే అవి పక్కవారినే కాదు మనను కూడా కాటేస్తాయంటూ పొరుగు దేశమైన పాకిస్తాన్‌కు హితవు చెప్పడం, వారు దానిని పెడచెవిన పెట్టడం మనకు తెలిసిన విషయమే. కానీ వారు ఇప్పుడు దాని ఫలితాలను అనుభవిస్తున్నట్టు కనిపిస్తోంది. అవకాశం కల్పించుకుని మరీ మన దేశంలో తీవ్రవాదాన్ని ప్రోత్సహించిన పాకిస్తాన్ ఇప్పుడు దాని దెబ్బకు కుదేలవుతున్నది. బెలూచీలు, టిటిపి వారు చేస్తున్న దాడులు పాక్‌ను అల్లాడిస్తున్నాయి. ముఖ్యంగా పోలీసులను, రక్షణ దళాలను లక్ష్యంగా చేసుకుని మరీ దాడులు జరుగుతుండడంతో, తీవ్రవాదం రుచి ఎంత చేదుగా ఉంటుందో పాక్‌కు ప్రత్యక్షంగా తెలుస్తోంది.**



పాకిస్తాన్ ప్రభుత్వ అండ, ప్రోత్సాహంతో భారత్‌లో పెచ్చరిల్లిన ఉగ్రవాదులు ఆ దేశంలోనే అనామకుల చేతిలో బలైపోతుండడం అటు తీవ్రవాదులనే కాదు, పాక్ ప్రభుత్వాన్ని కూడా కలవర పెడుతున్నది.

ఇటీవలి కాలంలో విదేశాలలో 16మంది భారత వ్యతిరేక తీవ్రవాదులను, కార్యకర్తలను గుర్తు తెలియని గన్‌మెన్ కాల్పులు జరిపి చంపివేయడం సంచలనాన్ని రేకెత్తిస్తోంది. కేవలం పాకిస్తాన్‌లోనే కాక కెనెడాలో కూడా ఈ హత్యలు జరుగుతుండడంతో ఆ దేశాలు ఇవి భారత గూఢచారి సంస్థ రిసెర్చ్ అండ్ ఎనాలసిస్ వింగ్ (ఆర్ఎడబ్ల్యు –రా) చేస్తోందంటూ తీవ్ర ఆరోపణలకు దిగుతున్నాయి. ఇస్లామిక్ తీవ్రవాదులే కాదు, ఖలిస్తానీ తీవ్రవాదులు కూడా ఇటువంటి ఘటనలలో మరణించారు. దాదాపు 2021లో ప్రారంభమైన ఈ కాల్చివేతలు ఈ ఏడాది మరీ ఉధృతం కావడంతో ఇవి అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాయి.

ఇటీవలే లష్కర్– ఎ– తాయిబా (ఎల్ఇటి) వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్ కుమారుడు (కొందరు మేనల్లుడు అని అంటున్నారు) కమాలుద్దీన్ సయీద్‌ను 26 సెప్టెంబర్ 2023న కరాచీ నుంచి దుండగులు ఎత్తుకుపోగా, ఎల్ఇటి సహ వ్యవస్థాపకుడు, అగ్ర సిద్ధాంతకర్త ముఫ్తీ కైజర్ ఫరూక్‌ను కరాచీలో గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి చంపడంతో ఐఎస్ఐ కూడా ఉలిక్కి పడిందని చెప్తున్నారు. హాఫీజ్ సయీద్ కుడి భుజంగా వ్యవహరిస్తున్న ఫరూక్ హత్యతో గత 19నెలల్లో విదేశాలలో హత్యలకు గురైన వారిసంఖ్య 16కు చేరుకుంది. ఇటీవలి కాలంలో చోటు చేసుకున్న పరిణామాలు అటు సయీద్‌కు, ఇటు అతడి సంస్థలు జమాయిత్– ఉద్– దావా, ఎల్ఇటికి పెద్ద దెబ్బ అని చెప్పక తప్పదు.

భారత వ్యతిరేక తీవ్రవాదులను విదేశాలలో హననం చేయడం అన్నది శ్రీనగర్ నవాకదళ్‌కు చెందిన ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ జమ్ము అండ్ కాశ్మీర్ (ఐఎస్‌జెకె) అగ్ర కమాండర్ అయిజాజ్ అహ్మద్ అహంగర్ అలియాస్ అబూ ఉస్మాల్ అల్– కాశ్మీరీని 18 జులై 2019న ఆఫ్ఘనిస్తాన్‌లో హత్య చేయడంతో ప్రారంభమయ్యాయని చెప్పకతప్పదు. అయితే, అది పెద్దగా సంచలనాన్ని రేకెత్తించ లేదు. అనంతరం, ఐసి 814 విమానాన్ని హైజాక్ చేసిన జైష్–ఎ–మహమ్మద్ కార్యకర్త మిస్త్రీ జహూర్ ఇబ్రహీం అలియాస్ జహీద్ అఖూంద్‌ను 1 మార్చి 2022న కరాచీలో గుర్తు తెలియని గన్‌మెన్ కాల్చివేయడంతో ఈ వరుస కాల్చివేతల ప్రహసనం ప్రారంభమైందని చెప్పవచ్చు. అదే సంవత్సరం 19 సెప్టెంబర్‌న నేపాల్ రాజధాని ఖాట్మండు బయట కశ్మీరీ తీవ్రవాదంతోనూ, ఐఎస్ఐతోనూ సన్నిహిత సంబంధాలు కలిగిన మహమ్మద్ లాల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు.

ఈ హత్యలు కేవలం ఇస్లామిక్ తీవ్రవాదులనే కాక ఖలిస్తానీ తీవ్రవాదులను కూడా లక్ష్యంగా చేసుకుని జరుగుతుండడంతో ఆ సంస్థలు, ఆ దేశాలు ఇందులో భారత్ పాత్ర ఉందని అనుమానిస్తున్నాయి. పంజాబ్ పోలీసు కేంద్రకార్యాలయంపై ఆర్‌పిజి దాడి సహా అనేక భారత్ వ్యతిరేక తీవ్రవాద కార్యకలాపాలకు పాల్పడిన బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ తీవ్రవాది హర్వీందర్ సింగ్ సంధు అలియాస్ రిండా లాహోర్‌లోని సైనిక ఆసుపత్రిలో డ్రగ్ ఓవర్‌డోస్‌తో అనుమానాస్పద పరిస్థితులలో 19నవంబర్ 2022న మరణించడం కూడా ఈ క్రమంలోనే అనుమానాలకు తావిచ్చింది.

హిజ్బుల్ ముజాహిదీన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రధాన కార్యకర్త బషీర్ అహ్మద్ పీర్ అలియాస్ ఇంతియాజ్ ఆలమ్‌ను 20 ఫిబ్రవరి 2023న గుర్తు తెలియని గన్‌మెన్ పాకిస్తాన్‌లోని రావల్పిండిలో కాల్చి చంపారు. వారం తిరక్కుండానే 26 ఫిబ్రవరిన అల్బదర్ ముజాహిదీన్ మాజీ కమాండర్ సయ్యద్ ఖలీద్ రజాను కరాచీలో గుర్తుతెలియని గన్‌మెన్ కాల్చి చంపడంతో పాకిస్తానీయులు ఉలిక్కి పడ్డారు. మరొక వారం తిరిగేసరికి, అంటే 4 మార్చిన ప్రముఖ జిహాదీ తీవ్రవాది, సిద్ధాంతవేత్త అయిన సయ్యద్ నూర్ షోలాబార్‌ను పాకిస్తాన్, ఖైబర్ పఖ్తూన్‌వాలోని బారా ఖైబర్‌లో గుర్తు తెలియని గన్‌మెన్ హననం చేశారు.

తమ కార్యకలాపాలకు ఒక నెలపాటు విరామమిచ్చిన ఈ గుర్తుతెలియని గన్‌మెన్ 6 మే 2023న భారత దేశంలో మోస్ట్ వాంటెడ్ తీవ్రవాది, ఖలిస్తానీ కమెండో ఫోర్స్ అధిపతి పరమ్‌జీత్ సింగ్ పంజ్వార్‌ను లాహోర్‌లో కాల్చి చంపారు. మరునెలలోనే కార్యనిర్వహణా పద్ధతి మారింది. మరొక ఖలిస్తానీ వేర్పాటువాది, గతంలో లండన్‌లోని భారతీయ రాయబారి కార్యాలయంపై దాడి చేసిన అవతార్ సింగ్ ఖండా యుకె, బర్మింగ్‌హాంలోని ఆసుపత్రిలో 15 జూన్ 2023న అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించాడు.

ఇక, భారత వ్యతిరేక యాక్టివిస్టు, మాజీ తీవ్రవాది అయిన హర్దీప్ సింగ్ నిజ్జర్‌ను కెనెడా, బ్రిటిష్ కొలంబియాలోని సర్రేలోని గురుద్వారా బయట గుర్తు తెలియని వ్యక్తులు 18 జూన్ 2023న కాల్చి చంపారు.

మరొక నెల విరామానంతరం, ఆగస్టు 5న జమాత్–ఉద్–దావా కార్యకర్త ముల్లా సర్దార్ హుస్సేన్ అరైన్‌ను కరాచీ సింధ్‌లోని నవాబ్‌షా జిల్లాలో గుర్తు తెలియని వ్యక్తులు కాల్చివేశారు. కాగా, ఈ హత్యకు, ఇటువంటి మరికొన్ని హత్యలకు సింధుదేశ్

రెవెల్యూషనరీ ఆర్మీ బాధ్యత తీసుకుని, అవి తామే చేసినట్టు ప్రకటించుకుంది. ఆ తర్వాత, 8 సెప్టెంబర్ 2023న జమ్మూలోని పూంచ్ ప్రాంత ఎల్ఇటి అగ్ర కమాండర్ మహమ్మద్ రియాజ్ అలియాస్ అబూ ఖాసింను పాక్ ఆక్రమిత్ కశ్మీర్‌లోని రావల్‌కోట్‌లోని ఒక మసీదులో గుర్తుతెలియని గన్‌మెన్ కాల్చి చంపడం పాక్ భద్రతా దళాలను కూడా సంచల నానికి గురి చేసింది. నాలుగు రోజులు తిరుగ కుండానే 12 సెప్టెంబర్ 2023న హిజ్బుల్ ముజా హిదీన్, ఎల్ఇటి అగ్ర కార్యకర్త అయిన జియావుర్ – రెహ్మాన్‌ను కరాచీలోని గులిస్తాన్–ఎ– జౌహార్ జిల్లాలో గుర్తు తెలియని బైకర్లు కాల్చి చంపారు. అతడు జామియా అబూబాకర్ సంస్థకు అధికారిగా ఉన్నాడని తెలుస్తోంది.



తప్పించుకు తిరుగుతున్న ఖలిస్తానీ తీవ్రవాది అర్షదీప్ సింగ్‌కు కుడిభుజంగా ప్రాచుర్యం పొందిన సుఖదూల్ సింగ్ అలియాస్ సుఖ దునుకెను 21 సెప్టెంబర్ 2023న కెనడాలోని విన్నిపెగ్‌లో గుర్తు తెలియని వ్యక్తులు కాల్చివేశారు.

**భారత్ పాత్రపై ఆరోపణలు**

గుర్తు తెలియని వ్యక్తులు చంపినవారందరూ ఏదో ఒకరకంగా భారతదేశంలో తీవ్రవాద కార్యకలా పాలకు పాల్పడినవారు లేదా వాటిని ప్రోత్సహించిన వారు కావడంతో అటు పాకిస్తాన్, ఇటు కెనెడా కూడా ఈ హత్యలకు భారతే బాధ్యత వహించాలని వేలెత్తి చూపుతున్నాయి. ముఖ్యంగా ఖలిస్తానీ వేర్పాటువాది హర్దీప్ సింగ్ నిజ్జర్ మరణంలో భారత్ హస్తం ఉందంటూ కెనెడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో ఈ ఉదంతాన్ని అడ్డం పెట్టుకుని తీవ్ర ఆరోపణలు చేశారు. అంతేకాకుండా, భారతదేశంతో ప్రస్తుతం దౌత్యపరమైన సంబంధాలు అత్యంత సవాళ్లతో కూడుకుని ఉన్నాయని కూడా ఆయన పేర్కొన్నారు.

సెప్టెంబరు నెలలో తమ పార్లమెంటులో భారత ప్రభుత్వాన్ని ఈ హత్యకు బాధ్యులని చేస్తూ విమర్శల వర్షం కురిపించారు. ఖలిస్తానీ సిక్కుల ఓటు బ్యాంకును అమూల్యంగా భావించే ట్రూడోను ఇప్పుడు పలువురు విశ్లేషకులు, కమెడియన్లు కూడా 'జస్టిండర్ ట్రూడో' అని పిలుస్తున్నారు. కాగా, ఈ ఆరోపణలు నిరాధారమైనవంటూ న్యూఢిల్లీ కొట్టి పారేసింది. అంతేకాకుండా ఇక్కడి కెనెడా రాయబార కార్యాలయంలో 41మంది దౌత్య సిబ్బందిని లేదంటే వారికిచ్చే దౌత్యపరమైన మినహా యింపులను ఉపసంహరించుకుంటామని హెచ్చ రించడంతో, ట్రూడో ప్రభుత్వం దిగివచ్చి సింగపూర్‌కి, కౌలాలంపూర్‌కు గడువుకన్నా ముందే పంపించారు. భారత్‌తో ప్రైవేటుగా మాట్లాడి సమస్యను పరిష్కరించుకుంటామని పేర్కొంది.

ఈ దౌత్యపరమైన సమస్యలను పరిష్కరించేం దుకు కెనెడా విదేశాంగ మంత్రి మెలానీ జోలీ తాము భారత్‌తో ప్రైవేటుగా చర్చలను కొనసాగిస్తామంటూ చెప్పారు. నిజ్జర్ హత్యానంతరం నెలకొన్న దౌత్యపరమైన వివాదాన్ని గోప్యమైన చర్చల ద్వారా పరిష్కరించుకుంటామంటూ జోలీ చెప్పడంతో, కెనెడా ఒక మెట్టు దిగిందనే విషయం స్పష్టమైంది.

కాగా, ఖలిస్తానీ తీవ్రవాదుల హత్యలు కేవలం మాదక ద్రవ్యాల ముఠా తగాదా అనే వాదన కూడా వినిపిస్తున్నది. ఇటీవలే ఎన్ఐఎ ఖలిస్తానీ తీవ్రవాది అర్షదీప్ సింగ్ అలియాస్ అర్ష్ దల్లా సహచరులనేక మందిపై దాడులు చేసి అరెస్టు చేసింది. సీమాంతర మాదకద్రవ్య తీవ్రవాద కార్యకలాపాలను నిర్వహిస్తున్నందునే వీరిని అరెస్టు చేసినట్టు పేర్కొంది. అటు పాకిస్తాన్‌లోనూ, ఇటు కెనెడాలోనూ గల ఖలిస్తానీ తీవ్రవాదులతో సంబంధాలు కలిగిన నేర సిండికేట్లపై జరిగిన దాడులలో పలువురిని అదుపులోకి తీసుకుంది. లారెన్స్ బిష్ణోయ్, దునేకా, హారీ మార్, నరేందర్ అలియాస్ లాలీ, కాలా జతేరీ, దీపక్ తిను వంటి కరడుగట్టిన నేరగాళ్ల ఆచూకీ కోసం ఈ దాడులు జరిగాయి. వీరందరికీ కూడా కెనెడా, పాక్‌లో ఉన్న మాదక ద్రవ్యాల సిండికేట్లతో సంబంధాలు ఉన్నట్టు అనుమానిస్తున్నారు.

**పాక్ వ్యవహారం**

వరుసగా పాక్‌లో గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో మరణిస్తున్న తీవ్రవాదుల విషయంలో రక్షణ, ఇతర వర్గాలు భారతదేశం హస్తం ఉందనే ఆరోపణలు చేస్తున్నాయి. అయితే, ఈ హత్యలు చేస్తున్నది పాకిస్తాన్ సైన్యం, ఐఎస్ఐదేనని రక్షణ వర్గ, జియో పొలిటికల్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భారతదేశంలో తీవ్రవాదాన్ని రెచ్చగొట్టేందుకు వీరిని పెంచి పోషించిన పాకిస్తాన్ నేడు పలు రకాల వత్తిడుల కారణంగా తాను పాలు పోసి పెంచిన పాములను హరిస్తోందన్నది వారి వాదన. పూర్తి రాజకీయ, ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న పాకిస్తాన్ ఐఎంఎఫ్ నిధులు తెచ్చుకునేందుకు కూడా అనేక షరతులకు తల ఒగ్గవలసి వస్తోంది.

ఈ క్రమంలో తమ పెరట్లోనే తీవ్రవాదాన్ని రూపుమాపాలనే షరతు కారణంగా కూడా ఈ చర్యలు తీసుకొని ఉండవచ్చని కొందరు వాదిస్తుండగా, ప్రస్తుతం సైన్యం, ఐఎస్ఐ వద్ద ఒకప్పటిలా నిధులు లేకపోవడం, ఇటువంటి వైట్ ఎలిఫెంట్‌లను పోషించడం ఖర్చుతో కూడుకున్న విషయం కావడం వల్లే వారిని ఇలా గుర్తు తెలియకుండా హతమారుస్తోందని వాదించేవారూ లేకపోలేదు. మరొక కోణంలో, పాకిస్తాన్ ఎప్పుడు సంక్షోభంలో పడినా పెద్దన్నల్లా ఆదుకునే యుఎఇ, సౌదీ అరేబియాలు ప్రస్తుతం భారత్‌తో సత్సంబం ధాలను నెరపుతుండడం, వారే తమ దేశాలలో సంస్కరణలకు పూనుకోవడం వంటి కారణాల వల్ల పాకిస్తాన్‌ను కూడా హెచ్చరించి ఉంటారనే వాదన కూడా వినిపిస్తున్నది.

ఏది ఏమైనప్పటికీ, మెరుపు మెరిసినట్టుగా తళు క్కుమని ప్రత్యక్షమై, దుష్ట శిక్షణ చేసి మాయమై పోతున్న ఆ గుర్తు తెలియని వ్యక్తులకు పాకిస్తాన్ లోనూ, భారత్‌లోనూ అనేకమంది కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు.

ఇరు దేశాలకూ చిరాకుగా మారిన వారి మరణంతో, ఇటువంటి కార్యకలాపా లను ప్రోత్సహించి, పాల్పడేవారి సంఖ్య తగ్గి, దేశంలో సాధారణ పరిస్థితులు ఏర్పడతాయని ఆలోచనా పరులైన పాకిస్తానీయులు భావిస్తున్నారు. ఏమైనప్పటికీ, ఆ గుర్తు తెలియని వ్యక్తులు ఎవరన్నది ఇప్పటికీ అక్కడి రక్షణ సంస్థలు కనుగొనలేకపోవడం ఆశ్చర్యమే!

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్




# ప్రభుత్వ తీరుపై సర్వత్రా నిర

రాష్ట్ర ప్రజలు వైసీపీ ప్రభుత్వాన్ని తిరస్కరిస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు, హామీలను బుట్టదాఖలు చేయడమే కాదు... వనరులన్నీ దోచుకోవడం, అవినీతిని ప్రోత్సహించడం, ప్రశ్నించిన గొంతులను నలిపేయడం, పోలీసులతో అక్రమ కేసులు పెట్టించడం, ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడం, భారీగా పన్నులు వేసి, కరెంటు ఛార్జీలు పెంచి ఆర్థిక భారం మోపడం, ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకపోవడం, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయకపోవడం, పారిశ్రామికవృద్ధి చేయక పోవడం, రైతులకు ఆర్థిక సహకారం లేకపోవడం...ఇలా ఒకటేమిటి..? వైసీపీ ప్రభుత్వం అన్నివర్గాలకు వ్యతిరేకంగా పనిచేస్తూ ఆయా రంగాలలో విఫలమైందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సాగునీటి ప్రాజెక్టుల పట్ల పూర్తి అశ్రద్ధ వహించింది. మూడు రాజధానుల పేరుతో అమరావతిని అభివృద్ధి చేయక భూములిచ్చిన రైతులకు వాగ్దాన భంగం చేసి వారిని ముప్పతిప్పలు పెడుతోంది. పంచాయతీల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం సర్పంచుల ఖాతాలకు జమచేసిన ఆర్థిక సంఘం నిధులను దారి మళ్లించింది. ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన సీపీఎస్ హామీకి తూచ్ చెబుతూ, ఇప్పుడు జీపీఎస్‌ను అమలులోకి తెస్తోంది.

వైసీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో ఏ ఒక్క వర్గాన్ని సంతృప్తి పరచలేదు సరికదా వారికి కొత్త సమస్యల సృష్టించి తీవ్ర అసంతృప్తికి గురిచేసింది. ఎప్పుడు ఎన్నికలు జరుగుతాయా? ఎప్పుడు ఈ ప్రభుత్వాన్ని దించేద్దామా? అని అన్ని వర్గాలు ఎదురుచూస్తున్నారు.

**అదుపులేని ఆర్థిక భారం**

ప్రభుత్వం పన్నుల భారాలు మోపి ఆర్థిక భారాలు సృష్టించిందని ప్రజలు ఆక్షేపిస్తున్నారు. అసలే కరోనా వల్ల ఉపాధి కోల్పోయి, జీతాలు పెరగక సమస్యలు పాలైన కుటుంబాలను పన్నులు, ఛార్జీల భారం గుక్క తిప్పుకోనివ్వడం లేదు. వారు అప్పుల పాలైపోతు న్నారు. సర్ ఛార్జి, ట్రూ అప్ ఛార్జీలంటూ విద్యుత్ ఛార్జీల పెంపుతో గతంలో రూ.400 వచ్చే బిల్లు రెట్టింపు అయిందని ఆందోళన వ్యక్తమవుతోంది. బస్సు ఛార్జీలు పెంచారు. కేంద్రం పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించినా రాష్ట్రం ఆ దిశగా చర్యలు తీసుకో లేదు. ఆస్తి పన్నులు పెంచారు. మరుగుదొడ్లపై పన్ను, చెత్తపై పన్నులు వేశారు. ఇలా ప్రతి సాధారణ కుటుంబంపై సగటున నెలకు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు ఆర్థిక భారం పడింది. ఇది తీవ్ర అసంతృప్తికి దారితీసింది.

**నిరుద్యోగులకు రిక్తహస్తం**

వైసీపీ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ విషయంలో ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను పక్కన పెట్టి నిరుద్యోగులకు రిక్తహస్తం చూపింది. 2.41 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీచేస్తామనిచ, మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామనే హామీలు జాడ లేకుండా పోయాయి. కాంట్రాక్టు ఉద్యోగాలు రెగ్యులర్ చేస్తామన్నారు. పల్లె ప్రజలు ఉపాధి కోసం పట్టణాలకు వలస పోనవసరం లేకుండా గ్రామాల్లోనే ఉపాధి కల్పిస్తామన్నారు. కాని అధికారంలోకి వచ్చాక ఏ హామీని అమలు చేయలేదు. జాబ్ క్యాలెండర్ ప్రకటించలేదు. మెగా డీఎస్సీ లేదు. నిరుద్యోగుల పోరాటంతో దిగి వచ్చి ఇటీవల పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయ లేదు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగిస్తున్నారు. నవరత్నాల పథకాల అమలు కోసం వార్డు సచివాలయ ఉద్యోగాలు ప్రకటించి భర్తీ చేశారు. వాలంటీర్ల పేరుతో తమ అనుచరులకు ప్రభుత్వం ద్వారా జీతం ఇప్పించి పార్టీ కార్యక్రమాలకు వాడుకుంటున్నట్లు విపక్షాల ఆరోపణ.

అసలు రాష్ట్రంలో నిరుద్యోగుల సంఖ్యపై కూడా ప్రభుత్వం వద్ద సమాచారం లేదు. రాష్ట్రంలో కొత్తగా ఒక్క పరిశ్రమ ఏర్పడలేదు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆంధ్ర, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాల యాల్లో మోడల్ కెరియర్ కేంద్రాలు ఏర్పాటు చేసినా, వాటిలో నిరుద్యోగుల పేర్లను నమోదు చేసుకోవడం లేదని విద్యార్థి, యువజన సంఘాలు చెబుతున్నాయి. జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు ఆర్భాటమేనని ఈ సంఘాల ఆరోపణ. జాబ్‌మేళాల్లో సైతం బోగస్ కంపెనీలే వస్తున్నాయని, నిరు ద్యోగుల నుంచి డబ్బు ఆశిస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నాయి.

**ఉద్యోగుల మండిపాటు**

అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ప్రకటించిన వైసీపీ అధినేత జగన్ మోహనరెడ్డి, ముఖ్య మంత్రి అయి 52 నెలలు అయినా దానిని అమలు చేయలేదు. పాత పెన్షన్ విధానం అమలులో పడే ఆర్థిక భారం గురించి అప్పుడు ఆలోచించకుండా ప్రకటించడం తమను మోసం చేసినట్లే అని ప్రభుత్వోద్యోగులు అంటున్నారు. అంతేకాదు వారితో సంప్రదించ కుండానే కొత్తగా జీపీఎస్ పెన్షన్ పథకాన్ని అమలు చేసేందుకు చట్టం చేయడాన్ని కూడా వీరు వ్యతిరేకిస్తున్నారు. తమ గోడు చెప్పుకునే వేదిక లేకుండా దుర్మార్గపాలన సాగుతోందని, హక్కుల కోసం ఉద్యమిస్తుంటే






# సన వెల్లువ

సర్కారు అరెస్టులు, దాడులకు పాల్పడుతున్నదని కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నాయి.

**రైతుల ఆగ్రహం**

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు తీవ్ర నిరాశను కలిగించింది. వారికి గిట్టుబాటు ధరలు అందడం లేదు. ధాన్యానికి సకాలంలో చెల్లింపులు జరగక మిల్లర్లకే తక్కువ ధరకు అమ్ము కుంటున్నారు. రైతులకు సబ్సిడీపై ఇచ్చే యంత్ర పరికరాలు, ఉద్యాన రైతులకు అవసరమైన వ్యవసాయ పరికరాల పంపిణీని మూడేళ్ల తరువాత తూతూ మంత్రంగా అయిందని పించారు. రైతులకు 12 వేలు ఆర్థిక సహాయం చేస్తామని నవరత్నాల పథకంలో హామీ ఇచ్చి రూ.7,500 మాత్రమే ఇస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.6 వేలు కలిపి మొత్తం రూ.13,500 సహాయాన్ని తామే ఇస్తున్నట్లు ప్రచారం చేసుకుంటోందని రైతులు ఆరోపిస్తున్నారు. తమ సమస్యలను పరిష్కరించక పోవడంతో కౌలు రైతులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. 32 లక్షల మంది ఉంటే ఐదు లక్షల మందికి కార్డులు ఇచ్చారని, వాటిలోనూ 50 శాతం బోగస్‌వేనని, రైతు భరోసా ఇవ్వకపోవడంతో నష్టపోతున్నామని కౌలు రైతులు వాపోతున్నారు. తమకు గుర్తింపు కార్డులు, రైతు భరోసా, పంట రుణాలు, ఇ-క్రాప్ బుకింగ్, ఇన్పుట్ సబ్సిడీ, పంట బీమా సౌకర్యం తదితర పథకాలు వర్తింప చేయాలని కోరుతున్నారు.

**సర్పంచుల కినుక**

వైసీపీ ప్రభుత్వం తమను తీవ్రంగా వంచించిం దని సర్పంచులు మండి పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులివ్వకపోగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.8 వేల కోట్లను కూడా దారి మళ్లించిందని విమర్శిస్తున్నారు. పైగా సమాంతరంగా గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను తీసుకొచ్చి తమకు రాజ్యాంగం కల్పించిన హక్కులను అడ్డుకుంటోందని ఆరోపిస్తున్నారు. గ్రామ సచివాలయాల కన్వీనర్లు, వాలంటీర్లతో పాటు అధికార పార్టీ తెచ్చిన గృహ సారథుల కారణంగా తాము ఉత్సవ విగ్రహాలుగా మారిపోయామంటున్నారు. సచివాలయ వ్యవస్థ పంచాయతీలో భాగమేనని ప్రభుత్వం మొదట ప్రకటించినా, 2021 ఫిబ్రవరిలో పంచాయతీ ఎన్నికల అనంతరం వాటిపై సర్పంచుల పర్యవేక్షణ, ఉద్యోగులకు సెలవు మంజూరు అధికారాలను తీసేసిందని దీంతో సచివాలయ ఉద్యోగులు తమను లెక్కచేయడం లేదంటున్నారు. గ్రామాల్లో సంక్షేమ కార్యక్రమాల అమలు, లబ్ధిదారుల ఎంపిక వంటివి తమకు తెలియకుండానే జరిగి పోతున్నాయంటు న్నారు. ఎంతో ఖర్చుచేసి గెలిచి అధికారం లేక పోవడంతో తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఎన్నికల ముందు గ్రామాల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన సర్పంచులు ప్రభుత్వం నిధులివ్వక పోవడంతో కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులపై భరోసాతో తమ డబ్బులను కొందరు ఖర్చుచేశారు. కొందరు అప్పులు చేసి ఖర్చుచేశారు. కాని ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించడంతో సర్పంచులు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయారు. ఇలా నిధులు, హక్కులు, అధికారాలు లేక సర్పంచులు ప్రభుత్వం పట్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.



**కార్మికుల నిరసన**

మద్యం, ఇసుక పాలసీలపై కార్మికులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. గత ప్రభుత్వం కంటే తక్కువ ధరకు ఇసుకను అందిస్తామన్న వైసీపీ అధికారంలోకి వచ్చాక కొత్త పాలసీ పేరుతో ఆరు నెలల పాటు ఇసుకను అందుబాటులోకి లేకుండా చేసింది. కృత్రిమ డిమాండ్‌ను సృష్టించింది. కాని ఇసుక బ్లాక్ మార్కెట్‌లో రెండింతల ధరకు లభించింది. ఇసుక కొరత కారణంగా భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి దూరం అయింది. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా ఆర్థిక సహాయం చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించినా పట్టించుకోలేదు. కార్మికులు పనుల్లేక అప్పులపాలై, ఉన్నది అమ్ముకుని, ఆకలితో మరణించిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఇక కార్మికుల్లో ఎక్కువ మంది మద్యం తాగే వారున్నారు. కొత్త మద్యం పాలసీ పేరుతో ప్రభుత్వం తానే దుకాణాలు తెరచి మద్యం అమ్మింది. గతంలో లభించే బ్రాండ్‌లను తీసేసి నాణ్యతలేని మద్యాన్ని రెండు రెట్లు అధిక ధరలకు విక్రయించి తమ జేబులు కొల్లగొట్టినట్లు మద్యపానప్రియులు ఆరోపిస్తున్నారు. వీరంతా ప్రభుత్వంపై మండిపడుతూ ఎప్పుడూ ప్రభుత్వాన్ని దించేద్దామా అని ఎదురుచూస్తున్నారు.

**బీసీ, ఎస్సీ, ఎస్టీల అసంతృప్తి**

తమకోసం ఖర్చుచేయాల్సిన రూ.30 వేల కోట్ల సబ్ ప్లాన్ నిధులు రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందని ఎస్సీ, ఎస్టీలు ఆరోపిస్తున్నారు. తమ జీవనోపాధికి అమలుచేస్తున్న 27 సంక్షేమ పథకాలు రద్దు చేశారని, తమ పిల్లలకు విదేశీ విద్యను దూరం చేసినట్లు దళితులు విమర్శిస్తున్నారు. ఈ ప్రభుత్వ హయాంలో తమపై దాడులు పెరిగాయని ఆరోపిస్తున్నారు. తమకు కేటాయించాల్సిన సబ్ ప్లాన్ నిధులు రూ.75,760 కోట్లు దారి మళ్లించారని బీసీలంటు న్నారు. తమకు ఆర్థిక సహకారం అందిస్తామంటూ ఏర్పాటు చేసిన కులాల కార్పొరేషన్లకు నిధులు మంజూరు చేయక నిర్వీర్యం చేసిందని ఆరోపిస్తు న్నారు. తమకు స్వయం ఉపాధి, జీవనోపాధి వంటి వాటికోసం ప్రభుత్వం కేటాయించిన 30కి పైగా సంక్షేమ పథకాలు రద్దు చేశారని వీరు ఆవేదన చెందుతున్నారు.

**వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్**

# యుగాయుగాల దేవుడు రాముడు



శ్రీరాముడు ధర్మస్వరూపుడు. 'ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే...' అన్నట్టు భూమండలంలో అవతరించి ఆదర్శ ప్రాయమైన మానవధర్మాన్ని సర్వతోముఖంగా ప్రకటించాడు. ఆయన జ్ఞానస్వరూపుడు, స్థితప్రజ్ఞుడు. లోకంలో రామనామం ఎరుగనివారు ఉండరు. పది ఆవాసాలైనా లేని పల్లెల్లో కూడా పూజలు అందుకునే యుగయుగాల దేవుడు. ముక్తి ప్రదుడు. తెలిసోతెలియకో రామ నామస్మరణతో సమస్త పాపాలు నశిస్తాయని, రామతత్వాన్ని గ్రహించి అనుసరించడం వల్ల విశేష ఫలం కలుగుతుందని విజ్ఞులు చెబుతారు.

సనకస నందనుల శాపకారణంగా రావణ కుంభకర్ణులుగా రాక్షస జన్మనెత్తిన జయవిజయులకు ముక్తిని ప్రసాదించడం రామావతార లక్ష్యంలో ఒక కారణం కాగా, మరో కథనం కూడా ప్రచారంలో ఉంది. సమాజానికి సేవచేయలేని వారు మోక్షార్హులు కారంటారు. సత్యయుగం లేదా త్రేతాయుగానికి ముందు యుగానికి చెందినవారిలో అలాంటి వారు కొందరు మోక్షం పొందలేదని, వారంతా త్రేతా యుగంలో వానరులుగా జన్మించి, శ్రీరామ సేవలో తరించారని అంటారు.

రామాయణంలో రాముడి విశిష్టతను వివరిస్తూ, షోడశ మహాగుణాలు ఆయనలో ఉన్నాయని వాల్మీకి మౌని వర్ణించారు. తండ్రి మాటను జవదాటని తనయుడిగా, సోదరులను అభిమానించిన అన్నగా, దూరమైన భార్య కోసం నిరంతరం పరితపించే భర్తగా, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా వారి మాటకు విలువిచ్చిన ప్రభువుగా... ఇలా అనేకానేక అంశాలలో ఆదర్శమూర్తిగా నిలిచాడు. అందరికీ ఆదర్శ ప్రాయుడు. పంచేంద్రియాలపై పూర్తి నియంత్రణను కలిగి ఉన్నవాడు. ఆలోచనాపరుడు. అహంకారం లేని వాడు. అందువలనే పురుషోత్తముడిగా గుర్తింపు పొందాడు.

రాముడు పితృవాక్య పరిపాలకుడే కాదు. కన్నతల్లి కౌసల్యతో సమానంగా పినతల్లులు సుమిత్ర, కైకలను గౌరవించాడు, ప్రియపుత్రుడిగా మన్ననలు అందుకున్నాడు. తన వెంట కుమారుడిని అడవికి పంపిన సుమిత్రతో, కుమారుడి పట్టాభిషేక ఆశతో తనను అడవులకు పంపిన కైక పట్ల ఒకేలా వ్యవహరించాడు.

**సామాజిక సంబంధాలు**

శ్రీరాముడి జీవితం మొత్తం మానవులకు ఎన్నో విషయాలను తెలియచేస్తుంది. ఏ సందర్భంలో ఎలా ప్రవర్తించాలో, తోడబుట్టినవాళ్లతో ఎలా మెలగాలో, ప్రజల మన్ననలు ఎలా పొందాలో స్పష్టం చేస్తుంది. క్షమాగుణం, ప్రశాంతత, సహనం విలువల గురించి తెలియచేస్తుంది. చెడుపై ధైర్యంగా ఎలా పోరాటం జరపాలో వివరిస్తుంది. స్నేహం విలువ గురించి తెలియచేస్తుంది. శత్రువుతో కూడా మిత్రుత్వాన్ని ఎలా పొందాలో వివరిస్తుంది.

సోదర ప్రేమ రాముని చూసి నేర్చుకోవలసిందే. తమ్ముడు లక్ష్మణుడు కొద్దిపాటి దుడుకు స్వభావి అయినప్పటికీ ఏనాడూ పల్లెత్తు మాటనలేదు. ఇంద్రజిత్తు ప్రయోగించిన బాణానికి మూర్ఛిల్లిన

ఆధ్యాత్మికం

❋ పెరటి బంగారం ❋

# కూరల్లో రారాజు ఓషధిగా మారాజు వంకాయ



కూరల్లో రారాజు, పెరటి పంటల్లో మేలిమి బంగారం లాంటి వంకాయ కూరను ఇష్టపడని వారెవరుంటారు! మసాలా దట్టించి.. నూనెలో వేయించి చేసిన గుత్తి వంకాయ కూరను ఆరగిస్తే భలే పసందుగా ఉంటుంది. అల్లం పచ్చి మిరప కాయ వేసి, పైన కొత్తిమీర చల్లినా ఆ రుచే వేరు. వంకాయను కాలేసిన పచ్చడి, వంకాయ పులుసు పచ్చడి... ఒకటేమిటి ఎలా చేసినా వంకాయ 'వన్' కాయే! అయితే, కొందరికి ఈ కూర పడక పోవడంతో తినడానికి ఇష్టపడరు. చర్మ సంబంధమైన అలర్జీలతో బాధపడేవారు వంకాయలకు దూరంగా ఉండటమే మంచిది. అలాంటప్పుడు వంకాయను ఎలా ఆరోగ్యకరమైన కాయగూర అంటారనేగా సందేహం..? ఆ ఒక్క కారణం తప్ప.. మిగతా విషయాల్లో వంకాయ చాలా ఉత్తమమైనది. వారానికి ఒక్కసారి వంకాయను ఆహారంగా తీసుకున్నా చాలు.

**వంకాయలోని ఆరోగ్య ప్రయోజనాలివే...**

టైప్-2 మధుమేహం రోగుల రక్తంలోని చక్కెర్ల (గ్లోకోజ్) స్థాయిని తగ్గించడంలో వంకాయ బాగా పనిచేస్తుంది. వంకాయలో పిండి పదార్థాలు, ఫైబర్ సమృద్ధిగా ఉంటాయి. ఇందులోని పొటాషియం

**దోర్బల పూర్ణిమాస్వాతి**

తమ్ముడిని చూసి తల్లడిల్లాడు. భరతునితో కూడా ఎంతో వాత్సల్యంతో మెలిగాడు. పాదుకా పట్టాభిషేకంతో రాజ్యపాలన సాగిస్తున్న భరతుడికి రాజుకావాలనే కోరిక ఉందేమో తెలుసుకోవాలని వనవాసానంతరం అయోధ్యకు వచ్చే ముందు హనుమను పంపాడు. ఒకవేళ తమ్ముడి అభీష్టం అదే అయితే రాజ్యత్యాగానికి కూడా సిద్ధపడ్డాడు. కడపటి తమ్ముడు శత్రుఘ్నుని అమితంగా ప్రేమించాడు. లవణాసురుడనే రాక్షసుని వధకు అతనినే నియోగించి, అతడు జయించిన రాజ్యాన్ని అతడికే అప్పగించాడు.

నిషాద రాజైన గుహుడు, వానర రాజు, సుగ్రీవుడు, భావి లంకాధిపతి విభీషణుడితో మిత్రధర్మం పాటించాడు. ధర్మపత్ని సీతతోనూ స్నేహభావంతోనే మెలిగాడు. శ్రీరాముడి కాలంలో రాజులకు ఎందరో భార్యలు కలిగి ఉండేవారు. ఆ సమయంలో కూడా శ్రీరాముడు ఏకపత్నీవ్రతుడిగా పేరొందాడు. దాదాపు 1000 ఏళ్ళ పాటు రాజ్యాన్ని పరిపాలించిన రాముడు సీతాదేవిని తప్ప మరొక మహిళను కన్నెత్తి చూడలేదు. కామం, కోపం, అత్యాశ, అసూయ వంటి అవలక్షణాలు కలిగిన రావణుడిని ఆత్మశత్రువుగా పేర్కొంటారు. రావణుడి వధతో శ్రీరాముడు ఈ లక్షణాలను కూడా వధించాడని అంటారు.

**స్థితప్రజ్ఞత**

రాముడి జీవితంలో అన్నీ విపత్తులే. సింహాసనాన్ని అధిష్ఠించడానికి సకల అర్హతలూ ఉన్నా, రాజ్యాన్ని కోల్పోయాడు. అడవికి వెళ్లాడు. అక్కడ భార్య సీత అపహరణకు గురైంది. ఆమెను తిరిగి పొందడానికి యుద్ధం చేశాడు. సీతతో అయోధ్యకు తిరిగి వచ్చాక కూడా సంతోషం దక్కలేదు. నిందలను ఎదుర్కొని ఇల్లాలిని అడవులకు పంపాడు! పట్టపురాణి సీతమ్మ కారడవిలో బిడ్డలకు జన్మనివ్వాల్సి వచ్చింది. ఇది చాలదన్నట్టు.. వారెవరో తెలియక, రాముడు తన సొంత పిల్లలతో యుద్ధం చేశాడు. ఆపై సీత భూమిలో కలిసి పోయింది. స్పష్టంగా, ఇది ఒక విపత్తుల పరంపర. ఎన్ని వైఫల్యాలు ఎదురైనా ధైర్యంగా, స్థైర్యంగా స్థితప్రజ్ఞతో వ్యవహరించి ఆదర్శంగా నిలిచాడు రాముడు.

వేల ఏండ్ల కిందట పాలకులంటే ఆక్రమణ దారులే. అలాంటి కాలంలో రాముడు ఆదర్శ వంతమైన మానవత్వాన్నీ, త్యాగాన్నీ, న్యాయాన్నీ ప్రదర్శించాడు. ఆయనను మనమంతా గౌరవిస్తున్నది బాహ్య ప్రపంచాన్ని జయించి నందుకు కాదు, అంతర్ముఖ జీవితంలో విజేత అయినందుకు. ఎన్ని ప్రతికూలతలు ఎదురైనా స్థిరత్వాన్ని కోల్పోలేదు. చివరికి రావణ సంహార సమయంలోనూ విర్రవీగలేదు. ఆ వీరుడి మృతదేహం దగ్గర నిలబడి అతడిని చంపాల్సి వచ్చినందుకు పశ్చాత్తాపం చెందాడు. ఎన్ని సవాళ్లు ఎదురైనా మానసిక సమతౌల్యం కోల్పోలేదు. ద్వేషాన్ని, పగను పెంచుకోలేదు. రాజకీయ అవసరాల కోసం నైతికతను విడిచిపెట్టలేదు. రాజ్యాభిషిక్తుడు అయ్యాక కూడా, అధికార దుర్వినియోగానికి పాల్పడ లేదు. ప్రజల కోసం తన సొంత ఆనందాన్ని త్యాగం చేస్తూ, మార్గ దర్శకంగా నిలిచాడు. రాముడు న్యాయానికి, ధర్మానికి నిదర్శనంగా ఉండటం వల్లే రామరాజ్యం ఆదర్శప్రాయమైంది. దేశాన్ని రామరాజ్యంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనందరిదీ. ధర్మ, న్యాయ ప్రతిష్ఠాపనే రామరాజ్యానికి భూమిక. ★

---

శరీరంలోని హైడ్రైట్లను తొలగించి గుండె సమస్యలను నివారిస్తుంది. వంకాయ శరీరంలో కొవ్వును కరిగిస్తుంది. రక్త ప్రవాహాన్ని మెరుగు పరుస్తుంది.

ఫోలేట్, పొటాషియం, మెగ్నీషియం, విటమిన్ బీ3, బీ6, బీటా కెరోటిన్, యాంటీ ఆక్సిడెంట్లు తదితర పోషకాలు గుండెపోటు, స్ట్రోక్ ముప్పును తగ్గిస్తాయి. శరీరంలోని అదనపు ఐరన్‌ను తొలగిస్తుంది. శరీరంలోని విషతుల్యాలను, వ్యర్థాలను తొలగిస్తుంది. కెలరీలను బర్న్ చేసి బరువు తగ్గేందుకు సహకరిస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.

ఉబ్బసం, మలబద్ధకం, పేగు సంబంధిత సమస్యలు, పుండ్లు, పెద్ద పేగు క్యాన్సర్లను తగ్గించడంలో కీలకంగా పనిచేస్తుంది. ఇది శరీరానికి పడితే చర్మంపై ముడతలు లేకుండా యాంటీ ఏజింగ్ ఏజెంట్‌గా పనిచేస్తుంది. జుట్టు ఎదుగుదలకు అవసరమైన పోషకాలను అందిస్తుంది. మలేరియా వ్యాధితో బాధపడుతున్న వ్యక్తులకు కాల్చిన వంకాయకు కాస్త చక్కర ముట్టించి ఇవ్వాలంటారు. నిద్రలేమి సమస్యతో బాధపడేవారు పడుకోడానికి సుమారు 4 గంటల ముందు కాల్చిన వంకాయని తినడం ఉత్తమం. వంకాయ గుత్తి మూలశంక (పైల్స్), హేమరాయిడ్స్ నివారణ చికిత్సలో ఉపయోగిస్తారు. కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం కోసం వంకాయను పిండి కట్టుల్లో వాడతారు. ఇది శరీర దుర్గంధాన్ని నివారిస్తుంది.

వంకాయలోని ఫైబర్ శరీరంలోని విషాన్ని, రసాయనాలను గ్రహించి పెద్ద పేగు క్యాన్సర్ నుంచి రక్షిస్తుంది. శరీరంలోని కణాలు.. క్యాన్సర్ గడ్డలుగా ఏర్పడకుండా వంకాయ కాపాడుతుంది. వంకాయలో సోడియం తక్కువ.

కాబట్టి.. బీపీ సమస్యతో బాధపడేవారు తినొచ్చు. పంటి సమస్యలను నివారిస్తుంది. ★

---



❋ తాత్వి'కత' ❋

# ఇస్తూ పోతేనే ఉంటుంది..!

**మూ**డురోజులుగా తిండి లేని ఒక వ్యక్తి ఆ దారిన వెళ్లే ఒక కారును ఆపి "కాస్త ధర్మం చెయ్యండి బాబూ" అన్నాడు. అతని ఆహార్యాన్ని బట్టి అతనేదో మంచి కుటుంబం నుండి వచ్చిన వాడై ఉంటాడని, అతని మాట తీరు చూస్తే కాస్త చదువుకున్నవాడని అనిపించింది కారులోని వ్యక్తికి. పైగా, తనకు అప్పుడే ప్రమోషన్ వచ్చిందన్న సంతోషంలో ఉన్నాడు. దాంతో జేబులో నుంచి వంద రూపాయల నోటు తీసి ఇవ్వబోయాడు. ఆ వంద రూపాయల నోటుకేసి చూస్తూ పక్కనే కూర్చున్న ఇతని స్నేహితుడు పెద్దగా నవ్వాడు.

"ఎందుకలా నవ్వుతున్నావు?" అన్నాడు అతను.

"అతి త్వరలో నువ్వు కూడా నా స్థానంలో ఉండాల్సి వస్తుందనిపించి నవ్వొచ్చింది. కనిపించిన ప్రతివాడికీ ఇంతంత దానం చేస్తూ పోతే చివరికి ఏమీ మిగలదు. నేనందుకే చాలా జాగ్రత్తగా ఉంటాను. అసలే నాకు రావలసిన ప్రమోషన్ కూడా మిస్సయింది." అన్నాడు స్నేహితుడు.

దానికతను నవ్వుతూ, "బహుశా అందుకేనేమో నాకు ప్రమోషన్ వచ్చింది. కారు కూడా కొనుక్కో గలిగాను. నువ్వేమో అలాగే ఉన్నావు ఎదుగూ బొదుగూ లేకుండా" నవ్వుతూనే అంటించాడు అతను.

మీరు ఇస్తూ పోతే మీ దగ్గర ఉన్నదంతా అయిపోతుందనేది సాధారణ ఆర్థిక సూత్రాలకు సంబంధించినది. అదే ఆధ్యాత్మిక సూత్రాల ప్రకారమైతే మీరు ఏమీ ఇవ్వకుండా ఉన్నట్లైతే మీ దగ్గర ఏదీ మిగలదు. అదే మీరు ఇస్తూ పోతే మీ దగ్గర చాలా చాలా ఉంటుంది. బాహ్య, అంతర్గత ఆలోచనలు, అభిప్రాయాలు, ఊహలు పరస్పరం వ్యతిరేక దిశలో ఉంటాయి. ముందు అంతర్గతంగా చక్రవర్తి స్థాయికి ఎదగాలి. అప్పుడే పంచేందుకు మీ దగ్గర ఉంటుంది అనేది ఆధ్యాత్మిక గ్రంథాల బోధ. ★

"మహా అయితే ఓ ఏభై కోట్లు... పోనీ వందకోట్లు అనుకుందాం. నా టార్గెట్ అది కాదు. అందులో రసజ్ఞకి కూడా వాటా వుంటుంది. ఇవ్వకపోతే కోర్టుకి వెళ్తుంది పిన్ని... వేం సంపాదించుకోగలం. ఎవరో మాకు ఇవ్వాల్సిన అవసరం లేదు. మా ప్రాజెక్టులు సక్సెస్ అయితే కార్పొరేట్ ఫండ్ కింద మంచి పనుల కోసం పదిమందికి మేం డొనేట్ చేస్తాం" అంది సరయూ.

"నువ్వు చాలా ఎదిగిపోయావు?"

"ఎదగటానికి నేనూ, రాహుల్ ప్రయత్నం చేస్తున్నాం. ఇప్పుడు మనుషులకి మోడ్రన్ థాట్ కావాలి. సినిమాలు, సీరియల్స్‌లోలా ఎత్తుకు పైఎత్తులు కావు. తాత నెంబర్ ఇవ్వు".

"నా దగ్గర లేదు".

"నో ప్రాబ్లమ్" అంది సరయూ ఫోన్ కట్ చేస్తూ.

* * *

స్వప్న-శ్రీనివాస్‌లు ఇంటికి వచ్చారు. అక్కడ శ్వేత లేదని తెలిసింది.

"నేను ఊరు వెళ్తున్నాను. ఎప్పుడు వచ్చేది తెలియదు. అవసరం అనుకుంటే అమ్మా వాళ్లని ఫోన్ చెయ్యమని చెప్పండి" అని పనివారికి చెప్పి వెళ్లిందని తెలిసింది.

"ఇప్పుడు ఎక్కడికి వెళ్లిందంటారు?" అంది స్వప్న.

"నాకెలా తెలుస్తుంది?"

"అమ్మ మాట్లాడాలంది కదా?"

"ఆ విషయాలు నాతో మాట్లాడకు. ఈ తతంగం అంతా చూస్తుంటే నాకు చిరాకుగా వుంది. మీ అమ్మ ఆలోచనలో పడింది. ఆమె విడాకుల నోటీస్ ఇస్తుందని నేను అనుకోను".

''అది కాదు శ్రీనివాస్...'' అని ఏదో చెప్పబోయింది.

"ప్లీజ్ స్వప్నా... ఇట్స్ నాట్ మై ప్రాబ్లమ్. ఇప్పటికే నేను ఎక్కువగా మాట్లాడాను. శ్వేతతో నువ్వు మాట్లాడాలనుకుంటే ఫోన్ చెయ్యి" అని గదికి వెళ్లిపోయాడు.

స్వప్న ఇంకేం అనలేక శ్వేతకు ఫోన్ చేసింది.

"ఎక్కడున్నావు?"

"నేను ఎక్కడో చోట వున్నాను. చెప్పమ్మా".

"అమ్మమ్మ వచ్చింది. నీతోనూ, ఆద్యతోనూ మాట్లాడాలి అంది".

"చెన్నైలో వుందా?"

"హైదరాబాద్‌లో వుంది".

"మంచిది. నేను అమ్మమ్మతో మాట్లాడతాను" అంది కట్ చేస్తూ.

"దీనికి ఇంత అహంకారం వుందని నేను అనుకోలేదు" అనుకుంది.

* * *

హుస్సేన్ సాగర్...

రాజేశ్వరి బుద్ధుడు విగ్రహాన్ని చూస్తోంది. పక్కన ఇద్దరు మనవరాళ్లు వున్నారు. అందరూ ఆ నీటి తళతళల్ని చూస్తున్నారు.

"నాకూ మీ తాతకి మధ్య ఏం జరిగిందో తెలుసుకోవాలని మీరు అడిగారంట కదా!"

"అవును".

"అందుకు ఇంట్లో వారితో తగాదా పడనవసరం లేదు. నన్ను అడిగితే చెప్పేదాన్ని" అందామె.

''నీ ఒక్కదానితోనే తాత తగాదా లేదు అమ్మమ్మా... ఇంకో నలుగురితో వుంది. మేం నీ గురించి అడిగాం. తగాదా మాది కాదు. మా గురించి రకరకాలుగా వూహించుకున్నారు. వాళ్లు శాంతంగా జరిగింది మాకు చెప్పి వుండాల్సింది".

"సరే... నాకూ మీ తాతకి మధ్య చాలా జరిగాయి. నా మనసు విరిగిపోయింది. నన్ను అనకూడని మాటలు అన్నారు. అవన్నీ మీకు చెప్పుకోలేను".

"కాదనటం లేదు అమ్మమ్మా... నువ్వు గాయపడ్డావని మా ఇద్దరికీ తెలుసు అలాంటి మాటలు తాత అని వుండకూడదు. ఆయనకు ఎంత కోపం అయినా రావచ్చు. అయితే దాన్ని ప్రోవోక్ చేసింది ఎవరు?"

"అంటే..."



ఎండివై రామమూర్తి స్మారక నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన రచన

22



# మహా సంకల్పం

"అంతగా ఆయన్ని ఎవరు రెచ్చగొట్టారు. అన్ని సంవత్సరాలు మీరు కలిసి బతికారు. చాలాసార్లు తగాదా పడి వుంటారు. మళ్లీ కలిసిపోయారు. తాతకి డ్రింక్ చేసే అలవాటు వుంది కదూ".

"మీకు తెలియదా?"

"ఆ సమయంలో మెదడు సవ్యంగా పని చేయదు. మొదటి రోజున నువ్వు తాతని ఎందుకు గట్టిగా అడగలేదు".

"అడగలేదని, గట్టిగా అడగలేదని ఎందుకు అనుకున్నారు?"

"అప్పుడే బయటకు వస్తే తాత మానేసి వుండే వాడు. మా నాన్న, బాబాయి కూడా అకేషనల్‌గా డ్రింక్ చేస్తారు".

రాజేశ్వరి మాట్లాడలేదు.



"అప్పుడు మీరు స్ట్రగుల్ అవుతున్నారు. అందుకని నీకు తాగుడుకంటే ఆ పోరాటం ముఖ్యం. చిన్న చిన్న బలహీనతలని పట్టించుకోలేదు. ఇప్పుడు ప్రపంచంలో చాలామంది డ్రింక్ చేస్తున్నారు. ఆ మత్తులో కొట్టేవారు, చంపేసేవారున్నారు. తాత ఎప్పుడన్నా నిన్ను కొట్టారా?"

"లేదు".

"నాకు అర్థం అవుతున్నదొకటే... మీ ఇద్దరికీ సమయం లేదు. నువ్వు అమ్మా వాళ్ల గురించి చూసుకున్నావు. తాత పత్రికను చూసుకున్నాడు. అప్పుడంతా బాగుంది. ఎప్పుడయితే మీరు సెటిల్ అయ్యారో అప్పుడు సమస్యలు మొదలయ్యాయి".

రాజేశ్వరి మాట్లాడలేదు.

"నేను సూటిగా అడుగుతున్నాను. తాతని నువ్వు చిన్న మాట కూడా అనలేదా తప్పంతా ఆయనదేనా?" అంది ఆద్య.

"నిన్ను ఎప్పుడన్నా డబ్బుల లెక్క అడిగారా? నీకు కావలసిన వారందరికీ ఎందుకు సహాయం చేస్తున్నావు అని అడిగారా? నీ పేరున ఆస్తులు తీసుకుంటు న్నప్పుడు– పిల్లల పేర్లతో తీసుకుంటున్నప్పుడు మాకు చాలు. వద్దు అన్నావా?"

"నేను కూడా కోపంలో ఆయన్ని గాయపరిచాను" ఒప్పుకుంది రాజేశ్వరి.

"ఇప్పుడు చెబుతున్నాం. మేం తాతని కలిసాం. ఎందుకిలా జరిగింది అని అడిగాం. తాత మీ ఎవ్వరి మీదా ఒక్క ఆరోపణ చెయ్యలేదు. అన్ని తప్పులూ నావే అన్నాడు. తన తప్పులు తెలుసుకోవటాన్ని మించిన మనిషితనం వుంటుందా అమ్మమ్మా..." అంది ఆద్య.

"నాన్న నన్ను కొట్టేంత పని చేసారు. అప్పటి కోపం అది. ఆద్యతో పిన్ని మాట్లాడలేదు. అందుకని బంధం తెంచుకుంటామా!" అంది శ్వేత.

"ఇప్పుడు పరిష్కారం ఏమిటి చెప్పు అమ్మమ్మా".

"మీ అమ్మా వాళ్లు నన్ను విడాకులు ఇవ్వమంటున్నారు".

ఇద్దరూ కొద్ది సేపు మాట్లాడలేదు.

"మంచిదే. కలిసి బతకలేనప్పుడు విడిపోవటానికి చట్టం యిచ్చిన హక్కు అది. నువ్వు ఏ నిర్ణయం తీసుకున్నా మాకు అభ్యంతరం లేదు" అంది శ్వేత.

"మాకు తాత కావాలి. నువ్వు కావాలి. ఇప్పటి వరకు మాకు సంబంధం లేని విషయంలో మానసిక వేదనను మేం అనుభవించాం. ఇక నుంచి తాతని కలిసినా, మాట్లాడినా మమ్మల్ని మీరు శత్రువులుగా చూడనవసరం లేదు. మీకు ఇష్టం లేకపోతే మా ఇద్దరితోనూ సంబంధాలు తెంచుకోవచ్చు" అంది ఆద్య.

ఇద్దరినీ చూసిందామె.

"నేను విడాకుల పేపర్స్ మీద సంతకం చేయటం లేదు".

ఇద్దరూ చెరో పక్క నుండి అమ్మమ్మను హత్తుకున్నారు.

"నేనేం చేయాలో నన్ను ఆలోచించుకోనీయండి. మేం చేసిన తప్పులు మీరు చేయకూడదు" అంది రాజేశ్వరి.

* * *

ఆఫీస్‌లో ఫోన్ మోగింది.

రిసెప్షనిస్ట్ "సర్ లేరు. మీ పేరు చెప్పండి. నేను వారు రాగానే చెబుతాను" అంది.

"నేను వెంటనే గోవింద్‌తో ఎలా అయినా మాట్లాడి తీరాలి. ముంబై ఆంటీనని చెప్పండి. పేరు గోవింద్‌కి తెలుస్తుంది" అంది గంభీరంగా. రిసెప్షనిస్ట్ అదిరిపోయింది.

అయిదు నిమిషాల తర్వాత ఆమె ఫోన్ మోగింది.



పి. చంద్రశేఖర ఆజాద్

9246573575

"నేను గోవింద్‌ని మాట్లాడుతున్నాను".

"తులసీదేవిని మాట్లాడుతున్నాను. ఎలా వున్నావు బాబూ..."

"మీరా... బాగున్నానమ్మా..."

"అంకుల్ మీ దగ్గర వున్నారని తెలిసింది. ఆయన్తో నేను మాట్లాడాలి".

"నిన్ననే లండన్ వెళ్లారు".

"నిజమా... నీ ఫ్యామిలీ మెంబర్స్ ఎలా వున్నారు. మీ శ్రీమతి..."

"అవన్నీ ఓ రోజు పర్సనల్‌గా వచ్చి మీతో మాట్లాడతాను".

"రామకృష్ణగారు అక్కడ ఎన్ని రోజులు వుంటారు?"

"చెప్పలేను. నేను రెండు రోజుల్లో బయలు దేరుతున్నాను అక్కడికే".

"మంచిది బాబూ..." అంది తులసి.

* * *

రసజ్ఞ, రామకృష్ణ, రిత్విక్ లండన్ నగర వీధులు తిరుగుతున్నారు. యూనివర్సిటీ అంతా చూపించింది. ప్రొఫెసర్స్‌నీ, తన ఫ్రెండ్స్‌నీ పరిచయం చేసింది. రిత్విక్‌ని అంతకు ముందు పరిచయం చేసాడు. మనం ఓ మేగజైన్ తీసుకు వస్తున్నాం అని చెప్పాడు.

"చాలా మంచి పని చేస్తున్నారు" అంది రసజ్ఞ.

"నాన్న ముంబయ్‌లో హాస్పటల్ కోసం స్థలం తీసుకుంటానంటే వద్దన్నాను తాతా" అంది.

"ఎందుకనమ్మా".

"మనకి ఇంత జీవితం ఇచ్చింది మన తెలుగునేల. నాకు అక్కడ సేవ చేయాలని వుంది. అలా అని మిగతా ప్రాంతాలంటే నాకు ఇష్టం లేదని కాదు. మీరు స్థాపించిన హాస్పటల్స్ వున్నాయి. వాటిని డెవలప్ చేయాలని వుంది. అలాగే నాకు రీసెర్చ్ మీద ఇంట్రెస్ట్ వుంది. వంశపారంపర్యంగా వస్తున్న వ్యాధుల మీద పరిశోధన చేయాలని వుంది".

"చాలా మంచి పనులు పెట్టుకున్నావు. నువ్వు సాధిస్తావనే నమ్మకం నాకుంది" అన్నాడు.

రిత్విక్‌కి రసజ్ఞని చూడటం, ఆ అమ్మాయిలోని మెచ్యూరిటీ గమనించటం ఉత్తేజకరంగా వుంది.

"మీ పక్కన వుండి వుంటే నేను ఎప్పటికప్పుడు అనేక విషయాల గురించి మాట్లాడి వుండే దాన్ని తాతగారూ".

"ప్రతి మనిషి జీవితంలోనూ బ్యాడ్ పిరియడ్ వుంటుంది రసజ్ఞా! నాకు అవన్నీ కరిగిపోతున్నాయి అనిపిస్తోంది".

అప్పుడు లండన్ నగరం మీద చిరుజల్లులు కురుస్తున్నాయి.

అత్యంత మనోహరంగా వుందా దృశ్యం.

అప్పుడు రసజ్ఞ ఫోన్ మోగింది.

"సరయూ" అంది దాదాపు అరిచినట్లు..



"మనకి ఇంత జీవితం ఇచ్చింది మన తెలుగునేల. నాకు అక్కడ సేవ చేయాలని వుంది. అలా అని మిగతా ప్రాంతాలంటే నాకు ఇష్టం లేదని కాదు. మీరు స్థాపించిన హాస్పటల్స్ వున్నాయి. వాటిని డెవలప్ చేయాలని వుంది. అలాగే నాకు రీసెర్చ్ మీద ఇంట్రెస్ట్ వుంది. వంశపారంపర్యంగా వస్తున్న వ్యాధుల మీద పరిశోధన చేయాలని వుంది".
"చాలా మంచి పనులు పెట్టుకున్నావు. నువ్వు సాధిస్తావనే నమ్మకం నాకుంది" అన్నాడు.

"తాతగారి ఫోన్ నెంబర్ కావాలి. అర్జెంట్‌గా నేను మాట్లాడాలి".

"ఫోన్ నెంబర్ నా దగ్గర లేదు. ఆయనే నా పక్కన వున్నారు".

"రియల్లీ..." అని అరిచింది. రామకృష్ణ ఫోన్ అందుకున్నాడు.

"గ్రాండ్ పా నేనూ, రాహుల్ నిన్ను కలవాలి. ఎప్పుడు వస్తున్నారు?"

"నేనే రావాలా? నువ్వు రాకూడదా".

"అలా అంటారా... మేం రెండు రోజుల్లో మీ దగ్గరికి వస్తున్నాం" అంది.

"రామ్మా... ఇద్దరి మనవరాళ్లతో యు.కె. అంతా చుట్టేద్దాం".

"ఇంకా నయం ప్రపంచమంతా అనలేదు కమింగ్ గ్రాండ్ పా" అంది సరయూ.

* * *

రసజ్ఞ రామకృష్ణ, రిత్విక్‌లని హోటల్ దగ్గర డ్రాప్ చేసాక తన రూమ్‌కి బయలుదేరింది. దారిలో వుండగా తులసి నుండి ఫోన్.

"మీ తాతగారు లండన్ వచ్చారంట కదా!"

"అవునమ్మమ్మా... ఇప్పుడే తాత దగ్గర్నుండి రూమ్‌కి వెళ్తున్నాను. లేక పోతే నీతో మాట్లాడించే దాన్ని".

"ఫోన్‌లో కాదులే... నేను బయలుదేరి వస్తున్నాను".

"నిజంగానా... ఇంకో విషయం చెప్పనా... సరయూ కూడా ఫోన్ చేసింది".

"ఏంటి సమస్య?"

"సమస్య కాదు. తాతగారితో మాట్లాడటానికి తను కూడా రెండు మూడు రోజుల్లో లండన్ రాబోతోంది".

"ఇన్ని శుభవార్తలు చెబితే ఒక్కసారి గుండె ఆగిపోదూ... మీ తాతను చూసేదాకా అయినా ఈ గుండెని కొట్టుకోనీ" అంది.

"నీ గుండె ఆగిపోయినా నేను మళ్లీ లబ్ డబ్ అనిపిస్తాను".

"అదెలా? నా గుండెని ఎవరికయినా డొనేట్ చేస్తావా?"

"కాదు. నా దగ్గర మంత్రం వుంది" అనగానే హాయిగా, బిగ్గరగా తులసి నవ్వుతోంది. "జాగ్రత్త అమ్మమ్మా... సంతోషంలోనూ గుండెలు కొట్టుకో వటం మానేస్తాయి".

"పోనీవోయ్. ఇంకెంత కాలం కొట్టుకుంటుంది" అంది.

రసజ్ఞకి కారు వెనక్కి తిప్పి హోటల్‌కి వెళ్లి అమ్మమ్మ విషయం తాతకి చెప్పాలనిపించినా బలవంతాన ఆ కోర్కెని అణచుకుంది.

* * *

రామకృష్ణకి రిత్విక్‌తో ఎంతో చెప్పాలని వుంది. ఆయన ఇన్ని సంవత్సరాల తర్వాత ఎంతో ఉద్వేగాన్ని అనుభవిస్తున్నాడు. అతనికి రకరకాల దృశ్యాలు చిన్న తనం నుండి కదులుతున్నాయి. అమ్మా-నాన్నా-బడి-స్నేహితులు-తులసి. అక్కడ ఆగిపోయాడు.

అప్పుడు ఛాతిలో నొప్పిగా అనిపించింది. అలా రాసుకుంటున్నాడు. అది గమనించాడు రిత్విక్... "ఏమయింది సర్" అన్నాడు. "ఛాతిలో నొప్పిగా వుంది. గ్యాస్ అనుకుంటాను".

"అలా అనుకోవద్దు సర్" అని ఫోన్ అందుకున్నాడు. "ఎవరికి" అంటున్నాడు. రసజ్ఞ "అంకుల్ చెప్పండి" అంది. "సర్ ఛాతి నొప్పి అంటున్నారు". "నేను బయలుదేరి వస్తున్నాను" అంది. అంతలోనే "మీ దగ్గర సార్బిటాల్ వుంటే తాతగారి నాలుక కింద పెట్టమనండి" "ఉంది" అన్నాడు.

అరగంటలో రసజ్ఞ వచ్చింది. స్టెతస్కోప్‌తో హార్ట్ బీట్‌ని చూస్తుంటే ఆయన కళ్లల్లో ఆనందం.

"మనం హాస్పటల్‌కి వెళ్దాం తాతా" అంది.

"నాకేం కాదు నువ్వు అనవసరంగా కంగారు పడొద్దు".

"మీ ముందు వుంది మనవరాలు కాదు. డాక్టర్ రసజ్ఞ" అంది.

ఆయన మాట్లాడలేదు. అప్పటికప్పుడు అంబులెన్స్ వచ్చింది. మరో ఇరవై నిమిషాల తర్వాత రామకృష్ణని ఐ.సి.యులోకి తీసుకు వెళ్లారు. ఉదయానికల్లా స్టెంట్ వేసారు. (సశేషం)

**ప్రభుత్వం ఎన్ని అభివృద్ధి చర్యలు చేపట్టినా, ప్రజా జీవితాన్ని ఎంత సుఖవంతం చేసేందుకు కృషి చేస్తున్నా, వాటిని వేటినీ పట్టించుకోకుండా, దేశానికి వ్యతిరేకంగా రంధ్రాన్వేషణ చేస్తూ రాయడమే తమ బాధ్యతగా భారతీయ మీడియాలోని ఒక వర్గం భావిస్తుందనే విషయం మనందరికీ తెలిసిందే. ఒక వర్గపు భావజాలాన్ని కలిగి ఉన్నవారే మేధావులని, వారి దృక్పథమే శాశ్వత సత్యమని కొందరు జర్నలిస్టులు భావిస్తుంటారు. అందుకే, తొమ్మిదేళ్ల మోదీ పాలనను, నాయకత్వాన్ని అంతర్జాతీయంగా అందరూ ప్రశంసిస్తున్నా, వీరు మాత్రం ఈకలు పీకడమే ధ్యేయంగా పని చేస్తుంటారు. కేవలం దేశీయ పత్రికలలోనే కాదు, విదేశీ పత్రికలలో కూడా దేశానికి వ్యతిరేకంగా కట్టుకథలు రాస్తూ, అందుకు ప్రతిఫలంగా తాయిలాలు పొందడం కొందరు జర్నలిస్టులకు అలవాటుగా మారింది. తాము పేదల పక్షమని చెబుతూ, విలాసవంతమైన జీవితాన్ని అనుభవించే వీరు ప్రభుత్వపు పనుల పట్ల సానుకూలంగా స్పందించే జర్నలిస్టులకు పేర్లు పెడుతుంటారు. వీరిని ‘గోదీ మీడియా’ అని హేళన చేస్తుంటారు. తమకు ఇష్టమైన పార్టీల చేత అటువంటివారిని నిషేధింపచేస్తూ తామేదో చాలా గొప్ప విజయాన్ని సాధించినట్టు భావిస్తుంటారు. పైగా, తప్పు చేసినప్పుడు ప్రభుత్వం దండించబోతే, పత్రికా స్వేచ్ఛకు ముప్పు అంటూ తమ గుంపుతో కలిసి గగ్గోలు పెడుతుంటారు. ఇటువంటి వారు ఇచ్చే సమాచారంతో రూపొందించే ప్రపంచ సూచీలలో భారత్ ఎప్పుడూ అట్టడుగులో ఉంటూ రావడంలో ఆశ్చర్యమేముంది?**



# చైనా, పాశ్చాత్య దేశాల ‘పొగలేని యుద్ధాలు’

ఈ వారంలో ‘న్యూస్ క్లిక్’ అనే వెబ్ పోర్టల్‌పై ఢిల్లీ పోలీసుల స్పెషల్ సెల్ ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసి, ఈ న్యూస్ పోర్టల్‌తో సంబంధం ఉన్న అనేక ప్రదేశాలపై దాడులు జరిపింది. ఇందులో న్యూస్ క్లిక్ ఎడిటర్ ఇన్ చీఫ్ ప్రబీర్ పురకాయస్త, జర్నలిస్టులు అభిసార్ శర్మ, ఊర్మిలేష్, పరంజయ్ గుహ ఠాకూర్తా వంటి వారు కూడా ఉన్నారు. ఇందులో కొందరు జర్నలిస్టులను ఢిల్లీ పోలీసులు దర్యాప్తు కోసం తమ కార్యాలయానికి తీసుకువెళ్లారు. న్యూస్‌క్లిక్ అధిపతి పురకాయస్తను, హెచ్‌ఆర్‌ను పోలీసులు అరెస్టు చేసి, మిగిలినవారిని ప్రస్తుతానికి వెనక్కి పంపారు. అంతేనా, వారి లాప్‌టాప్‌లో, మొబైల్ ఫోన్ల నుంచి వారు తొలిగించిన డేటాను పోలీసులు రికవర్ చేశారు.

**సినిమా ఫక్కీలో పక్కా వ్యూహంతో దాడులు**

తాము దాడి చేయబోయేది మీడియా సంస్థ కావడంతో, తమపై బురద పడకుండా ఉండేందుకు ఢిల్లీ పోలీసుల ప్రత్యేక సెల్ పకడ్బందీగా వ్యవహరించి, పక్కా ఆధారాలను సేకరించిన తర్వాతే దాడికి దిగింది. ఈ దాడి జరిగే ముందు 45 రోజులపాటు ఈ ప్రత్యేక బృందం రహస్య దర్యాప్తు నిర్వహించింది. ఈ దర్యాప్తులో భాగంగా సాంకేతిక పర్యవేక్షణ, ఆర్థిక విశ్లేషణ, పోర్టల్‌లో వారు పోస్ట్ చేసే విషయాంశాల అధ్యయనాన్ని చేశారు. అనంతరం, అనుమానితులను ఎ, బి, సి అంటూ మూడు వర్గాలుగా విభజించారు. ‘ఎ’ వర్గంలో న్యూస్‌క్లిక్ అధిపతి, హెచ్‌ఆర్‌తో పాటు మరో నలుగురు అనుమానితులు ఉన్నారు. ఈ ఆపరేషన్‌లో 400-450మంది పోలీసులను భిన్న బృందాలుగా విడదీసి, అనుమానితుని ప్రొఫైల్‌ని బట్టి వారిని అక్కడకు పంపారు. ఆగస్టు 17న యూపీఏ కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన ఢిల్లీ పోలీసులు తొలుత ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నుంచి సేకరించిన పత్రాలపైనే ఆధారపడ్డారు.

అనంతరం, భారత సార్వభౌమత్వానికి ముప్పు

వంటి నేరారోపణల కారణంగా ఈ దర్యాప్తు ఈడీ పరిధి ఆవలకు విస్తరించింది. దర్యాప్తు కోసం, అందులో భాగంగా సాంకేతిక పర్యవేక్షణ చేయడం కోసం పోలీసులు ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్టు ఒక ఆంగ్ల దినపత్రిక పేర్కొంది. ఆర్థిక దర్యాప్తుపై దృష్టి కేంద్రీకరించిన బృందం, అనుమానితుల అనధికారిక చెల్లింపులు, ప్రయాణ చిట్టాలు సహా బ్యాంకు లావాదేవీలు, కార్పొరేట్ ఫైలింగ్స్ సహా వేలకొద్దీ పత్రాలను పరిశీలించింది. మరొక బృందం పోర్టల్‌లోని విషయాలను అధ్యయనం చేయడం, వీడియోలను, వ్యాసాలను విశ్లేషించి, ఏదైనా డేటాను డిలీట్ చేశారేమో చూసే పనిలో నిమగ్నమై సమాచారాన్ని సేకరించింది.

ఈ పరిశోధకులు అంతా చైనా జాడలను కనిపెట్టడంపై దృష్టిని కేంద్రీకరించారు. గతవారం ప్రాథమిక దర్యాప్తు పూర్తి అయిన తర్వాత, రెండు రోజుల పాటు రహస్య సమావేశాలను నిర్వహించు కున్న పోలీసు అధికారులు అనుమానితుల వర్గాన్ని బట్టి పోలీసుబృందాలను కూర్చారు. ఈ దాడులకు సంబంధించిన సమాచారం ఎక్కడా బయటకు పొక్కకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. దిగువస్థాయి పోలీసులకు దాడులు జరుపబోయే ప్రదేశానికి సమీపంలో ఉదయం 5 గంటలకల్లా సిద్ధంగా ఉండమని చెప్పారే తప్ప పూర్తి చిరునామా ఇవ్వలేదు. అవసరమైన మేరకు మాత్రమే పోలీసులకు సమాచారం ఇచ్చారట. కేటగిరి ఎ లో పురకాయస్త వంటి వారు ఉండగా, కేటగిరీ బి లో మధ్య స్థాయి అధికారులు, జర్నలిస్టులు ఉన్నారు. చివరి కేటగిరీ కన్సల్టెంట్లకు సంబంధించింది. ఇంతవరకూ వీరి పాత్రను నిర్వచించలేదు. మొత్తం మీద వివిధ రాష్ట్రాలలో 50మంది అనుమానితులపై దాడులు చోటు చేసుకున్నాయి.

**న్యూస్ క్లిక్‌పై చర్యలు ఎందుకు?**

ఆగస్టు నెలలో ఈ వర్గం జర్నలిస్టులంతా 'శాశ్వత అక్షర సత్య' పత్రికగా భావించే 'న్యూయార్క్ టైమ్స్'లో అమెరికన్ బిలియనీర్, వామపక్షవాది, చైనా ప్రభుత్వ ప్రచార యంత్రాంగంతో సన్నిహితంగా పనిచేసే నైవేలీ రాయ్ సింఘమ్ ప్రపంచవ్యాప్తంగా నిధులు అందించే మీడియా సంస్థల నెట్‌వర్క్‌లో న్యూస్ క్లిక్ పోర్టల్ కూడా ఉందనే విషయాన్ని ఒక వ్యాసం ద్వారా బయిటపెట్టింది. ఈ సంస్థలు తమ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా వార్తలు రాస్తూ, చైనా గొప్పదనాన్ని ప్రచారం చేసేందుకు ఉద్దేశించిన నిధులు ఇవి. ఈ సింఘం 'భారీ సాఫ్ట్‌వేర్ సంస్థాధిపతి', బిలియనీర్. ఈ వార్త వెలువడిన అనంతరం ఆగస్టు 17న కఠినమైన చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం, భారతీయ శిక్షా స్మృతిలోని సెక్షన్ 153ఎ (రెండు వర్గాల శత్రుత్వాన్ని ప్రోత్సహించడం), 120 బి (నేరపూరిత కుట్ర) కింద న్యూస్ క్లిక్‌పై కేసులు నమోదు చేశారు.



దాడులు చేసిన పోలీసులు న్యూస్ క్లిక్‌కు సింఘమ్ పంపిన ఇమెయిళ్లను స్వాధీనం చేసు కున్నారు. ఇందులో కోవిడ్ మహమ్మారి సమయంలో చైనా తన దేశంలో ఎంతటి మహత్తరమైన చర్యలు తీసుకున్నది, ఇతరులకన్నా ముందే ఎలా వాక్సిన్ కనుగొన్నది, అది ఎంత ప్రభావంతమైనదో, భారత్ ఎలా విఫల మైందో పట్టి చూపుతూ, వ్యాస పరంపర రాయాలని ఇందులో కోరారు. ఆ సమయంలో భారత్‌లో పరిస్థితి భయావహంగా ఉందని, మోదీ ప్రభుత్వం అదుపు చేయడంలో విఫలమైందనీ వచ్చిన వ్యాసాల వెనుక ఎంత డబ్బు పారిందో ఇప్పుడు అర్థం చేసుకోవచ్చు.

**ఎవరీ నైవేలీ రాయ్ సింఘం?**

మొన్నటివరకూ అమెరికాలో అతి భారీ సాఫ్ట్‌వేర్ కంపెనీని నడిపిన వ్యాపారవేత్త నైవేలీ రాయ్ సింఘం. తండ్రి ఆర్చిబాల్డ్ విక్రమరాజా సింఘం శ్రీలంకకు చెందినవారు. మార్క్సిస్టు అయిన ఆర్చిబాల్డ్ ఉన్నత విద్య కోసం అమెరికా వచ్చి అక్కడే స్థిరపడ్డారు. నైవేలీ అక్కడే పుట్టిపెరిగి, వ్యాపారం చేశారు. ప్రస్తుతం షాంఘాయిలో నివసిస్తున్నట్టుగా చెప్తున్న రాయ్ సింఘం కూడా తండ్రిలానే మార్క్సిస్టు. అందువల్లనే అతడు చైనా కమ్యూనిస్టు పార్టీకి అతి సన్నిహితంగా ఉంటాడని చెప్తుంటారు. ఇతడు అమెరికాలో ఉన్న సమయంలో కూడా చైనాకు అనుకూలంగా ప్రచారం చేసేందుకు ప్రపంచ వ్యాప్తంగా అనేక ఎన్జీవోలకు, న్యూస్‌క్లిక్ వంటి న్యూస్ పోర్టళ్లకు నిధులు అందిస్తుండేవాడు. చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రచార విభాగానికి సన్నిహితంగా ఉండే సింఘం, ఇతర దేశాలలో చైనా గొప్పతనాన్ని ప్రచారం చేయించ డంలో కీలక పాత్ర పోషిస్తుంటాడు.

ప్రస్తుతం కేవలం 'న్యూస్‌క్లిక్' మాత్రమే కాదు, తీస్తా సెతిల్‌వాద్ అధిపతిగా ఉన్న 'ట్రై కాంటినెంటల్' సంస్థపై కూడా పోలీసులు దాడులు నిర్వహించడంతో ఆమె పేరు మళ్లీ వార్తల్లోకి ఎక్కింది. ఈ సంస్థ గొడుగున నడుస్తున్న 'సబ్‌రంగ్ ఇండియా' పోర్టల్ కూడా 'న్యూస్‌క్లిక్' లానే ప్రభుత్వ వ్యతిరేక ప్రచారంలో మునిగి ఉండడం ప్రధాన కారణం.

చిత్రమైన విషయమేమిటంటే, ఇటువంటి సంస్థలన్నింటికీ ఆర్థిక సహాయాన్ని అందించేది సింఘమే అయినప్పటికీ, అది ప్రపంచాన్ని చుట్టి, ఇచ్చినవాడికి సంబంధం లేనట్టుగా కొత్త సంస్థ లేక వ్యక్తిపేరుతో ఈ సంస్థలను చేరుతుంది. దీనినే క్లుప్తంగా 'మనీలాండరింగ్' అని కూడా అనవచ్చు. తీస్తా సంస్థలకు వచ్చే నిధులు 'ట్రై కాంటినెంటల్ గ్లోబల్' నుంచి వస్తాయి. అమెరికా నుంచి పని చేస్తున్న ఈ సంస్థకు అధిపతిగా విజయ్‌ప్రసాద్ అనే భారతీయ నామధేయుడే వ్యవహరిస్తున్నాడు. సింఘం పంపిన డబ్బు ముందుగా అమెరికా వెళ్లి అక్కడి ట్రైకాంటినెంటల్ నుంచి న్యూస్‌క్లిక్, సబరంగ్ వంటి సంస్థలకు, ఎన్జీవోలకు వస్తుంది. అచ్చంగా చైనా గొప్పతనాన్ని పట్టి చూపుతూ, దేశీయ ప్రభుత్వాన్ని తక్కువగా చూపేందుకు ఉద్దేశించిందే ఈ డబ్బు.

**చైనా ఇన్‌ఫ్లూయెన్స్ ఆపరేషన్లు (ప్రభావితం చేసే కార్యకలాపాలు)**

నిఘా వర్గాల పరిభాషలో ఇన్‌ఫ్లూయెన్స్ ఆపరేషన్లుగా పిలిచే ఈ కార్యకలా పాలకు నిధులను అందించడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా గొప్ప దేశంగా చైనా తన పరపతిని పెంచుకునే ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగా వీరు పలు రకాల స్వచ్ఛంద సంస్థలను ప్రోత్సహించి, నిధులు అందిస్తుంటారు.

ఉదాహరణకు జెండర్ ఈక్వాలిటీ, పర్యావరణ మార్పుపై పని చేసేవారికి, ఎంపిక చేసిన జర్నలిస్టులకు నిధులు ఇస్తుంటారు. వీటిని అందుకున్నవారు తమ దేశాలలోని ప్రభుత్వాలకు వ్యతిరేకంగా లేని సమస్యలు ఉన్నట్టుగా లేక గోరంత సమస్యను కొండంతగా చూపి ప్రచారం చేస్తూ, అక్కడి

ప్రభుత్వాల పట్ల ప్రజలకు ప్రతికూల భావన వచ్చేలా వ్యవహరిస్తుంటారు. ఇక జర్నలిస్టులైతే 'స్వతంత్రత' పేరుతో ఇష్టంవచ్చినట్టుగా విషయాలను వక్రీకరించి, వ్యాఖ్యానిస్తూ, దానిని ఎదుర్కొన్న వారిపై ఇష్టం వచ్చినట్టు ముద్రలు వేసి దున్నేస్తూ ఉంటారు. ఈ నిధుల వితరణ కారణంగా ప్రపంచవ్యాప్తంగా, పలు సంస్థలు, జర్నలిస్టులతో ఒక గొలుసు నెట్‌వర్క్ ఏర్పడటమే కాదు, సోషల్ మీడియా సైట్లలో ఒకరి ట్వీట్‌ను మరొకరు రీట్వీట్ చేస్తూ తాము కావాలనుకున్న వాతావరణాన్ని సృష్టిస్తారు. ఇటువంటి వారిపై చర్యలు తీసుకోగానే ప్రపంచ మీడియా దానికి స్పందించడం మనకు ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

దీనిని '5వ తరం సమాచార ప్రచార యుద్ధం' అని వ్యవహరిస్తారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ చేపట్టిన ఈ ప్రచారం డబ్బు తిన్న జర్నలిస్టుల 'స్వతంత్ర అభిప్రాయం' ముసుగులో అక్కడి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రాస్తుంటారు. సాధారణంగా, వామపక్ష జర్నలిస్టులు స్వతంత్ర అభిప్రాయమనే మాటను ఎక్కువగా ఉపయోగించడం మనం వింటుంటాం. ఈ స్వతంత్ర అభిప్రాయాలే ఆయా దేశాలలో విధానాలను, రాజకీయాలను ప్రభావితం చేస్తుంటాయి. మన దేశం విషయమే తీసుకుంటే, సీఏఏ, ఎన్ఆర్‌సికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం, కిసాన్ ఆందోళన్ వంటివన్నీ కూడా అమలు కాకుండా ఇటువంటివారు, సంస్థలు అడ్డుకున్నాయి. ప్రతి దేశంలోనూ తమ పౌరుల విషయంలో ఒక నేషనల్ రిజిస్ట్రీ ఉంటుంది. కానీ మన దేశంలో దాని అమలును వ్యతిరేకించారు.

ఇక సీఏఏ విషయంలో మైనార్టీలకు అన్యాయం జరుగుతుందంటూ ఎంత దుష్ప్రచారం జరిగిందో తెలియనది కాదు. కిసాన్ ఆందోళన విషయం చెప్ప నక్కర్లేదు. సాక్షాత్తు ప్రధానమంత్రే దానిని ఉపసంహ రిస్తున్నట్టు స్వయంగా ప్రకటించారు. ఈ ఉద్యమా లన్నింటి వెనుక ఉన్న స్వచ్ఛంద సంస్థలు, వారి గొంతుకను నలుమూలలా ప్రతిధ్వనింప చేసేందుకు గల న్యూస్‌క్లిక్ వంటి సంస్థలు నాడు పండుగ చేసుకున్నాయి. ప్రతికూల వార్తలు, అబద్ధపు వార్తలు ఈ ఉద్య మాల సమయంలో వీరవిహారం చేసిన వైనాన్ని ఇంకా ప్రజలు మరచిపోలేదు. ఇవేవీ తెలియని సామాన్య ప్రజలు అనేకమంది ఇటువంటి అబద్ధపు ప్రచారాలను నమ్మేస్తుంటారు. పైకి అత్యంత సాధారణంగా కనిపించే ఈ వ్యవహారం అనేకానేక పొరలలో నడుస్తుంటుంది. పోలీసులు ఈ పొరలన్నింటినీ ఒలిచి ఈ వ్యవహారం వెనుక ఉన్నది సింహం అన్న విషయాన్ని కనుగొన్నారు.

న్యూస్‌క్లిక్‌పై దాడి అనంతరం కొందరు జర్నలిస్టులు తమకు దానితో ఏం సంబంధం లేదని, తాము ఆ సంస్థకు కన్సల్టెంట్లం మాత్రమేనని

**న్యూస్‌క్లిక్‌పై దాడి అనంతరం కొందరు జర్నలిస్టులు తమకు దానితో ఏం సంబంధం లేదని, తాము ఆ సంస్థకు కన్సల్టెంట్లం మాత్రమేనని చెప్పుకుంటూ, తాము అమాయకులమని రుజువు చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. వారి భావజాలా నికి చెందిన కొందరు జర్నలిస్టులు మాత్రం దీనిని మీడియాపై దాడిగా అభివర్ణిస్తూ అత్యంత విచారాన్ని వ్యక్తం చేస్తున్నారు. కానీ, ఇదే జర్నలిస్టులు ఆర్నబ్ గోస్వామిని అరెస్టు చేసినప్పుడు ఖండించకపోగా, సంబరాలు చేసుకున్నారు.**



చెప్పుకుంటూ, తాము అమాయకులమని రుజువు చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. వారి భావజాలా నికి చెందిన కొందరు జర్నలిస్టులు మాత్రం దీనిని మీడియాపై దాడిగా అభివర్ణిస్తూ అత్యంత విచారాన్ని వ్యక్తం చేస్తున్నారు. కానీ, ఇదే జర్నలిస్టులు ఆర్నబ్ గోస్వామిని అరెస్టు చేసినప్పుడు ఖండించకపోగా, సంబరాలు చేసుకున్నారు. ఇటీవలే ఇండి కూటమి 14మంది జర్నలిస్టుల కార్యక్రమాలను ఖండించి, నిషేధిస్తూ జారీ చేసిన జాబితా వెనుక వీరి ప్రేరణే ఉందని పలువురు పేర్కొంటున్నారు. అంతేనా, కాంగ్రెస్, దాని మిత్రపక్ష పాలిత రాష్ట్రాలలో చిన్నవార్తలకు కూడా అరెస్టు అయిన జర్నలిస్టుల గురించి వీరు మాట్లాడరు. తమకు భిన్నంగా ఎవరు సత్యం చెప్పినా కూడా 'వాట్సాప్ యూనివర్సిటీ'లో చదువుకున్నవారంటూ గేలి చేసే ఈ గొప్ప జర్నలిస్టులు ఇప్పటివరకూ 'దేవతావస్త్రాలు ధరించిన రాజు'ల్లా తిరిగారు. కానీ వారి విషయాలన్నీ ఒక్కొక్కటిగా బయటకు వస్తున్న క్రమంలో వారి సత్యాన్ని వారూ గ్రహించుకోవాలి.

**మణిపూర్‌లోనూ అగ్నికి ఆజ్యం**

ఇప్పటికీ మణిపూర్ అగ్నిజ్వాలలా ప్రజ్వరిల్లడం వెనుక ఇటువంటి శక్తుల ప్రచారం, ప్రోత్సాహమే ఉన్నాయని తెలుస్తోంది. ఒక టీవీ ఛానెల్‌లో మాట్లాడుతూ, తాను మణిపూర్‌లో పర్యటిస్తున్న సమయంలో చైనా నుంచి వచ్చిన ఒక జర్నలిస్టును కలిశానని అయితే, భారతీయ ప్రముఖ జర్నలిస్టు ఒకరు అక్కడి పరిస్థితి గురించి ఆ విదేశీ జర్నలిస్టును తప్పు దోవ పట్టించే ప్రయత్నం చేశారని గోవా క్రానికల్ ఎడిటర్ సావియో రోడ్రిగ్స్ పేర్కొన్నారు. వాస్తవాలతో సంబంధం లేకుండా ఆ సీనియర్ జర్నలిస్టు తన దృక్పథాన్ని మాత్రమే ఆ విదేశీ జర్నలిస్టుకు చెప్పడం ఎంతవరకు సమంజసమని కూడా ఆయన ప్రశ్నించారు. నిజానికి పాశ్చాత్య దేశాలు, చైనా నుంచి వస్తున్న నిధులే అక్కడి అగ్నికి ఆజ్యాన్ని పోస్తున్నాయి. ఈ విషయాన్ని బయట పెట్టకుండా, తాము కూడా అందులో ఒక ముక్కను జర్నలిస్టులు కొందరు పంచుకుంటున్నారు.

అటు పాశ్చాత్య దేశాలు, ఇటు చైనా కూడా భారతదేశ పురోగతిని ఏదో ఒకరకంగా అడ్డుకు నేందుకు, ఇక్కడ బలహీన ప్రభుత్వం ఏర్పడేందుకు తమ వంతు కృషి చేస్తున్నాయి. భారత్‌లో పూర్తి మెజారిటీగల, స్థిరమైన ప్రభుత్వం వారి ఆటలను సాగనివ్వడం లేదు. అందుకే, ఎక్కడా తుపాకీ పేలకుండా ఈ 'పొగలేని యుద్ధా'లకు వారు పాల్పడుతున్నారు. ★





తనదైన ఆలోచన, తాను మాత్రమే చేపట్టగల ఆచరణ... ఇదీ నార్గిస్ మొహమ్మదీ విలక్షణత. పౌరుల హక్కులూ, వాటి పరిరక్షణ గురించి పోరాడుతూన్న యాభై ఒక్క వసంతాల వనితే నోబెల్ శాంతి పురస్కృతి విజేత. ప్రత్యేకించి ఇరాన్‌లోని మహిళా హక్కుల మహోద్యమానికి పరోక్ష నేతృత్వం వహిస్తున్న తన జీవితం సమస్తమూ సంచలనాలమయమే!

# మహిళా హక్కుల వేగుచుక్క 'నార్గిస్'

వాతావరణమంతా ప్రశాంతంగా కనిపిస్తుంది. కనిపిస్తుందేకానీ అక్కడ ప్రశాంతత ఉందని కాదు. ఎక్కడో ఏ మారుమూల నుంచో ఉన్నట్లుండి ఒక కేక చీల్చుకొస్తుంది. ఆ దీనస్వరం వెనక విపరీత అణచివేత ఉందనే ఉంటుంది. ఎవరు ఎక్కడ ఉక్కు కాలుతో తొక్కిపెడుతున్నా, ఆ బాధకీ భయానికీ బాధిత గుండె తల్లడిల్లుతుంది. అటువంటి తల్లడిల్లడం కొంతవరకే. అటు తర్వాతే, మొదలై తీరుతుంది ప్రతిఘటన!

పీడకుల పనిపట్టాలనీ, పీడితుల వెన్ను తట్టాలనీ నార్గిస్ తపన, తాపత్రయం, గట్టిపట్టుదల.

ఫలితం ఏమిటీ అంటే.. 1. ఇప్పటికే పదమూడుసార్లు నిర్బంధం, 2. మొత్తం ఐదు పర్యాయాలు కారాగారవాసం. 3. అక్కడున్నది ఉన్మాద ప్రభుత్వం కాబట్టి, లెక్కపెట్టి మరీ నూటయాభై నాలుగు కొరడా దెబ్బలు!

వీటన్నింటినీ మించి, ఆ యోధకి పడిన జైలుశిక్ష ఎంత కాలమో తెలుసా?

మూడు దశాబ్దాలకుపైగా!!

నేటికీ ఆమె కటకటాల వెనకే ఉన్నారు. కటిక చీకటి కదా అనుకోకుండా, అక్కడే ఆ ఇరుకిరుకు గదిలోనే అఖండ జ్యోతిని వెలిగించుకున్నారు. అది అనంత ఆత్మవిశ్వాసం, తిరుగంటూలేని విప్లవతత్వం.

విసుగూ, విరామం, అలుపూ సొలుపూ లేని ఆ నారీశక్తిని ఏ నియంతృత్వం బంధిస్తుంది? అత్యంత ప్రతిష్ఠాత్మక, ప్రపంచ ప్రఖ్యాత అవార్డు లభించకుండా ఏ దుష్టత్వం అడ్డుపడుతుంది?

ఇరాన్ 'స్థితి' జగతికి తెలిసిందే. విశాల దేశమైనా, పర్వత ప్రాంత సమన్వితమైనా, జనసాంద్రత అత్యధికంగా ఉన్నా అదంతా భౌగోళికం. అక్కడా కేంద్ర బిందువు సంస్కృతే అయినా, పలు విధాల కళలు భాగస్వామ్యం వహిస్తున్నా, నిర్మాణశైలి అంతర్జాతీయ ప్రశస్తి అందుకున్నా – అంతవరకే! పురాతన సాహిత్యం, విశేష తత్వచింతనం అలరారుతున్నా, సంప్రదాయ సంగీత ప్రాధాన్యమంటూ ఉన్నా... కాల పరిణామక్రమం ఎన్నెన్నో మార్పు చేర్పులు తెచ్చింది. సైనిక ప్రాబల్యం హెచ్చడంతో, ఆ చర్యలే పెచ్చు మీరడంతో, ఇప్పుడంతా కనిపించేది ఎప్పుడంటే అప్పుడు, ఎక్కడంటే అక్కడ, కఠినాతి కఠినంగా శాసించే లక్షణమే!

కొన్నాళ్ల క్రితం ఒక యువతిని ఇరాన్ పోలీసులు నిర్బంధించారు. తలమీద వస్త్రం సరిగ్గా వేసుకోలేదంటూ ఆరోపణ మోపారు. నిర్బంధంలో ఉండగానే ప్రాణం కోల్పోయిందామె! సంప్రదాయ పరిరక్షణ పేరుతో ప్రాణాలకే ముప్పు తెస్తారా? అని వనితా లోకం ఉద్యమించింది. అప్పుడు ముందు నిలిచి దృఢంగా స్వరాన్ని వినిపించిన మహిళామణి నార్గిస్. రగిలిపోయిన అధికారులు ఆమెనీ బంధించి కారాగారంలో ఉంచారు. స్వేచ్ఛకు సంకెళ్లు వేశారు దాదాపు ఏడాదిగా!

ఎక్కడ అణచివేత ఉంటే అక్కడ అగ్నిలా భగ్గుమంటారామె. తన ప్రతీ అడుగునీ తిరుగులేని అస్త్రంగా మార్చుకుంటారు. సామాజిక బాధ్యత వహించి సేనానిగా నిలుస్తారు. తాణాల ఊచల వెనక హక్కుల ఉల్లంఘనను ఆత్మబలంతో ఎదిరిస్తారు. నానారకాల బంధనాల మధ్యన కడతేరుతున్న పడతులను చూసి ఒక కంట నీరు, మరో కంట మంట. అమానుషాల నుంచి నిస్సహాయులను పరిరక్షించాల్సిన పాలకులే కళ్లు మూసుకుని, చేతులు ముడుచుకుని కూర్చుంటారా అంటూ నిగ్గదీస్తారు నార్గిస్.

'నాది ధర్మాగ్రహం, నేను కోరేది పరిష్కారం. మీ రాజకీయాలు, వివరణలు, సవరణలు, ఊకదంపుడు మాటలు నా దగ్గర చెల్లవు. నిలదీసి అడిగిన నన్ను, నావంటి పడతులను హింసించి ఉసురు తీయలేరు మీరెవరూ?' అని సమరనాదం చేస్తున్నందుకే, ఇరాన్‌లో పాలకులకు కంటగింపు. కక్షలూ, కార్పణ్యాలతో, ఉక్రోష వైఖరులతో ఆమెను ఇంకా బంధించే ఉంచారు.

నార్గిస్‌ది తొలి నుంచీ బాధిత కుటుంబం. జంజన్ ప్రాంతంలో పుట్టి పెరిగిన ఆమె భౌతికశాస్త్ర పట్టభద్రురాలయ్యారు. చదువుకునే రోజుల్లోనే స్త్రీ సంక్షేమం గురించి రచనలెన్నో చేశారు. సందర్భానుసారం, పోరాట బావుటా చేపట్టి ఆందోళనలెన్నింటినో నడిపారు. ఇరానీ ప్రభుత్వ నేరపూరిత ధోరణిని నిరసించినందుకే మొదటిసారి అరెస్టయ్యారు. అప్పుడు ఆమెకి పాతికేళ్లు! అప్పట్లోనే సంవత్సరం పైగా కారాగారం పాలయ్యారు.

మరింత కాఠిన్యాన్ని పెంచుకున్న ఆ ప్రభుత్వం ఆమె మీద అభియోగాల దండయాత్ర చేసింది. విద్రోహానికి పాల్పడిందంటూ మరోసారి నిర్బంధకాండకు తెగబడింది. ఆ అకృత్యం ఆగకపోగా, తెగ పెరుగుతూ వచ్చింది. కటకటాలపాలై అనారోగ్యం బారినపడిన నార్గిస్ కొన్నాళ్లు బెయిలుమీద బయటికొచ్చారు. కాస్తంత ఓపిక వచ్చాక, మళ్లీ పోరుబరిలోకి దిగారు. రాజకీయ కుటిలత్వంతో ప్రత్యర్థులకు మరణశిక్షలు 'విధిస్తున్న' పాలకపక్షాన్ని ఎదిరిస్తూ ఉద్యమాన్ని విస్తరించారు. దీంతో, తిరిగి నిర్బంధం! న్యాయస్థానాన్ని ఆశ్రయించి విడుదలైనా, ఇంకోసారి కూడా ఆ ధీర అతివ తగ్గలేదు సరికదా– గళాన్ని పెంచారు. ఊరుకుంటాయా అధికార ఉన్మత్తతలు? అప్పటి



**జంధ్యాల శరత్‌బాబు**
సీనియర్ జర్నలిస్ట్

నుంచీ టెహ్రాన్ నగరంలోని బందిఖానాలోనే ఆమె!

'అక్రమ నిర్బంధాలు వద్దు. లైంగిక హింసకు పాల్పడేవాళ్లను వదలొద్దు. కటువైన ఆంక్షల పేరిట పౌరుల హక్కుల్ని కాలరాయొద్దు..' ఇవే ఆ ఉద్యమకారిణి నినాదాలు. ఇటువంటివి అసలే నచ్చని పక్షపాత పాలకులు దమనకాండను ప్రయోగిస్తూ వస్తున్నారు. పిడికిలి బిగిస్తే తప్ప పరిస్థితి మారదని ఏనాడో గ్రహించిన ఆమె ప్రతిఘటనోద్యమాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. కారాగారంలో ఉన్నా, ఆ సంకల్పబలం సాగేదే కానీ ఆగేది కాదు.

ఐక్యరాజ్యసమితికి సంబంధించిన 'వరల్డ్ ప్రెస్ ఫ్రీడమ్' పురస్కృతి సైతం ఇదే ఏడాదిలో ఆమెను వరించి వచ్చింది. భర్త మరెవరో కాదు – తన సహచర హక్కుల కార్యకర్త. ఆ దంపతులకు కవల పిల్లలు. వారంతా ఫ్రాన్స్‌లో తలదాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంటే, వారిని నార్గిస్ చూసి కూడా కొన్ని సంవత్సరాలైంది!

వ్యక్తిగతంగా, కుటుంబపరంగా ఎన్నెన్ని కష్టనష్టాలు చుట్టుముట్టినా – తొణకని బెణకని తత్వం ఆమెది. 'స్వేచ్ఛ అనేది పవిత్రం. దానికోసం ఎవరినీ ప్రాధేయ పడాల్సిన పని ప్రజలకు లేదు, ఉండకూడదు. ఒకరు ఇస్తే తెచ్చుకునేది కాదు స్వతంత్రం అంటే, ఆ సహజ హక్కు ప్రతీ వనితకీ ఉంటుంది. అన్యాయాన్ని బాధితులు ఇంకా ఎంతకాలం సహిస్తారు? ఎవ్వరూ ఆగరు. విముక్త సాధనకు పోరు నాదం చేస్తూనే ఉంటార'న్నది ఆ హక్కుల పరిరక్షకురాలి అంతరంగం.

ఇంతటి స్థితప్రజ్ఞత, అకుంఠిత దీక్షాదక్షత నిండి ఉన్నందునే నోబెల్ శాంతి బహుమానం ఆమెనే స్వాగతించింది. అసమాన ధీరత్వానికి గుర్తింపూ గౌరవాలు లభించిన సందర్భం ఇది. రచయిత్రిగా ఆమె కలం పట్టింది వనితల కోసమే. ఉద్యమ నాయికగా పోరుబాటను చేపట్టిందీ వారి హక్కుల సంరక్షణ గురించే.

ఇటువంటి సంభావనం నిశ్చయంగా శాశ్వత స్ఫూర్తి ప్రదాయకం. ప్రపంచంలో ఎందరో పోరాటవాదు లున్నారు. ధ్యేయం నెరవేరేలా కలాన్ని, గళాన్ని ప్రయో గిస్తున్నారు. కానీ.. కారాగార గదిలో ఉంటూ, చీకటిలో చిరు దీపంలా తానే వెలుగుతూ, ఎప్పటికైనా కాంతి వచ్చి తీరుతుందని మనసా వాచా కర్మణా విశ్వసించి వ్యవహరించేంత కారణజన్ములు ఎందరుంటారు? వారిలో అగ్రస్థాయి నాయిక నార్గిస్. మనోశక్తి రీత్యా ఏకైక పాలిక. పలు విధాల పీడనపాలైన పడతుల పాలిట సమైక్య ఆశాదీపిక! యోధత్వానికి నిర్వచనం, విజయ కాంక్షకు తానొక పర్యాయపదం! జయహో! ★



# అవ్యక్త భావాలకు గళమిచ్చిన కలం

**జనాంతిక సంభాషణలు, అక్షరచిత్రాల మధ్య తారాడే జ్ఞాపకాల దొంతర్లు, లయాత్మక శైలితో మిళితమై ఉంటాయి ఈ ఏటి సాహిత్య నోబెల్ బహుమతి గ్రహీత జోన్ ఫాసె రచనలు. మనకాలపు ముఖ్య రచయితలలో ఒకరిగా ఖ్యాతి గాంచిన ఫాసె 1959లో పుట్టారు. నాలుగు దశాబ్దాలుగా రచనా రంగంలో ఉన్నారు. సాహిత్యంలోని అన్ని ప్రక్రియలు ఆయన స్వీకరించారు. నవలలు, నాటకాలు, కవిత్వం, కథలు, వ్యాసాలు, బాల సాహిత్యం- అన్ని ప్రక్రియలలోను ప్రతిభ చూపించారు. ప్రపంచంలోని దాదాపు యాభై భాషలలోకి ఆయన రచనలు అనువదితమయ్యాయి. ఆయన నాటకాలు ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ వేదికల మీద దాదాపు వేయి సార్లు ప్రదర్శనకు నోచుకున్నాయి.**




జోన్ ఒలావ్ ఫాసె నార్వే దేశస్థుడు. హోర్డాంగర్ ప్రాంతంలోని స్ట్రాండె బార్మ్‌లో జన్మించారు. ఆయన బెర్గెన్ విశ్వ విద్యాలయంలో సాహిత్యం అభ్యసించారు. తులనాత్మక సాహిత్యంలో ఎంఏ పట్టా తీసుకున్నారు. సృజనాత్మక రచనలే ప్రధాన జీవికగా చేసుకున్నా, కొద్దికాలం 'గ్యూలా టైదెండ్' అనే పత్రికలో పనిచేశారు. హోర్డాల్యాండ్ అనే చోట అకాదమి ఆఫ్ రైటింగ్ సంస్థలో కొద్దికాలం అధ్యాపకత్వం కూడా నెరపారు. అనువాదాలకు సంబంధించి కొన్ని సంస్థలకు సలహాదారు. ప్రస్తుతం ఆయన ఓస్లోలో నివాసం ఉన్నారు. 12 , 13వ ఏటనే ఆయన కొన్ని గేయాలు రాశారు. ఫాసెలోని నాటక కర్త, నవలాకారుడు ఇద్దరూ పాశ్చాత్య సాహితీ లోకంలో ప్రసిద్ధులే. సరికొత్త ధోరణిలో రాసిన ఆయన నాటకాలు, వచనం, అవ్యక్తమైన వాటికి గొంతునిచ్చాయి అని రాయల్ స్వీడిష్ అకాడమి అభివర్ణించింది. ఆధ్యాత్మిక పరిమళం ఉన్న భాషతో ఆయన రచనలు ఉంటాయని విమర్శ కులు శ్లాఘిస్తారు. కథనాన్ని కళాత్మకమైన, ప్రయోగాత్మకమైన నడకతో సాగిస్తారని అంటారు.

'రౌడ్, స్వర్ట్' (ఎరుపు, నలుపు) ఫాసె తొలి నవల. ఇది 1983లో వెలువడింది. ఆత్మహత్య ఇతివృత్తంగా ఈ నవల రాశారాయన. కానీ అంతకు రెండేళ్ల ముందు విద్యార్థుల వార్తాపత్రిక ఒకటి ఆయన 'హౌన్' పేరుతో రాసిన కథను ప్రచురించింది. అదే తన తొలి రచనగా ఫాసె చెప్పుకుంటారు. తన తొలి కవితా సంకలనం –'ఏంజెల్ మెడ్ వత్న్ ఇ ఆగెన్' (చెమ్మగిల్లిన నయనాలతో దేవత) 1986లో వెలువడింది. 1980 దశకంలో ఆయన అక్షరయానం ప్రారంభమైనప్పటికీ మంచి గుర్తింపు తెచ్చిన రచన మాత్రం 'నాయూస్‌టెట్' పేరుతో రాసిన నవల. అంటే బోట్‌హౌస్. స్వదేశంలో ఆయనకు గుర్తింపు తెచ్చిన రచన ఇదే. నవలాకారునిగా,



కథకునిగా, కవిగా ప్రసిద్ధుడైన తరువాత నాటకకర్తగా అవతరించారు ఫాసె. ఆయన తొలి నాటకం 'నొకొన్ కెమ్ తిల్ ఆ కొమె' (ఎవరైనా రావడానికే వెళు తున్నారు). ఈ నాటకం తన రచనా జీవితంలోనే గొప్ప వ్యక్తీకరణగా ఫాసె ప్రకటించుకున్నారు. కానీ ప్రదర్శనకు నోచుకున్న ఆయన తొలి నాటకం 'ఓగ్ అల్‌డ్రీ స్కాల్ బి స్కిల్‌జాన్స్' (మనం ఎప్పటికి భాగస్థులం కాకూడదు'). దీనిని 1994లో బెర్గెన్‌లోని నేషనల్ థియేటర్‌లో ప్రదర్శించారు. చిత్రంగా, రంగస్థలం పట్ల ఫాసె చిరకాలం సంశయవాదిగానే ఉంటూనే, జీవితకాలంలో ఎక్కువ భాగం నాటక రచనను అప్రతిహతంగా, అవిశ్రాంతంగా సాగించారు. అంతేకాదు, తొలినాళ్లలో నాటకాలు రాయడానికే నిరాకరించిన చరిత్ర కూడా ఉంది. నార్వేలోని అన్ని ప్రముఖ నాటకశాలలోను ఆయన నాటకాలను ప్రదర్శించారు. కొద్దికాలం తరువాత ఫాసె నాటకాలను ప్రపంచ దేశాలలో కూడా ప్రదర్శించారు. కొంచెం ఆలస్యం అయినా ఫ్రెంచ్ రంగస్థల దర్శకుడు క్లాడ్ రేగీ 'నొకొన్ కెమ్ తిల్ ఆ కొమె' పారిస్‌కు బయట ప్రదర్శనలు ఇచ్చిన తరువాత అంతర్జాతీయంగా ఫాసెకు గుర్తింపు వచ్చింది. అంటే ఈ నాటకం మొదటి రచనే అయినా, తరువాత నాటకీయంగా విదేశీ గడ్డ మీద పేరు తెచ్చిపెట్టింది. అది 1999లో జరిగింది. మరుసటి సంవత్సరం బెర్లిన్‌లోని ప్రతిష్ఠాత్మక నాటకశాల షౌబునేలో షాల్జ్‌బర్గ్ ఉత్సవాల సందర్భంగా ఫాసె రచించిన 'నామ్‌నెత్' (ఆ పేరు) నాటకం ప్రదర్శించారు. పారిస్‌కు బయట జరిగిన ప్రదర్శనలు, బెర్లిన్‌లో ఏర్పాటైన ప్రదర్శనతో నాటక రచయితగా ఫాసె కీర్తి విశ్వవ్యాప్తమైంది. ఇప్పుడు ప్రపంచంలోని చాలా దేశాలలో ఆయన నాటకాలను ప్రదర్శిస్తున్నారు.

ఫాసెకు సాహిత్యలోకంలో ప్రధానంగా నాటకకర్తగానే గుర్తించేటంత ఖ్యాతి వచ్చినా, ఆయన ఇతర సాహితీ ప్రక్రియలను కూడా కొనసాగించారు. అవి కూడా అత్యున్నత సాహిత్య విలువలు కలిగినవిగా పేరు తెచ్చుకున్నాయి. ఉదాహరణకి- మెలాంకలి-1, మెలాంకలి-2 నవలలు. తప్పని ఒక విచారగ్రస్థ స్థితిని మెలాంకలి అంటారు. ఆ రెండు నవలలు నార్వేజియన్ చిత్రకారుడు లార్స్ హెర్టెర్విగ్ జీవితం ఆధారంగా రాసినవి. 'ఉదయం- సాయంత్రం' పేరుతో మరొక నవల రాశారు.




ఫాసె నలభయ్ వరకు నాటకాలు రాశారు. పైన పేర్కొన్న వాటితో పాటు, 'వింటర్', 'ఐన్ సొమ్మర్స్ దాగ్' (వేసంకాలపు రోజు), 'డ్రామ్ ఉమ్ హొస్టిన్ (వసంతం కన్న కల), 'డాడ్స్ వారియాసో జొనార్ (చావు వైరుధ్యాలు), 'స్వెవెన్' (నిద్ర), 'ఇగ్ ఎర్ విండెన్' (నేనే ఆ పవనాన్ని) నాటకాలు కూడా ఫాసె అందించారు. వీటితోనే ఆయన ప్రపంచ స్థాయి నాటకకర్తగా పేర్గాంచారు.

ఫాసెకు సాహిత్యలోకంలో ప్రధానంగా నాటకకర్తగానే గుర్తించేటంత ఖ్యాతి వచ్చినా, ఆయన ఇతర సాహితీ ప్రక్రియలను కూడా కొనసాగించారు. అవి కూడా అత్యున్నత సాహిత్య విలువలు కలిగినవిగా పేరు తెచ్చుకున్నాయి. ఉదాహరణకి- మెలాంకలి-1, మెలాంకలి-2 నవలలు. తప్పని ఒక విచారగ్రస్థ స్థితిని మెలాంకలి అంటారు. ఆ రెండు నవలలు నార్వేజియన్ చిత్రకారుడు లార్స్ హెర్టెర్విగ్ జీవితం ఆధారంగా రాసినవి. 'ఉదయం- సాయంత్రం' పేరుతో మరొక నవల రాశారు. ఒక శిశువు జననం, కొన్ని దశబ్దాల తరువాత అతని మరణం ఈ నవలలో చిత్రించారు ఫాసె. వాయులీన కళాకారుడు అస్లే నాయకుడిగా ఫాసె రాసిన ట్రయాలజీ (ఒకదానితో ఒకటి సంబంధం కలిగిన మూడు రచనలు) మనసును విచలితం చేస్తుంది. అస్లే, అతని స్నేహితురాలు ప్రధాన పాత్రలుగా సాగే ఈ రచనలకే ఫాసెకు నోర్డిక్ కౌన్సిల్ సాహిత్య పురస్కారం (2015) లభించింది. ఫాసె సాహిత్య సమీక్షకునిగా కూడా ఖ్యాతి గడించారు. చాలా పుస్తకాలను నార్వే భాషలోకి అనువదించారు కూడా.

ఇంతవరకు ఫాసె రచనలలో సుదీర్ఘమైనదిగా 'సెప్టాలజీ'ని చెబుతారు. నాటక రచనకు విరామం ఇచ్చిన సమయంలో (2019-21) ఇది రాశారు. మరొక అంశం- చిరకాలం నాస్తికునిగా ఉన్న ఫాసె 2013లో కేథలిక్ క్రైస్తవం స్వీకరించిన తరువాత ఈ రచనను ఆరంభించడాన్ని కూడా విమర్శకులు ప్రత్యేకంగా ప్రస్తావిస్తారు. తన రచనా శైలిని ఫాసె సెప్టాలజీగా (మందగమన వచనం) చెబుతారు. స్థాయీ భేదాలు, దృశ్యాలు, ప్రతిబింబాలు ఇందులో ప్రత్యేకత. ఈ శైలి సరిగ్గా వేగవంతంగా నడిచే నాటక ప్రక్రియకు పూర్తి భిన్నమైనది. సెప్టాలజీ మూడు భాగాలుగా వెలువడింది. మరొక పేరు, మరొక నేను, కొత్త పేరు అని వాటికి పేర్లు పెట్టారు ఫాసె. కాలగతిలో మద్యపానం అలవాటు, స్నేహం, ప్రేమ వంటి అంశాల గురించి దేవుడు, కళ ఏం చెప్పాయో సంకేతాత్మకంగా ఆవిష్కరించిన రచన. దానిని 20 భాషలలోకి అనువదించుకున్నారు. ఇది కూడా ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి గాంచింది. బార్జె పురస్కారం, క్రిటిక్స్ పురస్కారం కూడా దీనికి వచ్చాయి.

బుకర్ ఎంపిక జాబితాలోకి, అమెరికన్ నేషనల్ బుక్ పురస్కారం కోసం దీనిని పరిగణనలోనికి తీసుకున్నారు. సెప్టాలజీ కోసం ఆపేసిన నాటక రచనను తరువాత ఫాసె తిరిగి ప్రారంభించారు. ఆయన రచనా వ్యాసంగం నిరంతరం కొనసాగుతూనే ఉంది. 2020 నుంచి ఆయన ఇప్పటివరకు మూడు నాటకాలు రాశారు. 'క్విటెక్' (ఒక వెలుగు) పేరుతో రాసిన నవల కూడా ఆయన కీర్తిని మరింత పెంచింది. ఈ నవల 2023లోనే విడుదలయింది. ఇది కూడా జనన మరణాల మధ్య సరిహద్దులను వివరిస్తుంది.

– జాగృతి డెస్క్





MARCHING
—AHEAD WITH—
INDIA
SURYA
SURYA
Integrating India with state-of-the-art products. Adding bright colours to every Indian's life.
Spearheading the league of bringing a change. Setting new landmarks. Understanding global trends in business.
Anticipating challenges. Adopting faster. Upgrading business processes. And delivering.
Just like India, an ever-growing, ever-emerging nation, Surya has been scripting an awe-inspiring growth story for the last 5 decades. No wonder, it has come a long way since its incorporation back in 1973.
I am SURYA
CELEBRATING 50 YEARS OF TRUST
DURABLE PRODUCTS
ASSURED QUALITY
CONSUMER LIGHTING
PROFESSIONAL LIGHTING
APPLIANCES
FANS
PVC PIPES
STEEL PIPES
SURYA ROSHNI LIMITED
E-mail: consumercare@surya.in I www.surya.co.in I Tel.: +91-1147108000
Toll Free No.: 1800 102 5657
/suryalighting I /surya_roshni

ప్రపంచీకరణ పుణ్యమా అని విశ్వమే ఒక కుగ్రామంగా మారి, ఒకరిపై ఒకరు ఆధారపడి జీవిస్తున్న ప్రపంచ దేశాలు, ఈ కాలంలో సంభవించే యుద్ధ దుష్పరిణామాలు ఎలా ఉంటాయో ఇప్పటికే అనుభవిస్తున్నాయి. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధమే ప్రపంచానికి తలనొప్పిగా మారిన క్రమంలో ఇప్పుడు పాలస్తీనా, ఇజ్రాయెల్ మధ్య ప్రారంభమైన 'యుద్ధం' ఎటువంటి పరిణామాలకు దారి తీస్తుందోనని ప్రజలూ, చాలా దేశాలూ కలవర పడుతున్నాయి. అక్టోబర్ 7వ తేదీన వేకువన 'ఆపరేషన్ అక్సా స్టార్మ్' పేరుతో పాలస్తీనా ఉగ్రవాద సంస్థ హరాకత్ అల్ మక్వామా అల్ ఇస్లామియా (హమాస్) వేలాది రాకెట్ల ప్రయోగంతో హఠాత్తుగా మొదలు పెట్టిన ఈ యుద్ధం వల్ల క్షణాలలో కనీసం వేలాది మంది అసువులు బాశారు. దాడి మొదలైన కొంత సేపటికే ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహూ తాము 'యుద్ధంలో ఉన్నట్టు' ప్రకటించారు. ఇజ్రాయెలీల పండుగ షబ్బత్ వేళ ఈ దాడి జరిగింది. యుద్ధంలో ఉగ్రవాద సంస్థ హమాస్ ముందు ఉంది. వెనుక మాత్రం కొన్ని దేశాలే ఉన్నాయి.




ఈ ఇరు ప్రాంతాల మధ్య ఉద్రిక్తతలు ఈనాటివి కాకపోయినా, ఈ స్థాయిలో హమాస్ దాడికి దిగడం మొదటిసారి. విచక్షణారహితమైన జన హననం, అమాయక ప్రజలను బందీలుగా తీసుకుపోవడం ప్రపంచాన్ని నిశ్చేష్టులను చేశాయి. ప్రపంచాన్నేమిటి? ఇజ్రాయెల్‌కే జరుగుతున్నదేమిటో అర్థం చేసుకుని, ప్రతిస్పందించడానికి కొన్ని గంటలు పట్టిందని అంటున్నారు. ఈ ఘటనలో చోటు చేసుకున్న ప్రాణనష్టం, హఠాత్పరిణామం అమెరికాలోని 9/11ను తలపిస్తున్నాయని విశ్లేషకులు అంటున్నారు.

1948లో ఆవిర్భవించిన ఇజ్రాయెల్ అనేక పర్యాయాలు పాలస్తీనియన్లతో యుద్ధాలకు దిగింది. 1956లో సూయజ్ సంక్షోభం, 1967లో ఆరురోజుల యుద్ధం, 1973లో యోమ్ కిప్పర్ యుద్ధం...ఇలా ఇజ్రాయెల్ ఎప్పుడూ చుట్టూ ఉన్న అరబ్ దేశాల కారణంగా యుద్ధ సన్నద్ధతను జీవన విధానంగా మార్చుకున్నట్టు కనిపిస్తుంది. ఈసారి మాత్రం ఇజ్రాయెల్ దిమ్మెరపోయేలా దాడులు జరగడంతో ప్రపంచానికి ఇజ్రాయెల్ పెంచిన ఆధునిక సాంకేతిక, రక్షణ పరిజ్ఞానాల పట్ల భ్రమలు తొలిగిపోనట్లు చెబుతున్నారు.

ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమెన్ నెతన్యాహూ తాము యుద్ధాన్ని ఎదుర్కొంటున్నామని బహిరంగంగా ప్రకటించారు. గాజా ప్రాంతంలో విద్యుత్ కోత, ఇతర నిత్యావసరాలు సహా ఏ వస్తువుల రవాణా ఉండదని స్పష్టం చేశారు. దీనితో హమాస్ తీవ్రవాదులు అంధకారంలోనే పోరు సాగిస్తున్నారు. 2007లో ఈజిప్టు మద్దతుతో ఈ తీరప్రాంతంపై హమాస్ పట్టు సాధించింది. అప్పటి నుంచీ ఈ ప్రాంతం వారి కబంధ హస్తాల్లోనే ఉండి ఇజ్రాయెల్ కంట్లో నలుసులా తయారైంది.

1970వ దశకంలో నాటి ప్రధాని గోల్డా మీర్ పాలస్తీనియన్ల అరాచకాలను ఖండిస్తూ, 'మా పిల్లలను చంపినందుకు మేము మిమ్మల్ని క్షమించగలం. కానీ, మీ పిల్లల్ను మేము చంపేలా చేసినందుకు మిమ్మల్ని మేము ఎప్పటికీ క్షమించలేం,' అన్న మాటల బాటలో నేడు ఇజ్రాయెల్ వైఖరి, పోరాటం సాగుతోంది.

ప్రస్తుతం ఇజ్రాయెల్ సాగిస్తున్న దాడులలో గాజాలో గల ఏడు మసీదులు ధ్వంసం అయినట్టు వార్తలు వస్తున్నాయి. ఒకవైపు మరణాలు, విద్యుత్ లేకపోవడం, మంచినీరు సహా నిత్యావసర వస్తువుల సరఫరా నిలిపివేతతో గాజాలో ప్రజలు అల్లాడుతున్న నేపథ్యంలో హమాస్ కాల్పుల విరమణ చర్చలకు సిద్ధమేనని ప్రకటించింది. కానీ హమాస్ సభ్యులందరినీ సమూలంగా తుడిచిపెట్టే వరకూ చర్చలు లేవంటూ ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలోను ఖతార్‌లో విలాసవంతమైన జీవితాలు సాగిస్తున్న హమాస్ నాయకత్వాన్ని ఎవ్వరూ ప్రశ్నించకపోవడం ఆశ్చర్యకరమైన అంశం.

# ర యుద్ధం



ఈ యుద్ధంతో అటు మధ్య ఆసియా, ఇటు భారత్ కూడా అప్రమత్తమైనాయి. తమ చిరకాల మిత్రదేశం ఇజ్రాయెల్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మద్దతు ప్రకటించారు. ఈ దాడిలో హమాస్ తీవ్రవాదులు బందీలు చేసిన, హత్య చేసిన వారిలో విదేశీయులు ఉండడం ఆయా దేశాలను ఆందోళనకు గురిచేస్తున్నది.

**అసలు ఏం జరిగింది?**

ఏడో తేదీ ఉదయం 6.30 గంటలు. ఇంకా ముప్పాతిక మంది ఇజ్రాయెలీలు నిద్ర కూడా లేవలేదు. వారు 'షబ్బత్' (మత సంప్రదాయంగా పాటించే విశ్రాంతి)లో ఉన్నారు. ఈ లోపలే పెద్దగా సైరన్, కర్ణభేరి దెబ్బతినేలా రాకెట్ శబ్దాలు వినిపించడంతో ప్రజలు ఉలిక్కిపడి లేచారు. తొలి కొద్ది గంటలలోనే దాదాపు 5000 రాకెట్లను హమాస్ ప్రయోగించినట్టు వార్తలు వచ్చాయి. ఈ తీవ్రవాదులు ఇరు ప్రాంతాల మధ్య కంచెను కూలదోసి, పారాగ్లైడర్ల ద్వారా ఇజ్రాయెల్ భూభాగంలోకి చొరబడి అమాయక ప్రజలపై తమ ప్రతాపాన్ని చూపడం ప్రారంభించారు. బాలాది వృద్ధ పర్యంతం ఎవరినీ వదలకుండా హమస్ తీవ్రవాదులు విచక్షణారహితంగా హతమార్చడం ప్రారంభించారు. రోడ్లపై ఉన్నవారిని, ముఖ్యంగా యువతులను బందీలుగా పట్టుకున్నారు. వారిపై అత్యాచారాలు జరిపి, తమ ప్రాంతానికి తీసుకువెళ్లి వివస్త్రలను చేసి ఊరేగించిన వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో కోకొల్లలుగా పోస్ట్ చేశారు. ముఖ్యంగా, ఇజ్రాయెల్ దక్షిణ ప్రాంతంలో సంగీత విభావరి కోసం చేరిన యువతీ,యువకులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపి, మరణించిన యువతులపై బతికి ఉన్నవారి ఎదుట అత్యాచారం చేయడం అన్నది ఎవరి రక్తాన్నైనా మరిగించే విషయం. ఇంత జరుగుతున్నా, సోషల్ మీడియాలో ఇజ్రాయెల్‌కు ప్రతికూలంగా పలువురు మాట్లాడడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. హమాస్ సమర్థకులు ఇజ్రాయెలీల అత్యాచారాలను బయిటపెడుతున్నారు.

సైరన్ వినిపించగానే, తమ సురక్షిత స్థానాల పేరుతో భూగృహంలో నిర్మించుకునే కట్టడాలలోకి వెళ్లేలోపే, ఈ తీవ్రవాద మూకలు ఇళ్లలోకి ప్రవేశించి, రాక్షసుల్లా ప్రవర్తించారని వార్తలు వచ్చాయి. ఇజ్రాయెల్ రక్షణ దళాలు రంగంలోకి దిగడానికి ఆలస్యం కావడంతో అధికారిక లెక్కల ప్రకారం 700కు పైగా ఇజ్రాయెలీలు మరణించినట్టు ఆ సాయంత్రానికి ప్రకటించారు. ఈ సంఖ్య నానాటికీ పెరుగుతుంది. అంతేకాదు, హమాస్ ఆక్రమించుకున్న మూడు గ్రామాల కోసం ఇరువురి మధ్య పోరాటం సాగుతూనే ఉంది. శనివారం రాత్రి నుంచి ఆదివారం, సోమవారం వరకూ యుద్ధం కొనసాగుతూ, ఇది ఇప్పుడే ఆగేది కాదనే విషయాన్ని స్పష్టం చేస్తోంది. ఆదివారం నుంచి గాజాలో దాక్కుని ఉన్న తీవ్రవాదులను హననం చేయడం, ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకునేందుకు ఇజ్రాయెలీ సైనిక దళాలు ఆపరేషన్‌ను నిర్వహిస్తున్నాయి. వాస్తవానికి, గాజా ప్రాంతంలో అటు పాలస్తీనియన్లతో పాటు, ఇజ్రాయెలీలు కూడా జీవిస్తూ ఉండడం వల్ల ఇజ్రాయెలీ భద్రతా దళాలు కొంత అప్రమత్తతను పాటించినా, వెనక్కి మాత్రం తగ్గడం లేదు.

**నిఘా వైఫల్యం**

ప్రపంచ నిఘా సంస్థలలోనే అత్యంత ప్రముఖమైన, ప్రాచుర్యం పొందిన 'మొస్సాద్' ఈ దాడి విషయంలో ముందస్తు సమాచారాన్ని సేకరించలేకపోవడం, అప్రమత్తతతో ఉండకపోవడం ప్రపంచాన్ని ఆశ్చర్యానికి లోను చేస్తోంది. ఇజ్రాయెల్ జాతీయ నిఘా సంస్థ మొస్సాద్. సీఐఏ తర్వాత ఏడువేల మంది బలమైన సిబ్బంది, మూడు బిలియన్ల బడ్జెట్‌తో నడిచే అతిపెద్ద నిఘా సంస్థ. పాలస్తీనా తీవ్రవాద గ్రూపులు, లెబనాన్, సిరియా, ఇరాన్ సహా పలు శత్రుదేశాలలో ఏజెంట్లు, నెట్‌వర్క్ కలిగిన ఈ సంస్థ విఫలం కావడం ఆశ్చర్యమే. సరిగ్గా ఐదు దశాబ్దాల కింద అంటే, 1973 అక్టోబర్ 6 నుంచి 25 వరకు ఈజిప్టు, సిరియా నాయకత్వంలోని అరేబియా దేశాలు, ఇజ్రాయిల్‌కు మధ్య సాగిన యోమ్ కిప్పర్ యుద్ధం లేదా రమదాన్ యుద్ధ సమయంలో కూడా మొస్సాద్ ఇలాగే విఫలమైనట్టు విశ్లేషకులు గుర్తు చేసుకుంటున్నారు.

ఇదిలా ఉండగా, కాలానుగుణంగా గాజా–ఇజ్రాయెల్ సరిహద్దులలో కెమెరాలు, గ్రౌండ్ మోషన్ సెన్సార్లు వంటి హైటెక్ భద్రతా ఏర్పాట్లు, నిత్యం సైనిక పహారాలు హమస్ తీవ్రవాదులు లోపలకు చొరబడటాన్ని ఎలా పసిగట్టలేకపోయాయనే ప్రశ్నలు తల ఎత్తడమే కాదు, మొస్సాద్‌కు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిష్ఠ తీవ్రంగా దెబ్బతిన్నది. ముఖ్యంగా,

అక్టోబర్ 9న ఈజిప్టుకు చెందిన ఒక నిఘా అధికారి, గాజా నుంచి పని చేస్తున్న తీవ్రవాద సంస్థ ఏదో పెద్ద ఎత్తున చేసేందుకు ప్రణాళికలు వేస్తోందంటూ పదే పదే హెచ్చరికలు చేసినప్పటికీ, విస్మరించారని, తమ దృష్టినంతా వెస్ట్ బ్యాంక్‌పైనే కేంద్రీకరించారని పేర్కొన్నట్టు అక్కడి దినపత్రికలు ప్రచురించడంతో మొస్సాద్ ముఖం దాచుకునేందుకు పరుగులు తీస్తున్నట్టు కనిపిస్తోంది.

**ఇజ్రాయెల్ అంతర్గత రాజకీయాలే కారణమయ్యాయా?**

నిన్న మొన్నటివరకూ ఇజ్రాయెల్ అంతర్గత



సంక్షోభంలో కూరుకుపోయింది. ప్రస్తుత ప్రధాని బెంజిమెన్ నెతన్యాహూ ప్రవేశపెట్టిన న్యాయ సంస్కరణలకు వ్యతిరేకంగా అక్కడి ప్రజలు ఉవ్వెత్తున ఎగిసిపడ్డారు. రోజువారీ నిరసనలు, హర్తాళ్లు నిత్యకృత్యం అయ్యాయి. నెతన్యాహూ తన అవినీతిని దాచుకునేందుకే ఈ సంస్కరణలు ప్రవేశపెట్టారనే భావనలోకి ప్రజలు వెళ్లారు. వాస్తవానికి ఇజ్రాయెల్‌కు లిఖితపూర్వక రాజ్యాంగం లేదు. వారు ప్రభుత్వ పనితీరును క్రమబద్ధీ కరించేందుకు పూర్వ సంప్రదాయాలు, కట్టుబాట్లపై ఆధారపడతారు. ప్రజల ఆగ్రహానికి గురైన నెతన్యాహూ 2021లో తన పదవికి రాజీనామా చేసి సంకీర్ణ ప్రభుత్వానికి తావిచ్చారు. మరు ఏడాదే జరిగిన ఎన్నికలలో తన పార్టీ గెలుపుకు బాటలు వేసి, తిరిగి ప్రధానమంత్రి పదవిని చేపట్టారు. ఆ తర్వాతే ఆయన న్యాయసంస్కరణలపై దృష్టి కేంద్రీకరించి ప్రజల ఆగ్రహానికి గురయ్యారు. ఈ అంతర్గత కల్లోలాల వల్లనే ప్రభుత్వం హమాస్ తీవ్రవాదులపై దృష్టి పెట్టలేకపోయిందనే వాదన కూడా వినిపిస్తోంది.

అయితే, మన దేశంలోలా కాకుండా, తమ దేశంపై దాడి జరిగినప్పుడు ఇజ్రాయెల్‌లోని పార్టీలన్నీ ఏకమై నెతన్యాహూకు తమ మద్దతును ప్రకటించాయి. అక్కడ, బయట ఉన్న కొన్ని వామపక్ష శక్తులు నెతన్యాహూ తక్షణమే రాజీనామా చేయాలని కోరుకుంటున్నప్పటికీ, ప్రజలు కానీ, మిగిలిన పార్టీలు కానీ ఆ దిశగా ఆలోచిస్తున్నట్టు కనిపించడం లేదు.

అంతేకాదు, ఐరోపా దేశాలు సరే, యుఎఇ వంటి మధ్య ఆసియా ముస్లిం దేశం కూడా ఇజ్రాయెల్‌కే మద్దతు ప్రకటించడం ఆయనకు ఒక సానుకూల అంశం.

**భారత్, మధ్యప్రాచ్యం, ఐరోపా కారిడార్**

ఇటీవలే న్యూఢిల్లీలో జరిగిన జి20 సమావేశంలో ఈ కారిడార్‌ను నిర్మించడానికి అంగీకారం కుదిరింది. ఈ దాడి కారణంగా మధ్య ప్రాచ్యంలోని దేశాలు ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా, అనుకూలంగా చీలిపోవడం వల్ల ఈ కారిడార్ పనులకు విఘాతం కలిగే అవకాశం కనిపిస్తోంది. ఈ ప్రాజెక్టు చైనా చేపట్టిన బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ (బిఆర్ఐ)కు ప్రతిగా నిర్మిస్తున్నదని, ఇది భారత్‌కు వ్యూహాత్మక ప్రాముఖ్యం కలిగి ఉన్న ప్రాజెక్టని చెబున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే, ఐరోపా మార్కెట్లతో భారత్‌కు ప్రత్యక్షమార్గం ఏర్పడి, భారత్, మధ్య ప్రాచ్యం నడుమ వాణిజ్యం, పెట్టుబడులను ప్రోత్సహిస్తుంది. మధ్యప్రాచ్యంలో ఈ యుద్ధం వల్ల ఉద్రిక్తతలు, అస్థిరతలు పెరిగితే ఇక్కడ వాణిజ్యం, పెట్టుబడులకు ఎవరూ ముందుకు రారనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

కాగా, ఇందుకు వ్యతిరేకమైన వాదన కూడా వినిపిస్తున్నది. తాత్కాలికంగా ఈ ప్రాజెక్టు పనులు నిలిచిపోయినా, అంతిమంగా ఈ ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేస్తారని కొందరు విశ్లేషకులు అంటున్నారు. ప్రస్తుతం ప్రారంభమైన యుద్ధం, ఇటు ఇస్లామిక్ తీవ్రవాదులను తుడిచిపెట్టి, అక్కడ శాంతి ఏర్పడేందుకు దోహదం చేస్తుందని అనేవారు లేకపోలేదు. ఇప్పటికే, హమాస్ స్థావరాలతో పాటు లెబనాన్ సరిహద్దులలోని హిజ్బుల్లా ఉగ్రవాద సంస్థ స్థావరాలపై కూడా ఇజ్రాయెల్ దాడులు చేస్తోందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇవి ఆ ప్రాంతంలో తీవ్రవాదాన్ని తుడిచిపెట్టేందుకు జరుగుతున్నవే అంటున్నారు.

**ఇది రాజకీయ చదరంగమా?**

ఇటీవలే తమ పౌరులు కొందరి విడుదల కోసం అమెరికా ప్రభుత్వం ఇరాన్‌కు కొన్ని బిలియన్ల డాలర్లను విడుదల చేసింది. ఈ ధీమాతోనే ఇరాన్ హమాస్‌ను ప్రత్యక్షంగా సమర్ధిస్తోంది. కాగా, ఒక్క నెల ముందు, అంటే జి20 సమావేశంలో ఈ కారిడార్ ప్రకటన వెలువడే ముందు ఇరాన్, సౌదీ అరేబియా దౌత్యవరమైన సంబంధాలను పునరుద్ధరించుకున్నాయి.

అలాగే, ఇజ్రాయెల్‌తో దౌత్యపరమైన సంబంధాలకు సుముఖతను చూపిన సౌదీ అరేబియా ఇప్పుడు హమాస్‌ను సమర్ధిస్తోంది. కానీ, తమ దేశం సర్వతోముఖాభివృద్ధి చెందాలని అమెరికాను ప్రతిఘటించి మరీ పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టిన ఆ దేశ పాలకుడు మహమ్మద్ బిన్ సల్మాన్ ఈ క్రమంలో తీవ్రవాదులను నిజంగా సమర్ధిస్తారా అన్నది కూడా ప్రశ్నే. వ్యూహాత్మక భౌగోళిక రాజకీయ చదరంగంలో ఏ పావులు ఎందుకు కదులుతున్నాయో అర్థం చేసుకోవడానికి కొంత సమయం పడుతుంది.

ఈ క్రమంలోనే అమెరికా స్పందనను అర్థం చేసుకోవలసి ఉంటుందేమో! ఈ దాడిని ఖండించేందుకు అమెరికా చాలా సమయం తీసుకున్నది. భారత ప్రధాని మోదీ ఖండించినట్టుగా బైడెన్ ప్రకటన వెలువడలేదు. దాడి ప్రారంభమైన సాయంత్రానికి అమెరికా ఖండనే కాక, ఆయుధాల సరఫరా గురించి ప్రకటన వెలువడింది. యుకె ప్రధాని రుషీ సునాక్ కూడా ఈ దాడిని ఖండిస్తూ, ఇజ్రాయెల్‌కు మద్దతు ప్రకటించారు.

ఇంతటి మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతున్నా, ఉదారవాదులు, మానవహక్కుల గురించి మాట్లాడేవారు ఖండించకపోవడం ఒక అంశమైతే, అలా చెప్పుకునే అదే మత సంప్రదాయానికి చెందిన జర్నలిస్టులు కొందరు సోషల్ మీడియాలో వచ్చిన వీడియోల కింద వాళ్లకలా జరగాల్సిందే అని వ్యాఖ్యలు పెట్టి దిగజారుడుతనాన్ని బయట పెట్టుకున్నారు.

– జాగృతి డెస్క్



సమస్త సృజనకు అక్షరమే మూలం. అది అజ్ఞాన తిమిరాన్ని హరించి జ్ఞానప్రభలను వెలిగిస్తుంది. దానికి అధిదేవత వాణి. బ్రహ్మ స్వరూపిణి. దీపం నుంచి కాంతి ప్రసరించినట్లు అమెలోని చైతన్యం జగత్తంతా విస్తరిస్తుంది. దుర్గాదేవి శరన్నవరాత్రులలో మూలా నక్షత్రం నాడు సర్వస్వతీమాతగా దర్శనమిస్తుంది. పరాశక్తి లోక సంరక్షణార్థం వేర్వేరు సందర్భాలలో సరస్వతీ అవతారం సహా దుర్గ, లక్ష్మీ, రాధ, సావిత్రిగా అవతరించింది (వీరిని పంచశక్తులు అంటారు). విద్య, విజయాలను అందించే సరస్వతి శత్రు సంహారిణి కూడా. శుంభునిశుంభులను సంహరించింది. సరస్వతీదేవి సురాసురాది సర్వ మునిజన వందిత వాగ్దేవత అని స్కంద పురాణం వర్ణించింది. ఆపాదమస్తకం శ్వేతవర్ణంలో శోభిల్లే ఆమెను అర్చించడం వల్ల సత్ఫలితాలు పొందగలరని ఆధ్యాత్మిక భావన. ఉత్తర భారతీయులు మాఘమాసం వసంత పంచమి నాడు సరస్వతీ పూజ నిర్వహిస్తే దక్షిణాదిన శరన్నవరాత్రులలో ఏడవ రోజున కూడా (మూలానక్షత్రం) అర్చిస్తారు.

# ‘అక్షర’మాతకు అభివందన చందనం

దేశంలోని అష్టాదశ పీఠాలు సహా అనేకానేక శక్తిక్షేత్రాలలో ఆశ్వీయుజ శుక్ల పాడ్యమి నుంచి దేవీ నవరాత్రుల ఉత్సవాలు కొనసాగుతున్నాయి. వీటిలో అతి ముఖ్యమైన మూలానక్షత్రంతో కూడిన సప్తమి తిథి నాడు జగన్మాతను సరస్వతీ అలంకారంలో అర్చిస్తారు. దుష్టశిష్టణ, శిక్షణరక్షణ కోసం అవత రించిన శక్తి స్వరూపిణి జగన్మాత సరస్వతీ అవతారంతో శుంభునిశుంభులనే దానవులను సంహరించింది.

మానవజాతి సకల దోషాలను హరించడంతో పాటు జ్ఞానజ్యోతిని వెలిగించ సంకల్పించిన దుర్గామాత సరస్వతీ అవతారంతో అనుగ్రహించారు. ‘దైవం మంత్రాధీనం’ అంటారు సద్గురువులు. ఆ మంత్రాలకు అధిదేవత సరస్వతీ మాత. అనంతమైన అక్షర మహిమతోనే జ్ఞానం వెలుగులు విర చిమ్ముతుంది. మాతృమూర్తులలో, నదులలో, దేవతలలో ఉత్తమమైనది సరస్వతి (‘అంబీతమే నదీతమే దేవీతమే సరస్వతి’) అని రుగ్వేదవాక్కు. సరస్వతీ నదీ తీరంలోనే వేదకాలపు నాగరికత వర్థిల్లిందని, ప్రకృతిలోని మార్పుల కారణంగా ఆ నది అదృశ్యమై అంత ర్వాహినిగా ప్రవహిస్తోందని చరిత్ర చెబుతోంది

శారదాంబను ఒక్కొక్క తీరుగా అభివర్ణిస్తారు, అర్చిస్తారు. వ్యాస భగవానుడు సరస్వతిని వేదమాతగా, కాళిదాసు మాతంగిగా అభివర్ణించగా, ఇంకొందరు రాజశ్యామలగా కొలుస్తారు. సాహిత్య వేత్తలకు సరస్వతి అత్యంత పూజనీయురాలు. ఆదికవి నన్నయ్య మహాభారత రచనకు ‘శ్రీవాణీ....’అని శ్రీకారం చుట్టారు. లక్ష్మీస్వరూపిణీగా సంపదను, సరస్వతిగా జ్ఞానాన్ని, పార్వతిగా శక్తిని ప్రసాదించే దుర్గమ్మను ‘అమ్మలగన్నయమ్మ ముగురమ్మల మూలపుటమ్మ....’ పద్యంలో ‘కృపాబ్ధి ఇచ్చుత మహత్త్వ కవిత్వ పటుత్వ సంపదల్’ అంటూ కృపా సముద్రురాలైన జగన్మాత విద్యాప్రదాయినిగా కవిత్వ సంపద ఇస్తుందని పోతనామాత్యుడు అభివర్ణించాడు. శ్రద్ధాభక్తులతో అర్చిస్తే చదువుల తల్లి ప్రసన్నురాలై జ్ఞానభిక్ష ప్రసాదిస్తుందని విశ్వాసం. ఆ క్రమంలోనే మూలానక్షత్రం సందర్భంగా పిల్లలతో పాఠశాలల్లో సరస్వతీ పూజ నిర్వహిస్తారు. బడి ఈడు పిల్లలకు అక్షరాభ్యాసం కూడా చేపడతారు.

సరస్వతీ అమ్మవారిని ‘సర్వశుక్లాం శుద్ధరూపం’ అన్నారు. ‘తెల్లని వస్త్రం ధరించిన సరస్వతీదేవి కాంతిమంత వదనంతో, చల్లని చిరునవ్వు వెదజల్లుతుంటుంది. ఆమె ధరించే తెలుపు రంగు చీరను స్వచ్ఛతకు, ఆమె వాహనం శ్వేత హంసను ఆత్మలకు మూలమైన పరమాత్మకు సంకేతంగా చెబుతారు. హంస పాలను, నీటిని వేరు చేస్తున్నట్లే మనిషిలోని మంచి చెడులను బేరీజు వేస్తూ, పాల లాంటి ‘మంచి’ని అమ్మవారు వాహనంగా చేసుకొని జగతికి దిశానిర్దేశం చేస్తారని చెబుతారు.

శంకరభగవత్పాదులు నెలకొల్పిన నాలుగు ఆమ్నాయపీఠాలలో దక్షిణామ్నాయ శృంగేరి శారదా పీఠం మొట్ట మొదటిది. అక్కడ శరన్నవరాత్రుల సందర్భంగా చదువుల తల్లిని విశేష అలంకారాలతో అర్చిస్తారు. విజయనగర సామ్రాజ్య సంస్థాపనా చార్యులు విద్యారణ్య మహర్షి (14 శతాబ్దం) ప్రారంభించిన దర్బార్ సంప్రదాయంగా వస్తోంది.

‘విద్వాన్ సర్వత్ర పూజ్యతే..’ అనే ఆర్యోక్తికి జ్ఞాన ప్రదాయిని సరస్వతీ దేవి హేతువు. విద్యవల్ల వినయం, వినయం వల్ల పాత్రత, పాత్రతవల్ల ధనం, ధనం వల్ల ధర్మం, దాని కారణంగా ఐహికాముష్మిక సుఖమూ కలుగుతాయని ఆర్యవాక్కు. ఇన్ని ప్రసాదించే విద్యామాతకు అక్షరాంజలి. ★



డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి
సీనియర్ జర్నలిస్ట్

# ఆధునిక సాహిత్య

**నాటక రచయితగా, అధిక్షేపాత్మక 'సాక్షి' వ్యాసాల కర్తగా ప్రముఖ నటులుగా, ఆధునిక సాహిత్య చరిత్రలో పానుగంటి లక్ష్మీనరసింహారావు చిరస్మరణీయులు. సంస్కరణా దృక్పథాన్ని సాహిత్యానికి అద్దిన తొలితరం తెలుగు సాహిత్యవేత్తలలో అగ్రగణ్యులు పానుగంటి. పాదుకా పట్టాభిషేకం, కంఠాభరణం వంటి ఎన్నో గొప్ప రచనలతో తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన కలం వారిది. సంప్రదాయ సాహిత్యంతో పాటు, వర్తమాన కాలాంశాలే ఇతివృత్తంగా రచనలు రావలసిన అవసరం గురించి నాటి రచయితలను హెచ్చరించిన ద్రష్ట పానుగంటి.**



పానుగంటి

పానుగంటి (ఫిబ్రవరి11,1865–జనవరి 1, 1940) రాజమండ్రి తాలూకా, సీతానగరంలో జన్మించారు. తండ్రి వేంకటరమణయ్య ప్రముఖ ఆయుర్వేద వైద్యులు. పానుగంటి రాజమండ్రి కళాశాల నుండి పట్టభద్రులయ్యారు. బీఏ ఇంగ్లీషు సాహిత్యంలో ప్రతిష్ఠాత్మకమైన మెట్కాఫ్ స్వర్ణపతకాన్ని పొందిన ప్రతిభావంతులు. విద్యార్థి దశలోనే షేక్స్పియర్ నాటకాల్లో పాత్రలు ధరించి ప్రేక్షకుల మెప్పుపొందారు. వీరేశలింగంగారి 'శకుంతల' అనువాద నాటక ప్రదర్శన బాధ్యత చేపట్టి ఎన్నో ప్రదర్శనలు నిర్వహించారు.

ప్రసిద్ధనటులు, నాటకరంగ దర్శకులు కూచి నరసింహం దగ్గర నటనా, దర్శకత్వ నైపుణ్యాలను గ్రహించి కొన్ని నాటకాలకు దర్శకత్వం వహించి మెప్పు పొందారు. ఆయన కొంతకాలం పెద్దాపురం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ వృత్తి నిర్వహించారు. కొంతకాలం కొత్తపల్లి జగ్గారాయనింగారి పిల్లలకు పాఠాలు చెప్పారు. తర్వాత లక్ష్మీనరసాపురం ఎస్టేట్ జమీందారిణి చెల్లయ్యమ్మారావు దగ్గర 'దివాను' ఉద్యోగంలో చేరారు. 1905లో రావు కుమార మహీపతి సూర్యారావు బహుద్దూర్ పిఠాపురం వచ్చినప్పటి నుండి ఆయన దగ్గరే ఉన్నారు.

పానుగంటి వారు 1902లో చెల్లయ్యమ్మారావు ఎస్టేట్‌లో దివానుగా ఉన్నప్పుడు రాసిన 'నర్మదా పురుకుత్సీయం' నాటకాన్ని అప్పుడే ప్రదర్శించారు. సూర్యారావు బహద్దూర్ వివాహ మహోత్సవ సమయంలో 'కోకిల' అనే నాటకాన్ని రాసి ప్రదర్శించారు. 'విజయరాఘవం' నాటకాన్ని ఆయన పట్టాభిషేక సమయంలో రాసి ప్రదర్శించారు. పానుగంటి దాదాపు 30 నాటకాలు రాసినా, వాటిలో 26 మాత్రమే ప్రచురణకు నోచుకున్నాయి. పానుగంటి వారి నాటకాలను పరిశీలిద్దాం.

ఆయన తొలినాటకం 'నర్మదా పురుకుత్సీయం'. 1902లో రాసి పానుగంటి తాను దివానుగా వ్యవహరిస్తున్న జమీందారిణి చెల్లయ్యమ్మారావుకి అంకితమిచ్చాడు. ఈ నాటకంలో ఆయన పద్య శైలిని గూర్చి చెప్పుకున్నారు.

**"ఒక్కచో తేనెలొలికించు నొక్క చక్క<br>చక్కెర ముక్కలనుంచు నొక్క ప్రక్క<br>నాణిమగు సుధల జిలికించు, నవ్య భవ్య<br>కావ్య రచనలనీ మహాకవివరుండు"**

తన రచనలు తేనె చక్కెరలు కలసిన మాధురీ భరితమైన అమృతాలని చెప్పుకున్నాడు. 'నర్మదా పురుకుత్సీయం'లో ఇతివృత్తం స్వర్గ, మర్త్య, పాతాళాల మధ్య జరిగినట్లు రచయిత చిత్రించారు. ఈ నాటకం సన్నివేశ చిత్రణలో పానుగంటి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. భవిష్యత్తులో ఆయన రాసిన నాటకాలన్నింటికీ ఈ నాటకమే మార్గదర్శకత్వం వహించిందని విమర్శకుల అభిప్రాయం.

రాజరాజనరేంద్రుని జీవిత ఘట్టంగా చెప్పుకునే ఒక ఇతివృత్తంతో పానుగంటి 1904లో 'సారంగధర' నాటకాన్ని రాశారు. ఈ నాటకాన్ని కూడా జమీందారిణి చెల్లయ్యమ్మారావుకే అంకితమిచ్చారు. ఇందులో రాజరాజనరేంద్రుడు, సారంగధరుడు ముఖ్య పాత్రలు. రాజరాజనరేంద్రుని భార్య చిత్రాంగి. యౌవనవతి. ఆమె మేడపై సారంగధరుని పావురం వాలింది. స్నేహితుడు సుబుద్ధి అక్కడకు వెళ్లొద్దని సారంగధరుని వారించినా, అతడు చిత్రాంగి మేడపైకి వెళ్లాడు. చిత్రాంగి సారంగధరునిపై వలపును ప్రకటించగా, అతడు తిరస్కరించాడు. చిత్రాంగి కోపంతో సారంగధరుడు తనను బలాత్కరించాడని చెప్పిన మాటలు విని రాజు సారంగధరుడికి మరణశిక్ష విధించాడు. చివరలో రాజు పశ్చాత్తప్త చిత్తుడై, రాజ్యాన్ని వీడి అరణ్యాలకు వెళ్లాడు. కానీ, మీననాథుడి ఔషధ ప్రభావంతో కుమారుడు పునర్జీవితుడైన విషయం తెలిసి రాజు తన కుమారుడు సారంగధరుని కలుసుకుంటాడు. చిత్రాంగిని క్షమించటంతో నాటకం సుఖాంతమవుతుంది. పానుగంటివారు ఇందులో అంతర్నాటకాన్ని ప్రవేశపెట్టడం ఔచిత్యంగా ఉంది. ఈ నాటకం బహుళ ప్రజాదరణ పొందినందున ఆయన నాటకాలన్నింటిలో అంతర్నాటకం ప్రక్రియను ప్రవేశపెట్టారు.

పానుగంటివారు 1909లో రాసి ప్రచురించిన మూడోనాటకం 'ప్రచండ చాణక్యం.' చంద్రగుప్త మౌర్యుడు, అతడి గురువు చాణక్యుని ఘట్టాలతో నిండి ఉండే ఈ నాటకం కూడా విశేష ప్రజాదరణ పొందింది. ఈ నాటకంపై కూడా విమర్శలు విరివిగా వచ్చాయి. ఇది విశాఖదత్తుడు రాసిన 'ముద్రారాక్షసం' నాటకానికి పూర్వగాథ. ఔచిత్యం దృష్టితో

# దృష్టికి 'సాక్షి'



డా॥పి.వి.సుబ్బారావు
9849177594,
విశ్రాంత అధ్యాపకుడు

పానుగంటివారు ఈ నాటకంలో చాలా మార్పులు చేశారు. మార్పులు చేయవలసిన అవసరాన్ని వివరిస్తూ, "ఇందులో కొన్ని అమానుష కృత్యాలు న్నందున వర్తమాన కాలానికి రుచించవని భావించి కొత్త మార్గంగా ఈ నాటిక కథను కల్పించవలసి వచ్చిందని" చెప్పారు. ఇందులో చారిత్రక ప్రసిద్ధమైన చాణక్య పాత్ర రాక్షసమంత్రి పాత్రల లక్షణాలలో కొంత మార్పు చేశారు.

పానుగంటి వారు 1909లో రాసిన నాటకం 'రాధాకృష్ణ'. ఈ నాటకం ఆయన నాటకాలన్నింటిలోకి ఉత్తమ మైనదిగా విశేష ఖ్యాతి పొందింది. ఆయనకు కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిపెట్టిన ఈ నాటకంలో మధుర భక్తి, రచనా శిల్పం ముఖ్యమైనవి. ఇందులో రాధ పాత్రను చిత్రించటంలో పానుగంటివారు చూపిన సంయమనం, నిక్షేపించిన ఆధ్యాత్మికత, అంతరంగపు లోతులు ప్రేక్షకులకు అనుభవానికి వస్తాయి.

"నేనే రాధను, పూర్వజన్మముల రాధను, వర్తమానమున రాధను, భవిష్యజ్జన్మలో రాధను, పునః సృష్టిలో రాధను, నా పతి. శ్రీకృష్ణుడు" అంటూ పారవశ్యంలో ఉన్న రాధను పానుగంటివారు ప్రేక్షకులకు చూపి వారిని ధన్యులను చేశారు. పానుగంటివారు వాల్మీకి రామాయణ గాథల ఆధారంగా నాలుగు నాటకాలు రాశారు. అవి–

1. పట్టభంగ రాఘవం 2. విజయ రాఘవం
3. వనవాస రాఘవం 4. కల్యాణ రాఘవం

ఇవి ఆయన రామభక్తికి నిదర్శనాలుగా నిలిచిన రచనలు. తెలుగు పౌరాణిక నాటకరంగంలో ఇదొక అరుదైన విశేషం. ఈ నాటకాల్లో సంభాషణా చాతుర్యం, పాత్ర పోషణ, నాటకీయత ఒకదానితో ఒకటి పోటీ పడి నాటకాలను రక్తి కట్టించాయి. ఈ నాలుగు నాటకాల్లో మూడింటిని 1809లో రచించారాయన. నాలుగో నాటకాన్ని 1915లో రాశారు. ఈ నాటకాల మధ్యకాలంలో 1909 నుండి 1915 మధ్య 'కోకిల', 'విప్రనారాయణ', 'బుద్ధ బోధసుధ' వంటి నాటకాలు రచించారు.

పానుగంటివారి నాటకాల్లో 'కంఠాభరణం' హాస్యరసస్ఫోరకమైన ప్రసిద్ధ నాటకం. పిఠాపురాస్థాన ప్రభువైన శ్రీ రాజా వేంకటకుమార మహీపతి సూర్యారావు బహద్దూర్ 'మిగుల నవ్వువచ్చు నాటకమేదైనా రచింపుమని' కోరడంతో 'కంఠా భరణం 'నాటకాన్ని ఐదు వారాల్లో (03-04-1917 లో ప్రారంభించి 10-05-1917వరకు) రచించినట్లు పానుగంటి పీఠికలో చెప్పారు. ఈ నాటకం పలు ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించి పానుగంటివారికి విశేషమైన ఖ్యాతిని ఆర్జించి పెట్టింది. పానుగంటివారు సంస్కరణా దృక్పథంతో 'విచిత్రవివాహం' అనే హాస్య రూపకంలో బాల్య వివాహాలను అధిక్షేపించారు.

ఆయన నాటకాల్లో చారిత్రక, పౌరాణిక, సాంఘిక ఇతివృత్త వైవిధ్యాలున్నాయి. వీటిలో భక్తి, వీర, అద్భుత, హాస్యరస ప్రధానాలున్నాయి. ఆయన నాటకాలపై పాశ్చాత్య నాటిక ప్రభావం ప్రగాఢంగా ఉంది.

పానుగంటివారి దృష్టి కథారచనపై కంటే నాటకాలపైన, వ్యాసాలపైనే అధికం. అప్పట్లో రచయితలు పద్య కావ్యాలు రచించినంత శ్రద్ధగా గద్యం కావ్యాలు రచించటంలేదని ఆయన బాధ పడేవారు. రచయితలకు గద్య రచనలపై గౌరవం లేదని అదిక్షేపించారు కూడా. నాగరిక దేశా

**పానుగంటి అంటేనే సాక్షి వ్యాసాలు గుర్తుకు వస్తాయి. తెలుగు సాహిత్యంలో వీటికి ఉన్న ఖ్యాతి, స్థానం కూడా ఉత్తమోత్తమమైనదే. సాక్షి మొదటి సంపుటిలో 31 వ్యాసాలున్నాయి. రెండో సంపుటిలో 29 వ్యాసాలున్నాయి. సాక్షి సంఘంలో ఐదుగురు సభ్యులున్నారు. వారు సాక్షి, జంఘాల శాస్త్రి, కాలాచార్యుడు, వాణీదాసుడు, బొఱ్ఱయ్యశెట్టి. సత్యపురం తపాలా కచేరీకి ఎదురుగా ఉన్న అద్దె ఇంట్లో ప్రతి రాత్రి సమావేశం కావాలని వారి నిర్ణయం.**

లన్నింటిలో వచన ప్రబంధాలు లక్షోపలక్షలుగా వెలువడుతుంటే మన దేశంలో అవి రాకపోవటం శోచనీయమని ఆనాడే పానుగంటి వాపోయారు.

పాత తూర్పుగోదావరి జిల్లాలోని పిఠాపురం సంస్థానంలోనే 1922లో ఆంధ్ర సాహిత్య పరిషత్ సభలు జరిగాయి. వాటికి పానుగంటివారు అధ్యక్షత వహించారు. అప్పుడు ఇచ్చిన అధ్యక్షోపన్యాసం చిరస్మరణీయమైంది. ఆయన 1911 నుండి 1914 వరకు సువర్ణలేఖ పత్రికలోనే సాక్షి వ్యాసాలు, వచన ప్రహసనాలు, చిన్నకథలు వంటి వాటిని ప్రచురించారు. వాటిలో సాక్షి వ్యాసాలు హాస్య అధిక్షేపాత్మకాలు. వాటిని రెండు సంపుటాలుగా ప్రచురించారు. వాటిపై ఆంగ్ల రచయితలు ఎడిసన్, స్పెక్టేటర్ వంటి వారి ప్రభావం ఉంది. 'సువర్ణలేఖ'లో, 'భారతి'లో వచ్చిన చాలా కథలను 'కథావల్లరి' పేరుతో కథా సంపుటిగా ప్రచురించారు.

పానుగంటి అంటేనే సాక్షి వ్యాసాలు గుర్తుకు వస్తాయి. తెలుగు సాహిత్యంలో వీటికి ఉన్న ఖ్యాతి, స్థానం కూడా ఉత్తమోత్తమమైనదే. సాక్షి మొదటి సంపుటిలో 31 వ్యాసాలున్నాయి. రెండో సంపుటిలో 29 వ్యాసాలున్నాయి. సాక్షి సంఘంలో ఐదుగురు సభ్యులున్నారు. వారు సాక్షి, జంఘాల శాస్త్రి, కాలాచార్యుడు, వాణీదాసుడు, బొఱ్ఱయ్యశెట్టి. సత్యపురం తపాలా కచేరీకి ఎదురుగా ఉన్న అద్దె ఇంట్లో ప్రతి రాత్రి సమావేశం కావాలని వారి నిర్ణయం. వారు రాగానే అందరూ చక్రవర్తిగారికీ, వారి కుటుంబానికీ, ఆయురారోగ్య ఐశ్వర్యాలిమ్మని భగవంతుని ప్రార్థించాలి. రాజకీయ విషయాలు చర్చించ కూడదు. తప్పులనుగాని, ఆ తప్పులకులోనైన వ్యక్తుల గురించిగాని నిందించకూడదు. వాదాలతో కలహాలు రాకూడదు అనే నియమాలను సాక్షి సంఘం ఏర్పాటు చేసుకుంది.

సాక్షి వ్యాసాలు ఆనాటి సాంఘిక స్థితికి అద్దం పట్టాయి. వక్రతలను తీవ్ర స్థాయిలో ఆక్షేపించాయి. సంఘంలో స్త్రీల స్థానం, వారి హక్కులు, వారి విద్యా సాంస్కృతికాభివృద్ధి మొదలైన అంశాలతోపాటు స్త్రీల పాశ్చాత్య వ్యామోహాన్ని నిశితంగా విమర్శించారు. పానుగంటివారి ప్రకీర్ణోపన్యాసాల్లో 'గ్రామ్యవాద ఖండనకొక విన్నపం' వంటివేకాక, 'స్వప్నకావ్యం' అనే ఏకాశ్వాస కావ్యం కూడా ఉంది. విమర్శాదర్శ, విమర్శాధర్మం వంటి చిన్న పుస్తకాలు ప్రచురించారు. ప్రకీర్ణోపన్యాసాల్లో సాహిత్య ధోరణులపై విమర్శ ఉంది. పానుగంటివారి సాక్షి ఉపన్యాసాలు విన్న వారికి తమరే మాట్లాడుతున్నట్లనిపించే విశిష్టత ఉంది. జంఘాలశాస్త్రి ఉపన్యాసాలు ఆవేశపూరితంగా సాగుతాయి. చమత్కార స్ఫోరకాలుగా శ్రోతలను ఆకర్షిస్తాయి. తెలుగు భాషకు పట్టిన దుర్గతి, వినాయక చవితి నిమజ్జనాలలో జరిగే అనవసరపు తంతు, ఇంకా అనేక సంఘ సంస్కరణకు సంబంధించి తీవ్రమైన వ్యంగ్యపూరిత అక్షర దాడి సాక్షి వ్యాసాలలో కనిపిస్తుంది.

పానుగంటివారిపై పాశ్చాత్యరచయితలైన 'చార్లెస్ డికెన్స్' ఎడిసన్, స్విఫ్ట్ వంటి వారి ప్రభావం ప్రగాఢంగా ఉంది. వారి ప్రభావంతో హాస్య రచనలు చేసి ఆధునిక సాహిత్యచరిత్రలో హాస్యవాఙ్మయ నిర్మాతగా ప్రసిద్ధికెక్కారు. నాటక రచయితగా, వ్యాస కర్తగా పానుగంటివారు చిరస్మరణీయులు. ★

**ప్రజలను, విస్తృతార్థంలో ఓటర్లని తాయిలాలతో తమ పార్టీ వైపు ఆకర్షించుకునే సంస్కృతి నానాటికీ పెరుగుతున్నదే తప్ప తరగడం లేదు. దేశం ఆర్థికవృద్ధిని సాధిస్తూ, దారిద్ర్యాన్ని తగ్గించుకుంటూ ముందుకు పోతున్నా, ప్రజలలోని ఆశ కొండొకచో దురాశలను ప్రేరేపిస్తూ తాయిలాలు వీర విహారం చేస్తున్నాయి. ఎన్నికలనగానే ప్రతి రాజకీయ పార్టీ తమ మానిఫెస్టోలో ఉచితంగా అది ఇస్తాం... ఇది ఇస్తాం అంటూ ఒక భారీ చిట్టాను ప్రకటిస్తుంది. కష్టించి పని చేయడం వల్లనే దేశమూ, వ్యక్తిగతంగా ప్రజలు అభివృద్ధి సాధిస్తారనే విషయాన్ని చెప్పకుండా ఎన్నికల సందర్భంగా భారీ భారీ వాగ్దానాలు అనేక పార్టీలు చేస్తున్నాయి.  ఇటువంటి పార్టీలు ఆ రాష్ట్ర లేదా దేశ ఆర్థిక పరిస్థితిని పట్టించుకోకుండానే హామీలిస్తుంటే, ఇంత డబ్బు వారి దగ్గరకు ఎలా వస్తుందనే విషయాన్ని ప్రజలు కూడా బుర్ర పెట్టి ఆలోచించకపోవడంతో ఆరోగ్యంగా ఉన్న కొన్ని రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలు కూడా చతికిలపడుతున్నాయి. అందుకు ఢిల్లీ వంటి ప్రాంతాలు మనకు సజీవ ఉదాహరణలుగా నిలుస్తాయి. కర్ణాటకలో హామీలు గుప్పించిన కాంగ్రెస్ గెలిచిన తర్వాత తమ హామీలకు, వాటి అమలుకు షరతులు వర్తిస్తాయి అన్న రీతిలో వ్యవహరించింది. అవసరమైన నిధుల సేకరణ ఎంత గడ్డుగా ఉన్నదో గ్రహించి, బోలెడన్ని షరతులతో  తామిచ్చిన హామీలను కొద్దిమందికి మాత్రమే అమలుచేస్తున్న విషయం మనందరికీ తెలిసిందే. ఎన్నికల కమిషన్ తెలంగాణ సహా పలు రాష్ట్రాలకు ఎన్నికల తేదీలను ప్రకటించిన నేపథ్యంలో ఈ ఉచితాల గురించి చర్చించుకోవడం సహేతుకమే.**

# ఆర్థిక వ్యవస్థకు

***ఉద్యమే నహి సిద్ధ్యంతి కార్యాని న మనోరథైః***
***నహి సింహస్య సుప్తస్య ప్రవిశాంతి ముఖే మృగాః***

అంటే, పని, కార్యం, శ్రమ, ప్రయత్నం అనేవన్నీ కూడా మన తెగువ, సాహసం, ప్రయత్నాల కారణంగానే విజయవంతం అవుతాయి తప్ప మన కోరికల ద్వారా కాదు. అలాగే, ఒక జింక లేదా ఎర అనేది నిద్రిస్తున్న సింహం నోట్లోకి తమంత తాముగా ప్రవేశించదు అని అర్థం.

ఈ శ్లోకం మోసాలు, వంచనలు లేని సత్యయుగానికి చెందినది. ప్రస్తుత కలియుగంలో, మనకు ఉచిత భోజనాలు ఉండవు. కనుక ఈ శ్లోకాన్ని కాస్త విస్తరించి, నిద్రిస్తున్న సింహం నోట్లోకి వేట ప్రవేశిస్తే, ఆ నిద్రిస్తున్న సింహం తనను మేపుతున్నవారికి ఎర అవుతుందని చెప్పవచ్చు.

సరళంగా చెప్పాలంటే, వల పన్నుతున్నప్పుడు, ఆటస్థలాన్ని, వేదికను ఏర్పాటు చేస్తున్నప్పుడు దాని వెనుక ఉద్దేశం స్పష్టం– ఓటు హక్కు కలిగిన వేటగాడినే వేటాడేందుకు రంగం సిద్ధమవుతోందన్న మాట.

**సనాతన వర్సెస్ కుటుంబ పార్టీ నేత**

రాజకీయాలు అపరిమిత అధికారాన్ని అందిస్తాయి కనుక రాజకీయాలకు హద్దులు తెలియవు. ప్రజలు ఇష్టపూర్వకంగా లేదా అనిష్టంగా, బలవంతంగా లేదా బుజ్జగింపులతో, భయంతో లేక ఆత్మీయతతో ఈ అధికారాన్ని రాజకీయ నాయకులకు అప్పచెప్తుంటారు. దురదృష్టకరమైన విషయం ఏమిటంటే, ప్రజాస్వామిక వ్యవస్థ అన్నది ఫలితంపై మాత్రమే దృష్టి పెడుతుంది తప్ప అధికారాన్ని కైవసం చేసుకునేందుకు అవి చేసే ఉల్లంఘనలు, ఖండనలు లేక ఛిద్రం అయ్యే ప్రక్రియలపై దృష్టి ఉంచదు. అధికారాన్ని చేజిక్కించుకోవడంలో ఉపయోగించే ఈ రాజకీయ పరికరాలను, ప్రధానంగా మూడు ఫార్మాట్లుగా విభజించవచ్చు. సనాతన ధర్మ విలువలతో పాలించినవారు సుపరిపాలనను అందిస్తూ కొనసాగారు.




**నిస్వార్థ నాయకులు**

రాష్ట్రాన్ని బలోపేతం చేయడం అన్న ఏకైక అంశంపై దృష్టితో అత్యున్నత ధర్మంతో రాష్ట్ర సామాజిక, ఆర్థిక, మానసిక, భౌతిక పురోగతికి, అభివృద్ధికి కృషి చేస్తారు. ఈ నేపథ్యంలో ఆ దేశ లేక రాష్ట్ర జనాభా వారే మళ్లీ మళ్లీ ఎన్నిక కావాలని కోరుకుంటుంది. ఎందుకంటే, అటువంటివారు తమ కుటుంబ ప్రయోజనాన్ని పక్కన పెట్టి ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తుంటారు. నాణేనికి మరొకవైపు, పొగరుమోతు, ఫ్యూడల్, బంధుప్రీతి, కుటుంబమే కేంద్రంగా ఉండే రాజకీయ నాయకులు అధికారాన్ని కైవసం చేసుకొని, పాలనను నిర్వహించడం అన్న ఫార్ములాపైనే దృష్టి పెడతారు.

**హిమాచల్ కథ**

కఠినమైన పరిశ్రమ, ఆధ్యాత్మిక దృష్టి, సాంస్కృతికంగా పురోగమనవాదులైన ప్రజలున్న రాష్ట్రం ఉత్తర భారతదేశంలోని హిమాచల్ ప్రదేశ్. ఏళ్ల దుష్పరిపాలన అనంతరం 2017లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అధికారాన్ని చేజిక్కనివ్వలేదు. నూతనంగా అధికారంలోకి వచ్చిన బీజేపీ, రైల్వే లైన్ల నిర్మాణం, రాష్ట్రాన్ని దేశంలోని ఇతర ప్రాంతాలకు అనుసంధానం చేయడం, హైడ్రో ఇంజినీరింగ్ కాలేజీలు సహా ప్రముఖ విద్యాసంస్థలు, రహదారులు, వంతెనలు, హైవేలను నిర్మించింది.

కానీ, 2022లో అధికారాన్ని చేజిక్కించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజలను అనేక రకాలుగా




# తాయిలాల తంటా

ఎరలతో ప్రలోభాలకు గురి చేసింది -

- రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ 300 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, 18-60 ఏళ్ల మధ్య వయసు గల ప్రతి మహిళకు రూ. 1,500 పింఛను
- ఆవు పేడను కిలో 2 రూపాయల చొప్పున కొనుగోలు, పదవీ విరమణ చేసిన ప్రభుత్వోద్యోగులను ప్రలోభ పెట్టేందుకు రాష్ట్ర కోశాగారంపై భారం వేస్తూ పాత పింఛను పథకం అమలు వంటి హామీలు ఇచ్చింది.

ఈ ఉచితాల కారణంగా 2022లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఎటు పోతున్నదో ఎవరికీ అర్థం కావడం లేదు. 2017లో బీజేపీ అధికారాన్ని చేపట్టినప్పుడు వృద్ధి, ఆర్థిక క్రమశిక్షణను ప్రభుత్వంలో ప్రవేశ పెట్టింది. 2018- 2022 ఆర్థిక సంవత్సరాలు మధ్య రాష్ట్ర జీడీపీ ఏడాదికి 7.3 శాతం చొప్పున పెరగడంతో ఆర్థిక లోటును 3 శాతానికి మించ కుండా నిర్వహించారు.

2022లో ఎన్నికలు జరిగిన తర్వాత కాంగ్రెస్ బాధ్యతలు తీసుకుని, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి లాగేసింది. ఒకవైపు రాష్ట్రంలో అప్పుకు వడ్డీ కట్టేందుకు డబ్బు లేకపోయినా, ఈ ఉచితాల రాజకీయాలు కొనసాగాయి.

ఇప్పుడు హిమాచల్ ఆర్థిక లోటు 6.5 శాతానికి చేరింది. అంటే రాష్ట్ర ప్రభుత్వం రూ. 75,000 కోట్ల అప్పుల్లో ఉండగా, ఈ ఉచితాలు రాష్ట్రంపై ఒత్తిడిని పెంచాయి. దీనితో జీతాలు, ఫించన్లు ఇచ్చేందుకు డబ్బు లేదు.

కర్ణాటకలోనూ ఇదే కథ పునరావృత్తం అయింది. ఎన్నికలలో అధికారాన్ని చేజిక్కించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన తాయిలాలకు తెలిసి తెలిసీ కర్ణాటక ప్రజలు పడిపోయి, భారీ మెజారిటీతో ఆ పార్టీని గెలిపించారు.

**కుటుంబ యజమానురాలికి నెలకు రూ. 2వేలు**

అన్ని కుటుంబాలకు 200 యూనిట్ల విద్యుత్తు గ్రాడ్యుయేట్ అయిన యువతకు నెలకు రూ. 3000, డిప్లొమా ఉన్నవారికి రూ. 1500, ఒక వ్యక్తికి నెలకు 10 కిలోల చొప్పున బియ్యం, మహిళలకు బస్సులలో ఉచిత రవాణా.

ఈ ఉచితాలన్నింటినీ అమలు చేయాలంటే ఏడాదికి రూ. 65,082 కోట్ల రూపాయలు అవసర మవుతాయని పలువురు విశ్లేషకులు అంచనా వేశారు. ఇవి ఇప్పుడు రాష్ట్ర బడ్జెట్‌లో 20 శాతంగా ఉన్నాయి. వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఈ ఉచితాలను ఇవ్వడం ఆపకూడదని కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుని, ఆ రాష్ట్ర ప్రజల కొంపలు కూల్చబోతోంది.

**తెలంగాణ కథనం**

2014లో రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి టిఆర్ఎస్ లేదా భారత రాష్ట్ర సమితి రాష్ట్రాన్ని పాలిస్తోంది. ఈ రాష్ట్ర ఏర్పాటు కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వమే కారణం అయినప్పటికీ, తెలంగాణ రాజకీయాలపై ఆ పార్టీ ముద్ర వేయలేకపోయింది. నెలరోజుల్లో చోటు చేసుకోనున్న ఎన్నికల్లో టి(బీ)ఆర్ఎస్ ఓటు బ్యాంకును తమ వైపుకు తిప్పుకునేందుకు కాంగ్రెస్ పార్టీ బీభత్సమైన తాయిలాల జాబితాను రూపొందించింది.

**కాంగ్రెస్ వాగ్దానాలు**

- తెలంగాణలోని మహిళలకు నెలకు రూ. 2,500 ఆర్థిక సాయం
- రూ. 500 కే గ్యాస్ సిలండర్
- టిఎస్ఆర్టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం
- కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు
- ఇల్లు లేని కుటుంబాలకు ఇంటి స్థలం, రూ. 5 లక్షల నగదు

ఈ జాబితాకు అంతం లేదన్నట్టుగా కొనసాగు తుంది. అయితే, ఇందులో చెప్పుకోవలసిన ముఖ్య మైన హామీ రాష్ట్రం కోసం పోరాడిన కార్యకర్తలకు ఉద్దేశించింది. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ విడిపోయేందుకు పోరాడిన కార్యకర్తలకు ఇల్లు కట్టుకునేందుకు 250 చదరపు గజాల స్థలం ఇస్తామంటూ చేసిన హామీ. చిత్రమైన విషయం ఏమిటంటే, 1960 దశకం చివర్లోను, 70ల మొదట్లోనూ వచ్చిన ఈ ఉద్యమాన్ని వారి ఆదర్శ నేత ఇందిరాగాంధీ అణిచివేసిన విషయాన్ని వారు విస్మరించి, ఇప్పుడు వారికే కానుకలు ఇస్తున్నారు. ఇదంతా కేవలం బీఆర్ఎస్ పార్టీ నుంచి అధికారాన్ని లాక్కునేందుకే.

ఏమైనా, రాజకీయ పార్టీలు - అవి ప్రాంతీయ మైనా, జాతీయమైనవి అయినా ఇటువంటి తాయిలాలతో ఓటర్లను ఆకర్షించి, రాష్ట్రాన్నే ఆర్థిక విధ్వంసం దిశగా తీసుకువెడితే అంతిమంగా నష్టపోయేది ప్రజలు మాత్రమే. ప్రజలు అత్యాశకు పోయి, తమపై భారం పడదనుకుని, ఇటువంటి ఉచితాలకు, ప్రలోభాలకు లొంగితే, రేపు ఏదో ఒక రూపంలో వారు కూడా మూల్యం చెల్లించుకోవలసి ఉంటుంది...ఆర్థికభారాన్ని మోయవలసి వస్తుందనే విషయాన్ని గుర్తించాలి.

'ఆర్గనైజర్' నుంచి

ఈ ఉచితాల కారణంగా, 2022లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఎటు పోతున్నదో ఎవరికీ అర్థం కావడం లేదు. 2017లో బీజేపీ అధికారాన్ని చేపట్టినప్పుడు వృద్ధి, ఆర్థిక క్రమశిక్షణను ప్రభుత్వంలో ప్రవేశపెట్టింది. ఆర్థిక సంవత్సరాలు 2018- 2022 మధ్య రాష్ట్ర జీడీపీ ఏడాదికి 7.3 శాతం చొప్పున పెరగడంతో ఆర్థిక లోటును 3 శాతానికి మించ కుండా నిర్వహించారు.

కథానిక

బాలభానుని అరుణ కాంతుల్లో కన్యాకుబ్జం మిలమిల మెరసిపోతున్నది. కోట దగ్గరి నుంచీ పట్టణం పొలిమేర వరకూ వీధుల పొడుగునా చలువ పందిళ్లు అమర్చబడుతున్నాయి. పట్టు పావడా కుచ్చెళ్లు నేలపై జీరాడుతుండగా బాలికలు వీధుల్లో ముత్యాల రంగవల్లికల్ని తీరుస్తున్నారు. శుభ ముహూర్తానికి ఇంకా రెండు రోజులు వ్యవధి ఉన్నప్పటికీ, కోటలో అప్పుడే మంగళకరమైన సన్నాయిమేళం సన్నసన్నగా ప్రారంభమై ఉన్నత స్థాయినందుకుంటున్నది. అంతఃపురంలో అటూ, ఇటూ సంభ్రమంగా తిరుగుతూ, పరిచారికలు పెళ్లి కూతురికి కావలసిన అలంకరణ ద్రవ్యాలనన్నింటినీ సర్దుకుంటున్నారు.

రాజప్రాసాదానికి దాపున వున్న ప్రమదావనంలో స్వయంవర మండప నిర్మాణం పూర్తి కావస్తోంది. పైపై నగిషీ పనుల్లో లీనమై వున్న శిల్పుల ముఖారవిందాలు, మండపం అంతా అతిలోక సుందరంగా తయారైనందు చేతనేమో ప్రఫుల్లితాలై, సంతృప్తిని ఒలకబోస్తున్నాయి.

ఆ ఆరామానికి చివరగా వున్న పర్ణకుటీరం ముంగిట ఒక వృద్ధ శిల్పి ఒంటరిగా తన కర్తవ్యంలో నిమగ్నుడై వున్నాడు. అతని చేతులు యంత్రపు మరల్లా వడిగా పనిచేస్తున్నాయి. మరికొన్ని గడియల్లో పూర్తి కావడానికి సిద్ధంగా వున్న ఒక పురుష విగ్రహం పాదాలను అతడు మలచుకుంటున్నాడు.

అది పృథ్వీరాజు ప్రతిమ।

అసూయకన్నా దుష్టమైన కాలాహి ప్రపంచంలో వేరొకటి లేదన్న పెద్దల యొక్క మాట పొల్లు కాదు. జయచంద్రుడు పృథ్వీరాజుపైన అకారణ ద్వేషం వహించాడు. అంతటితో ఊరుకోలేదు. ప్రతీకార వాంఛ అతని శరీరంలోని ప్రతి అణువునా పెల్లుబికింది. ముఖాముఖిగా ఢిల్లీశ్వరుణ్ణి ఎదుర్కొని పోరాడే సాహసం అతనికి లేదు. అందుచేత అతడు మరొక ఉపాయం వెదకవలసి వచ్చింది. తన కుమార్తెకు స్వయంవరమని ఛప్పన్న దేశాలలో చాటించాడు. అన్ని దేశాలకూ ఆహ్వానాలు పంపాడు, ఒక్క ఢిల్లీకి తప్ప! అది నిజంగా పృథ్వీ రాజుకు అవమానకరమైన విషయమే. అయితే లక్ష అవమానాలతో అతణ్ణి క్రుంగింప తలచిన జయచంద్రుడు అంతటితోనైనా ఊరుకోలేక పోయాడు. “పృథ్వీరాజు విగ్రహాన్ని స్వయంవర మండపం వాకిట నిలబెట్టిస్తాను. అతడు నా వాకిట కావలి బంటు!” అంటూ అతడు వికటాట్టహాసం చేశాడు.

కానీ జయచంద్రునికి, తనెవడినైతే వాకిణి కావలిబంటుగా పరిగణిస్తున్నాడో, అతడే తన కుమార్తె హృదయాన్ని దోచుకున్న వీరపురుషుడని తెలియదు!

చెంపలపై నుంచీ క్రిందికి దిగజారుతున్న స్వేద బిందువుల్ని తుడుచుకుంటూ శిల్పి పైకి లేచాడు. శిల్పం పూర్తైపోయింది. దర్పాన్ని,ఠీవిని వెలార్చుతున్న ఆ విగ్రహాన్ని చూచి శిల్పి తన శిల్పకళా ప్రావీణ్యానికి తానే విస్తుపోయాడు. అయినా అతని మనసులో ఏదో ఒక చింత ఉండి ప్రజ్వరిల్లుతూ వుంది. “వీరపూజ చేయడమొక పవిత్ర సంప్రదాయంగా పరిగణించే భారతదేశంలో, ఆ విగ్రహాన్ని ముందు తరాల వారు పూజించడానికి నిర్దేశించడం... వాకిటి కావలిబంటుగా... “పాపము శమించుగాక!” అనుకుంటూ శిల్పి అక్కడ నుంచి వెళ్లిపోయాడు.

తరువాత కొంతసేపటికి యువరాణి కోటలో నుంచీ బయటికి వస్తున్నందుకు చిహ్నంగా కోట బురుజులపై నుంచి నగారాలు ఒక్క పెట్టున నినదించాయి. అందలాలు బారులు బారులుగా వచ్చి ఉద్యానవనంలో ఆగినాయ్. ఒక చెలికత్తె తలుపు తెరువగా జరీదువ్వలువలతోనూ, సర్వాభరణాలతోనూ అలంకరించబడిన సర్వ మంగళ విగ్రహంలా, పుత్తడి బొమ్మ సంయుక్తాదేవి పల్లకీ నుంచి ఈవలికి వచ్చింది.

ఆమె రాజహంసలా మెల్లగా ఎక్కడికో నడవసాగింది. పరిచారకులు ఆమెను అనుసరించారు.

ప్రాణపతి అనుగ్రహం సంపాదించడం కోసం పువ్వుల్తో అతని ప్రతిమను పూజించడానికి వెళ్తున్న



పర్వతరాజ తనయలా వుండప్పుడు సంయుక్తా కుమారి.

చూపువేర దూరంలో కనులవిందుగా కనిపించింది జగదేగవీరుడైన పృథ్వీరాజు యొక్క మనోజ్ఞ స్వరూపం. ఆషాఢ మేఘాన్ని తిలకించి వివశమై పోయిన నెమిలి పడుచులా సంయుక్త ఆ విగ్రహం దగ్గరికి వెళ్లింది.

విగ్రహం దగ్గర ఏ స్వప్నలోకాల్లోనో విహరిస్తున్నట్టు అరమోడ్పు కన్నులతో కూచుని వున్న ఒక వ్యక్తి అడుగుల సవ్వడి విని లేచి నిలబడి సవినయంగా యువరాణికి అంజలి ఘటించాడు.

'ఎవరు నీవు?' అని ప్రశ్నించింది రాకుమారి.

"నేను శిల్పిని యువరాణీ!" అన్నాడతడు వంచిన తలను పైకెత్తకుండా,

"ఈ సుందర విగ్రహాన్ని తీర్చిదిద్దిన మహాశిల్పివి నువ్వేనా?"

"ఈ భృత్యుడింతకంటే సుందర శిల్పాల్ని తయారుచేయగలడు, యువరాణి!"

"కానీ ఇంతకంటే గంభీరమైన విగ్రహాన్ని నువ్వు సృజించలేవు" అన్నది యువరాణి. శిల్పి బదులు పలుకలేదు. శిల్ప సౌందర్యాన్ని ఆస్వాదిస్తున్న సంయుక్తా దేవిని అతడు చూడనట్లే చూస్తూ, అవశుడై వుండిపోయాడు. ఉన్నట్టుండి మళ్లీ యువరాణి ఒక ప్రశ్న వేసింది.

# కాముక

**మధురాంతకం రాజారాం**



"ఇంతటి మనోహరమైన ఆకృతిని నువ్వెలా చిత్రించగలిగావు శిల్పీ?"

శిల్పికేం చెప్పాలో తోచలేదు. యువరాణి తన ప్రశ్నకు తనే వ్యాఖ్యానం చెప్పబోయింది. "అంటే... అంటే..." యువతీ తన సహజమైన సిగ్గుతో ఆమె తనకు తోచిన భాగాన్ని చెప్పలేకపోయింది.

ఆమెకు ప్రశ్నకు అర్థమేమిటో శిల్పి ఆకళించుకుని "నేను అనేకమార్లు పృథ్వీరాజును చూచాను యువరాణి!" అన్నాడు.

"ఎప్పుడు?"

"కొన్ని రోజులు ఢిల్లీశ్వరుని కొలువు కూటంలో ఆస్థాన శిల్పిగా పనిచేశాను యువరాణీ!"

"అలాగా! అయితే అక్కడి నుంచీ ఎందుకు వచ్చేశావు?"

"కళాభిరుచిలేని నరేంద్రుల దగ్గర శిల్పుల బ్రతుకు సాగుతుందా యువరాణీ!"

"ఏమిటీ!"

"అవును యువరాణీ! ఒక్క కళాభిరుచేమిటి? ఏ సద్గుణ లేశమూ లేని పృథ్వీరాజును సేవించడం నాకిష్టం లేదు."

"నువ్వు పిచ్చివాడివి కావు గదా!"

"కాను....సత్యాన్ని చూచి చెబుతున్నాను. పృథ్వీరాజు ప్రపంచమనుకుం టున్నత మహావీరుడేం కాదు. నిజం చెప్పవలసి వస్తే అతడు భీరువు. దయా దాక్షిణ్యాలు ఏ కోశానా లేని కఠిన హృదయుడు. ప్రజా హృదయాన్ని అర్థం చేసుకోలేని అజ్ఞుడు. సద సద్వివేక శూన్యుడు కామాకుల..."

"అసత్య ప్రలాపీ! నీ మాటలు కర్ణకఠోరంగా వున్నాయి. ఇక మాట్లాడకు. వెళ్లు. ఈ ఉద్యాన వనం నుంచే కాదు, ఈ కన్యాకుబ్జ రాజ్యం నుంచే వెళ్లిపో" అని శాసించింది యువరాణి.

శిల్పి తలవంచుకుని వెళ్లిపోసాగాడు.

"విజయా! ఆ శిల్పిని ఆగమని చెప్పు. అతని ప్రవర్తన ఎలాంటిదైనప్పటికీ, అతని శిల్పకళా చాతుర్యం మాత్రం అనన్య సాధారణమైంది. ఈ కంకణాన్ని అతనికి పారితోషికంగా బహూకరించు" అని ఎడమ చేతి నుంచి నవరత్న ఖచితమైన సువర్ణ కంకణాన్ని తీసి విజయ చేతికిచ్చి సంయుక్తా కుమారి వడివడిగా అక్కడి నుంచీ నిష్క్రమించింది.

ఢిల్లీ కోట బురుజులపైన జయభేరి మ్రోగుతున్నది. రాజ ప్రాసాదాలన్నీ అసంఖ్యాక దీపరాజితో, దేవేంద్రుని వైజయంతంలా శోభిస్తున్నాయి. నగరవాసులు విజయోత్సవం చేసుకుంటున్నారు.

స్వయంపరాగతులైన రాజులనందర్నీ జయించి, సంయుక్తా ద్వితీయుడై పృథ్వీరాజు ఆ రోజు సాయంత్రమే ఢిల్లీ చేరుకున్నాడు.

అంతఃపురంలోని దేవీమందిరంలో సంయుక్త తొలిసారిగా తన ప్రాణేశ్వరునికి యిలవేల్పయిన మహిషాసురమర్దనిని పూజిస్తూ వున్నది. పూజించి దేవి చరణాలపైనున్న కుంకుమతో తిలకం తీర్చుకుని, తిరిగి చూచినది. దరహాస వదనుడైన పృథ్వీ రాజు కనుపించాడామెకు.

ఈ శుభ సమయాన నేను నీకొక చిన్న బహుమానాన్ని సమర్పించు కోవ చ్చునా, సంయుక్తా!" అన్నాడతడు.

ఆమె బదులు చెప్పకముందే పృథ్వీరాజు ఒక చిన్న సువర్ణ మంజూషను ముందుకు చాచాడు. సంయుక్త దాన్ని అందుకుని మూత తెరిచింది. తానా రోజున శిల్పికి బహూకరించిన బంగారు గాజు ప్రత్యక్షమైందామె కాపెట్టెలో

నివ్వెరపోయింది సంయుక్తాదేవి. రెండు క్షణాలు మ్రాన్పడిపోయి ఆ తరువాత "మీరు... మీరు..." అంటూ ఆమె ఆర్ధోక్తిలో ఆగిపోయింది.

"అవును సంయుక్తా! నేనే ఆ శిల్పిని" అన్నాడు పృథ్వీరాజు. శౌర్య స్వరూ పిణిగా అక్కడ వెలసి వున్న జగన్మాత కన్నుల్లో నుంచీ ఆ క్షణాన చల్లని వెన్నెల కాంతులు పెల్లుబికి లోకంపైకి ప్రసరించినాయ్.

**(20.8.1954 జాగృతి నుంచి)**


చెన్నకేశవ ఆలయం

# కన్నార్పనీయని కళా

**'శివాయ విష్ణురూపాయ, శివరూపాయ విష్ణవే' అన్న విధంగా దేవుడు ఒక్కడేనని వారిలో భేదభావాలు లేవని బేలూరులోని చెన్నకేశవస్వామి విష్ణు ఆలయం, దగ్గరలోని హళేబీడు ఈశ్వర శివాలయం చాటుతున్నాయి. వైష్ణవం, శైవం ఏకమనే సిద్ధాంతాన్ని చాటుతూ ఏకంసత్, విప్రా బహుధా వదంతి అనే సనాతన ధర్మ సిద్ధాంతానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.**

క్రీ.శ.12-13 శతాబ్దాల కాలంలో హొయసల వంశీకులు కర్ణాటక ప్రాంతాన్ని పాలించారు. బేలూరులోని అత్యంత ప్రసిద్ధమైన చెన్న కేశవాలయం అంతర్, బహిః ప్రాకారాలపై, ద్వారాలపై పైకప్పులు, స్తంభాలపై అత్యంత రమణీయంగా, కళాత్మకంగా చెక్కిన శిల్పాలు ఎన్నో కనిపిస్తాయి. చోళరాజులపై తన విజయానికి చిహ్నంగా విష్ణువర్ధన చక్రవర్తి ఈ ఆలయాన్ని నిర్మించాడని తెలుస్తున్నది. గర్భగుడిని నక్షత్రాకారంలో నిర్మించారు. ఇక్కడనున్న దైవం కేశవమూర్తిని, చెన్న కేశవుడని, విజయ నారాయణుడని కూడా వ్యవహరిస్తారు.

క్రీ.శ.1397లో రెండవ హరిహరుని కాలంలో ఏడంతస్తుల గోపుర ద్వారాన్ని నిర్మించారు. తర్వాత కాలంలో చెన్నకేశవ ఆలయం ప్రాంగణంలోనే, గర్భగుడికి వెనుకవైపున సౌమ్యనాయక మందిరం, ఆండాళ్ మందిరం, కల్యాణ మంటపం నిర్మించారు. ప్రవేశద్వారం ఎత్తు 65 అడుగులు. ఆలయంలో ప్రవేశించగానే మూడున్నర అడుగుల గరుడ విగ్రహం కనబడుతుంది. మందిర ముఖద్వారానికి ఇరువైపుల మనుషులపైకి దుముకుతున్నట్లున్న భయంకర మృగం కనిపిస్తుంది. 'హొయసల' అంటే మానవ రక్షణ కోసం భయంకర మృగాన్ని చంపడమని అర్థమట. ఇక్కడే మలచిన నరసింహస్వామి విగ్రహం కనిపిస్తుంది. ఇరువైపుల దశావతార చిత్రాలున్నాయి.

ఇలాంటివి ఈ ఆలయంలో 24 ఉన్నాయి. ఎడమచేతిలోని దర్పణంలో తన సౌందర్యాన్ని చూసుకుంటూ, కుడిచేతితో తన చీర మడతలను సరిచేసుకుంటున్న దర్పణసుందరి, కుడిప్రక్కన ఉన్న ఆమె చెలికత్తె కోతిని, ద్రాక్షవల్లను పట్టుకొని నిలుచుంది. వీటిని సహజత్వం ఉట్టి పడేలా ఎంతో రమణీయంగా చిత్రించారు. అందమైన అప్సరసలను వివిధ భంగిమల్లో రంగవంచమి, మర్కట మోహిని, కాళీయమర్దనం, మోహినీ భస్మాసుర, వీణాపాణి, మాధవకేశవ, జనార్దన మొదలుగా గల విష్ణుమూర్తి చిత్రాలు, కైలాసాన్ని ఎత్తుతున్న రావణుడు, బ్రహ్మదేవుడు, అష్టభుజ గణేశ, గజాసుర మర్దన, సప్తాశ్వరథారూఢుడైన సూర్యుడు, మత్స్యయంత్రాన్ని ఛేధిస్తున్న అర్జునుడు, రతిదేవి- మన్మథ చిత్రాలు, నృత్య భంగిమల్లో నాయికలు, విషకన్య, నవరసభరితమైన భంగిమల్లో స్త్రీల చిత్రాలు ఎన్నో ఆలయ ప్రాకారాలపై రమ్యంగా కనిపిస్తాయి. చిలుకతో మాటలాడుతున్న సుందరి, తమలపాకు వేసుకుంటున్న స్త్రీ, ప్రియునిరాకకై ఎదురుచూస్తున్న నాయకి, వేటకు వెళ్తున్న స్త్రీ, కేశాలంకరణ చేసుకుంటున్న స్త్రీ, నాట్యకత్తె, సన్యాసిని, పాడుతున్న స్త్రీ, మురళిని మ్రోగిస్తున్న స్త్రీ, వాయులీన వాయిస్తున్న స్త్రీ, వేటాడుతున్న స్త్రీలు, స్నాన గృహం నుండి బయటికి వస్తున్న స్త్రీ, సిగను ముడివేస్తున్న స్త్రీ, ఈ విధంగా ఎన్నో భంగిమల్లో మహిళ దర్శన మిస్తుందిక్కడ.

చెన్న కేశవాలయంలో 48 స్తంభాలున్నాయి. ఒక్కొక్క స్తంభం మీద విభిన్న రీతుల్లో చెక్కడా లున్నాయి. ఈ రీతిగా అత్యంత కళాత్మకంగా నిర్మిత మైన మందిరాలు మన దేశంలో బహుకొద్ది.

**హళేబీడు ఆలయాలు**

బేలూరుకు 16 కిలోమీటర్ల దూరంలో హళేబీడు ఆలయాలున్నాయి. హొయసల చక్రవర్తులచే నిర్మితమైన ఈ దేవాలయాలు, బేలూరు ఆలయాల శైలిలోనే ఉంటాయి. కళలో కూడా సారూప్యత గోచరిస్తుంది. క్రీ.శ. 12-13 శతాబ్దాలలో హళేబీడు హొయసలులకు రాజధానిగా ఉండింది. హొయసలేశ్వర మందిర బహిః ప్రాకారాలపై రామాయణ మహాభారత గాథలననుసరించి చెక్కిన చిత్రాలున్నాయి. శ్రీకృష్ణ లీలలు, ప్రహ్లాద చరిత్ర, అభిమన్యుని పద్మవ్యూహం, కైలాస పర్వతాన్నెత్తిన రావణుడు మొదలుగాగల చిత్రాలు మనల్ని ముగ్ధుల్ని చేస్తాయి.

ఈ ఆలయ శిల్పకళా వైభవాన్ని దర్శించేందుకు అనేక దేశాల నుండి యాత్రికులు విశేషంగా వస్తుంటారు. ఒకానొక నాడు వైభవోపేతంగా విరాజిల్లిన ద్వారసముద్రం నేడు కుగ్రామంగా ఉండిపోయింది. హళేబీడు అంటే పాడుపడిన గ్రామమని అర్థమట.

ఇక్కడి ఆలయ నిర్మాణం విశిష్టస్థాయిలో జరిగింది. ఆలయానికి గోపురాలు కాని, గోపుర కలశాలుగాని లేవు. బేలూరు చెన్న కేశవాలయంలో లోపల శిల్పకళా చాతుర్యం విశేషంగా కనిపిస్తుంది. హళేబీడు ఆలయంలో మాత్రం బయటి భాగంలోనే కళాఖండాలు మలచి ఉన్నాయి. నక్షత్రాకారంలో కోణాల్లో మలచిన ఆలయం పైకప్పు హొయసలుల



ఆచార్య మత్స్యరాజ హరగోపాల్


దర్పణ సుందరి

కళారీతుల వైశిష్ట్యాన్ని తెలియజేస్తుంది. భూతలం నాలుగడుగుల ఎత్తునున్న వేదికపై ఆలయ నిర్మాణం జరిగింది.

హోయసలేశ్వరుని నైశాలేశ్వరుడని కూడా వ్యవహరిస్తారు. శాంత లింగేశ్వర లింగం, హోయసలేశ్వర శివలింగం రెండూ ఒకే ఆలయంలో ప్రక్క ప్రక్కన ఉన్నాయి. దేవాలయ కుడ్యాలపై విశేషంగా మనల్ని ఆకర్షించేవి నరసింహావతార దృశ్యాలు. హోయసల రాజులను నరసింహస్వామి ఆరాధ్యదైవం. అందువల్ల ప్రహ్లాద చరిత్ర మొత్తం శిల్పకళా ఖండాల్లో రమ్యంగా మలిచారు. భారత రామాయణ గాథలు శివలీలలు, క్షీరసాగర మథనం శ్రీ కృష్ణావతార ఘట్టాలు, అభిమన్యుని పద్మవ్యూహ ప్రవేశం, కైలాస పర్వతాన్ని ఎత్తుతున్న రావణాసురుడు తదితర పౌరాణిక గాథాచిత్రాలు అత్యంత



హోయసలేశ్వర ఆలయం

రమణీయంగా చిత్రించారు శిల్పులు. ఒక్కమాటలో చెప్పాలంటే దేవాలయ బాహ్యకుడ్యాలపై శిల్ప నిర్మాణానికి అను వైనా అన్ని స్థలాల్లోను శిల్పులు తమ ప్రతిభను వెల్లడించారు.

గర్భాలయ బాహ్యద్వారాలకు ద్వారపాలకులు, తోరణాలు, తీగలు చెక్కారు. శివలింగాలకెదురుగా మహోన్నతమైన నంది విగ్రహాలున్నాయి. దేవాలయ కుడ్యాల్లో ఒక వరుసన గుర్రాలు, మరొక వరుసన ఏనుగులు, ఇంకో వరుసలో రథాలుండి చతురంగ సేనను సూచిస్తుంటాయి. ముఖద్వారం వద్దనున్న బసవేశ్వరుని వెనుకభాగంలో పదడుగుల ఎత్తుగల సూర్యభగవానుని విగ్రహం ఉన్నది. ఇక్కడ ఉన్న శిల్పాలన్నీ అతి సున్నితమైనవి. ఇవన్నీ కళాప్రియుల హృదయాలపై చెరగని ముద్ర వేస్తాయి. ఇక్కడ వసతి గృహాలు, భోజనశాలలున్నాయి. మధ్యతరగతి యాత్రికుల కందుబాటులో ఉంటాయి.


హళేబీడు శిల్పనిర్మాణం

హోయసలేశ్వరాలయం ఏకశిలా నిర్మితమైనట్టిది. దగ్గర్లోని పార్శ్వనాథ జైన దేవాలయంలోని పదిహేను అడుగుల ఎత్తు గల దిగంబర పార్శ్వనాథుని నల్లరాతి విగ్రహం ఆకర్షణీయంగా ఉంటుంది.

ఏడు తలల నాగరాజు జైన విగ్రహానికి ఆచ్ఛాదన కల్గిస్తున్నట్లు ఈ విగ్రహం మలిచారు. మంటపంలో పండ్రెండు స్తంభాలు నల్లరాతితో నిర్మించారు. అద్దంలోవలె ప్రతిరూపాన్ని వీటిలో చూడగలిగినంత నునుపుగా ఉంటాయి. అందువలనే బేలూరు-హళేబీడు ఆలయాల శిల్పకళా వైభవం విశ్వవిఖ్యాతమైనట్టిది. ఇవి మన దేశంలోనే దర్శనీయ స్థలాల్లో ప్రాముఖ్యం వహిస్తున్న ఆలయాలు. ★



# తిరుమల రామచంద్ర మనసారా జీవించిన మహనీయుడు

**చలంతి గిరయః కామం**
**యుగాంత పవనాహతాః**
**కృచ్ఛ్రేపిన చలత్వేన**
**ధరాణా నిశ్చలం మనః**

(ప్రళయకాలంలో పెనుగాలులు వీచినప్పుడు పర్వతాలు కూడా చలించిపోతాయి. కానీ ఎంతటి కష్టకాలంలోనైనా ధీరుల మనసు చలించనే చలించదు.) సాహితీ మేరునగం వంటి తిరుమల రామచంద్ర (జూన్ 17, 1913-అక్టోబర్ 12, 1997) జీవితంలో ఎన్నెన్నో మలుపులు, కష్టాలు, కన్నీళ్లు, మెరుపులు, మరకలు.. అయినా వెనుతిరిగి చూడలేదాయన. జీవితాన్ని మనసారా రెండు చేతులతో ఆస్వాదించి, ఆనందించిన తపస్వి. ఆయన చేసిన సాహితీ ప్రయాణాలు.. ప్రయోగాలు.. అక్షరీకరించిన అనుభవాల సంపుటి "హంపి నుండి హరప్పా దాక" ఆత్మకథలలో అత్యధికంగా ఖ్యాతినార్జించిన గ్రంథం. ఎన్నెన్నో ఉత్కంఠతలకు నెలవు. మొదటి పేజీని మనం తిరగేస్తే మిగిలిన నాలుగు వందల తొంభై ఆరు పేజీలను పుస్తకమే మన చేత తిరగేయిస్తుంది. ప్రతి సాహితీకారుడు చదవవలసిన పుస్తకం. సాహిత్యంలోకి అడుగులు వేస్తున్నాం, వేయాలనుకునే ప్రతి ఒక్కరూ కంఠస్థం చేయవలసిన గ్రంథం. ఇది ఆయన జీవితచరిత్ర కాదు.. జీవనానుభవాలు కాదు.. ఈ గ్రంథంలో వివరించిన



అంశాలు ఆయన మొత్తం జీవితం కాదు..మూడో వంతు మాత్రమే. రామచంద్ర నిత్య మనస్వి. నిరాడంబర వచస్వి. ఇరవై శతాబ్దాల తెలుగు సాహిత్య చరిత్రలో, సమీక్షల్లో, అధ్యయనంలో ఓ పది పదిహేనుమంది ప్రముఖులను ఎంపిక చేయవలసి వస్తే, అందులో తిరుమల రామచంద్ర గారిని తప్పనిసరిగా లెక్కించవలసిందే! అర్థ శతాబ్దపు కాలం వివిధ పత్రికలలో పనిచేసినా తనకు తాను ఏనాడూ పెంపు చేసుకోలేదు. ఆయనకున్నంత పేద మనసు, పెద్ద మనసు అంతటి సాహిత్యమూర్తులలో ఎవరిలోనూ చూడలేము. 'తరువులతి భార ఫల సమృద్ధి నమ్రత వహించు' అనే భర్తృహరి సూక్తిమత్వం – రామచంద్ర మూర్తిమత్వం. ఈయన జన్మస్థలం కర్ణాటక రాష్ట్రంలోని 'హంపి'. విజయ నగరం దగ్గర్లోని రాఘవమ్మపాలెం (రాఘవమ్మ పల్లె కాలక్రమంలో రాగంపాలెం అయిందట). బాల్యమంతా సంస్కృతం, కన్నడ, తెలుగుభాషలలోనే గడిచిపోయింది.

'హంపి నుండి హరప్పా దాకా' సాగిన తిరుమల రామచంద్ర సాహితీ ప్రయాణంలో ఆయన చూసిన ప్రతి సన్నివేశం, సంఘటన, అనుభవం ఎంతో ఆర్ద్రతతో వర్ణిస్తారు. అక్షరాలను చెక్కి వాక్యాలు తీర్చిదిద్దినట్లుంటాయి. అనుభవాల వెనుక అనుబంధాల ఆర్తిని, ఆర్ద్రతను వర్ణించిన వైనం చదువరులను కట్టిపడేస్తుంది. ప్రతి అధ్యాయానికి ముందు ఉదహరించిన సూక్తులు ఎన్నెన్నో విషయాలను చెబుతాయి. అధ్యాయంలోని ఊసులను క్లుప్తంగా వివరిస్తాయి. ప్రతి మాట ఆచితూచినట్లుగా ఉంటుంది. ఇందులో 60 చిన్న చిన్న అధ్యాయాలున్నాయి. అవి భారతీయ సంస్కృతిలోని మేలిమిని సాక్షాత్కరింప జేస్తాయి. మరెన్నో ఈ రకమైన విషయాలను నవరసభరితంగా వివరిస్తారు. ఆయన లాహోర్ నుండి ధర్మశాల వరకూ వెళ్లినప్పుడు మారుతున్న భాషలనూ, యాసలనూ గమనించిన తరువాత 'పన్నెండు క్రోసులకొక భాష మారుతుంది' అంటారు. ఏ ప్రాంతానికి వెళితే ఆ ప్రాంతపు ఆహారాన్ని ఆస్వాదనాపూరిత




భమిడిపాటి గౌరీశంకర్

9492858895






'హంపి నుండి హరప్పా దాకా' సాగిన తిరుమల రామచంద్ర సాహితీ ప్రయాణంలో ఆయన చూసిన ప్రతి సన్నివేశం, సంఘటన, అనుభవం ఎంతో ఆర్ద్రతతో వర్ణిస్తారు. అక్షరాలను చెక్కి వాక్యాలు తీర్చిదిద్దినట్లుంటాయి. అనుభవాల వెనుక అనుబంధాల ఆర్తిని, ఆర్ద్రతను వర్ణించిన వైనం చదువరులను కట్టిపడేస్తుంది. ప్రతి అధ్యాయానికి ముందు ఉదహరించిన సూక్తులు ఎన్నెన్నో విషయాలను చెబుతాయి. అధ్యాయంలోని ఊసులను క్లుప్తంగా వివరిస్తాయి. ప్రతి మాట ఆచితూచినట్లుగా ఉంటుంది.


ఆనందంతో స్వీకరించిన 'త్రిదశుడు' ఆయన. ఎనభైనాలుగేండ్ల జీవితాన్ని యాదృచ్ఛాలాభసంతుష్టంగానే గడిపారు. గతానికి అగతానికి ఒక అందమైన వారధిని ఈ రచన ద్వారా మనకి అందిస్తారు. పంజాబు ప్రాంతంలో పర్యటించిన వేళ అమాయకమైన పల్లె జీవితాన్ని ఆస్వాదిస్తూ "రబ్బా! (భగవంతుడా! నీవు భారత గ్రామ ప్రజల ఆనందంలో ఉన్నావు' అంటారు. 'లావణ్యం ఒలికే లాహోర్' అనే అధ్యయనంలో మాధవశాస్త్రి బండారి పరిచయం తదుపరి ఆయన మరణాన్ని కూడా ఎంతో ఆర్తితో, ఆప్రతాపూరిత హృదయంతో చెబుతారు. 28వ అధ్యాయంలో సత్యం, తపస్సు, జ్ఞానం, అహింసాగుణం, విద్వాంసులను సేవించడం, ఉత్తమ శీలము' ఈ గుణాలు ఉన్నవాడే విద్వాంసుడు, వట్టి చదువుతో విద్వాంసుడు కాలేడు అంటారు. ఈ వ్యాఖ్యానానికి నిలువెత్తు రూపం తిరుమల రామచంద్ర వ్యక్తిత్వం. 27వ అధ్యాయంలో కుటుంబంలోనూ, సమాజంలోనూ గౌరవంగా ఉండడానికి మానవుడు న్యాయంగానూ, నీతిగానూ వ్యవహరించాలనే ఆర్య వాక్యాన్ని చెప్పిన వేళ రామచంద్ర రూపం మన మనోనేత్రం ముందు సాక్షాత్కారమౌతుంది. గురువుల గురించి చెబుతూ 'ధర్మశాస్త్రాలు చదువుతున్నప్పుడు నాకు, మా గురువు గార్ల వంటి వారిని చూసే ధర్మశాస్త్రకారులు తమ సూత్రాలను రచించారా? అని అనిపిస్తుంది. మా గురువుల వ్యక్తిగత జీవితాలు మాకు తెలియవు.. తెలుసుకుందామనే రంధ్రాన్వేషణకు ఎప్పుడూ పూనుకోలేదు. వారు మాతో ప్రవర్తించిన తీరు చాలు, వారి వైయుక్తిక జీవితము పవిత్రంగా ఉంది అని చెప్పడానికి.' వర్తమానంలో ఈ సూత్రాలు చదివిన వారికి ఎలా ఉంటుందో వారి విజ్ఞతకే వదిలేద్దాం....

ఆయన తన జీవితంలో ఎన్నో ఎత్తులను చూశారు. కానీ ఏనాడు ఎటువంటి ప్రలోభాలకు, కీర్తి ప్రతిష్ఠల ఆశాపాశాల బలహీనతలకు లోనుకాలేదు. ఈ గ్రంథంలో ఆయన భాష ప్రలుబ్ధత ఆయన జీవితంలో వివిధ దృశ్యాలను ఎంతో రమ్యంగా చిత్రిస్తున్న వైనం, ఘనం, కారణం, శుభిరుజ్వలమైన శృంగారం, సుకుమార హాస్యం, పరమ మనస్విత వంటి ఈ గ్రంథం నిండా పాఠకులు పూలతోటలో విహరించేంత సంతోషాన్ని కలిగిస్తాయి.. అంటారు అక్కిరాజు రమాపతిరావు.

సుజనుడు ఊళ్లో ఉన్నప్పుడు ఊరంతా నిండుగా ఉంటుంది. అతడు మరుగై పోతే అంతా వెలితే.. అది ఎలాంటి వెలితి అంటే.. గ్రామ సమీపంలోని మర్రిమాను కూలిపోతే ఎంతటి వెలితో అలాంటిది. ఆ వెలితిని పూడ్చడం ఎంతో కష్టం. తిరుమల రామచంద్ర లేకపోవడం తెలుగు సాహిత్యానికి ఏర్పడిన లోటు అటువంటిదే.. నాతోటి సామాన్యుడి జీవితంలో ఏమి గొప్ప సంఘటనలు ఉంటాయి గనుక? కానీ ఇది ఒక దేశ ద్రిమ్మరి అనుభవ విశేషంగా, సత్యాన్వేషి కథనంగా, జిజ్ఞాసువు ఆవేదనగా పాఠకుల మనసుకు దగ్గరవుతుందని నా విశ్వాసం' అంటూ ఎంతో వినయంగా తనకు తానే చెప్పుకున్నారు రామచంద్ర.

చివరిగా..

యోగవాశిష్ఠంలో 'సజీవతి మనోయస్య మననేవహి జీవం' అనే శ్లోకం ఉంది. అనగా– ఎవరైతే మనసుతో మనసారా జీవిస్తారో వాళ్లే నిజంగా జీవించినట్లు.. వాళ్ల జీవితమే సార్థకం. తిరుమల రామచంద్ర ఇటువంటి వారే! ★

# ఏకాత్మతా ప్రతిమకు వందనం



భారతీయ ఏకాత్మతకు శంకర భగవత్పాదులు వేసిన పునాది, చూపిన దారి అజరామరమైనవి. ఆ మహనీయుడి ఐక్యతా దృష్టి, ఏకత్వ చింతన భారతీయులు ఎప్పటికీ విస్మరించలేరు. ఈ దేశ అఖండత్వమే ఆయన జీవన యాత్రలో దర్శనమిస్తుంది. అదే ఆయన సందేశం కూడా. అలాంటి మహనీయుని 108 అడుగుల ప్రతిమను సెప్టెంబర్ 21న మధ్యప్రదేశ్‌లోని ఓంకారేశ్వర్‌లో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆవిష్కరించారు. ఈ ప్రతిమకే ఏకాత్మతా ప్రతిమ అని పేరు పెట్టారు.

భగవత్పాదులు జీవించినది కేవలం 32 సంవత్సరాలు. ఓంకారేశ్వర్‌లో ప్రతిష్ఠించిన ప్రతిమ 12 ఏళ్ల బాలుని రూపంలో ఉంటుంది. ఆ వయసులోనే శంకరులు ఓంకారేశ్వర్‌ను దర్శించుకున్నారు. ఈ పంచలోహ విగ్రహాన్ని మాంధాత పేరుతో ఉన్న కొండ మీద ప్రతిష్ఠించారు. ఈ ప్రతిమను 54 అడుగుల పీఠం మీద నిర్మించారు. ఆ పీఠాన్ని 27 రేకుల పద్మం ఆకృతిలో తయారు చేశారు. గుజరాత్ లోని పటేల్ ప్రతిమ, తమిళనాడు లోని మురుగన్ ప్రతిమ, గోమతేశ్వర్ (కర్ణాటక), మురుడేశ్వర్‌లోని శివుని ప్రతిమల సరసన ఇప్పుడు శంకరుల ప్రతిమకు కూడా స్థానం దక్కింది. ముంబై లోని జేజే ఆర్ట్స్ స్కూలుకు చెందిన వాసుదేవ కామత్ ఈ విగ్రహానికి ఆకృతిని కూర్చారు. అందులో భాగంగా కామత్ కాలడి కూడా వెళ్లి సన్యాసుల వస్త్రధారణ సంప్రదాయాలను కూడా పరిశీలించి వచ్చారు.

శంకరులు కేరళలోని కాలడిలో జన్మించారు. క్రీస్తుశకం 788-820 మధ్య జీవించారు. పిన్న వయసులోనే సన్యాసం స్వీకరించిన తరువాత ఓంకారేశ్వర్‌ను దర్శించుకున్నారు. తన గురుదేవులు గోవింద భగవత్పాదుల వారిని శంకరులు ఇక్కడే కలుసుకున్నారు. విద్యను అభ్యసించారు. ఆ తరువాత అద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. నిజానికి ఈ తత్త్వం అనాది సనాతన ధర్మానికి సవాలు విసురుతున్న బౌద్ధం వంటి సిద్ధాంతాలకు అడ్డుకట్టగా ఆ మహనీయుడు ప్రబోధించారు. ఆయన కాంచీపురం నుంచి మొదలుపెట్టి కామరూప (ప్రస్తుత అస్సాం) వరకు దేశాటనం చేశారు. కశ్మీర్, కేదార్, బదరీ, శృంగేరి, ఉజ్జయిని, కాశీ, పూరీ, జోషీమఠ్ అన్నీ ఆ మహనీయుని పాదధూళితో పునీతమైనవే. ఇదే కాదు, జీవితకాలంలో 116 గొప్ప రచనలు కూడా చేశారు. అందులో పది ఉపనిషత్తులకు, బ్రహ్మసూత్రాలకు, భగవద్గీతకు వ్యాఖ్యానాలు కూడా ఉన్నాయి.

ఖాండ్వా జిల్లాలోని మాంధాత ద్వీపంలోని ఓంకారేశ్వర్ పుణ్యక్షేత్రం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 2,200 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. ఉజ్జయని, మహేశ్వర్, మాండు అనే మూడు ఆధ్యాత్మిక పట్టణాలకు తోడుగా అటు పర్యాటకాన్ని, ఇటు ఆధ్యాతిక శోభను ఇనుమడింప చేస్తూ చేపట్టిన పథకంలో భాగంగా ఈ ప్రతిమను ఆవిష్కరించారు. ఆధ్యాత్మికంగా మాంధాత ద్వీపానికి ఎంతో చరిత్ర, ప్రాధాన్యం ఉన్నాయి. ఇది నర్మదా నదిలో ఉంది. 12 జ్యోతిర్లింగాలలో రెండు ఇక్కడే ఉన్నాయి. అవి ద్వీపానికి దక్షిణాదిన ఉన్న ఓంకారేశ్వర్, మరొకటి అమరేశ్వర్- ఈ రెండూ జ్యోతిర్లింగాలే. ఇవే కాదు, 14 నుంచి 18వ శతాబ్దం మధ్య నిర్మించిన శైవ, వైష్ణవాలయాలు, జైనాలయాలు కూడా ఉన్నాయి. ఈ ద్వీపానికి ఆగ్నేయంగా 110 కిలోమీటర్ల దూరంలోనే ఉజ్జయిని మహాక్షేత్రం ఉంది. ఇక్కడ ఉన్నది కూడా జ్యోతిర్లింగమే. 'ఓం' అన్న అక్షరాన్ని పోలి ఉంటుంది కాబట్టే ఈ క్షేత్రానికి ఓంకారేశ్వర్ అని పేరు వచ్చింది. ఇక్కడ వెలసిన దేవుడు కూడా ఓంకారేశ్వరుడే. ఇక్కడి నుంచే శంకరులు కాశీ బయలుదేరి వెళ్లారని ప్రతీతి.

ఇక్కడ ఇప్పటికే ఏకాత్మతా ధామం (పురావస్తు ప్రదర్శనశాల), అద్వైత వేదాంతం గొప్పతనాన్ని వివరించే అద్వైత్ లోక్, ఆదిశంకరాచార్య ఇనిస్టిట్యూట్ కూడా ఏర్పాటయ్యాయి. 2017 ఎన్నికల సందర్భంగా ఈ ద్వీపంలో శంకరుల విగ్రహాన్ని స్థాపిస్తానని శివరాజ్ ఇచ్చిన హామీని ఇప్పుడు నెరవేర్చారు. ఇదంతా ఐక్య భారతావని భావాన్ని వికసింపచేసే ఉద్దేశంతో ఏర్పాటైనదే. ★

# భాగ్యనగరంలో 'వనవాసీ' సదస్సు






వనవాసీ కల్యాణ ఆశ్రమం అఖిల భారతీయ కార్యకర్తల సమావేశాలు భాగ్యనగరంలోని అన్నోజిగూడ రాష్ట్రీయ విద్యాకేంద్రంలో అక్టోబర్ 6వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరిగాయి. దేశంలోని 45 ప్రాంతాల నుండి వనవాసీ కల్యాణ ఆశ్రమం కార్యకర్తలు, జాతీయ స్థాయి ప్రతి నిధులు హాజరైన ఈ సమావేశాలను పూజ్య కమలానంద భారతి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. మూడేళ్లకు ఒకసారి జరిగే ఈ సమావేశాలకు ఈసారి భాగ్యనగరం వేదిక కావడం విశేషం.

వనవాసీ ప్రతినిధులు తమ సాంప్రదాయక వస్త్రధారణలతో హాజరుకావడంతో సమావేశ ప్రాంగణం కనువిందుగా మారింది. వనవాసీ కళ్యాణ్ ఆశ్రమం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న అనేక రకాల సేవా కార్యక్రమాలను వివరిస్తూ ఏర్పాటు చేసిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. వనవాసీ కల్యాణ పరిషత్ జాతీయ అధ్యక్షులు రామచంద్ర కరారీ, ఉపాధ్యక్షులు హెచ్ కె నాగో, నిర్వాహక కార్యదర్శి రమేశ్ పాల్గొన్నారు.

ఈ సమావేశాలలో పలు తీర్మానాలు ఆమోదించారు. మన దేశం అధ్యక్షతన ఢిల్లీలో జరిగిన జి-20 సదస్సు విజయవంతం కావడం పట్ల కళ్యాణ ఆశ్రమ్ హర్షం వ్యక్తం చేస్తూ, ఆ సదస్సును సమర్థవంతంగా నిర్వహించిన భారత ప్రభుత్వానికి అభినందనలు తెలిపింది. 'జి-20 సదస్సుకు ఎన్నెన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన అతిథులకు మన దేశ గౌరవనీయ సంప్రదాయాన్ని అనుసరించి ఘనస్వాగతం పలికాం. విభిన్న ఆలోచనా విధానాలు న్నప్పటికీ అందరినీ కలుపుకొని సర్వామోదంతో ఉమ్మడి తీర్మానాన్ని ఆమోదింపచేశాము. భారత్ యావత్ ప్రపంచానికి నాయకత్వం వహించగలదని కూడా రుజువు చేశామని' తీర్మానంలో పేర్కొంది.

**'చంద్రయాన్' పట్ల హర్షం**

భారతదేశ శాస్త్రవేత్తలు చంద్రయాన్‌ను విజయవంతంగా ప్రయోగించి, రానున్న రోజుల్లో శివశక్తిగా ప్రసిద్ధం కానున్న చందమామ దక్షిణ భాగాన మన వ్యోమనౌకను దిగేలా చేశారు. ఇలా చంద్రమండలం దక్షిణ భాగానికి చేరుకున్న ఏకైక దేశంగా భారత్ చరిత్ర సృష్టించింది. ఈ విజయంతో ముడిపడిన శాస్త్రవేత్తలందరినీ, భారత ప్రభుత్వాన్ని అభినందిస్తున్నట్లు కూడా మరో తీర్మానంలో పేర్కొంది. శాస్త్రవేత్తల్లో ఒకరైన ఝార్ఖండ్ వనవాసీ కల్యాణ ఆశ్రమం పూర్వ గిరిజన విద్యార్థి డాక్టర్ రోహన్ కుమార్ యాదవ్ ఆ సామాజిక వర్గానికి కీర్తి సంపాదించి పెట్టారని, ఇది కల్యాణాశ్రమానికే కాక యావత్ వనవాసీ సముదాయానికి గర్వకారణమని తీర్మానంలో తెలిపింది.

**'నారీ శక్తి వందన్' కు వందనం**

వినాయక చవితి పండుగనాడు భారత పార్లమెంట్ నూతన భవనం ప్రారంభం దేశ చరిత్రలో మరపురాని రోజని సమావేశం పేర్కొంది. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లో 'నారీ శక్తి వందన్' బిల్లు ఆమోదం హర్షణీయమని తెలిపింది. ఇకనుంచి జాతీయ స్థాయి, రాష్ట్రస్థాయి చట్ట సభల్లో మహిళలకు 33 శాతం ప్రాతినిధ్యం లభిస్తుంది. ఈ విషయంలోనూ కల్యాణాశ్రమ్ భారత ప్రభుత్వాన్ని అభినందిస్తోందని తెలిపింది.

**గిరిజన వర్సిటీ పట్ల హర్షం**

తెలంగాణలోని ములుగులో సమ్మక్క సారక్క పేరిట గిరిజన విశ్వ విద్యాలయం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలమూరు బహిరంగ సభలో (అక్టోబర్ 1, 2023) ప్రకటించడం, ఆ వెంటనే కేంద్ర సమాచార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ సంబంధిత బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం పొందడం అభినందనీయమని సమావేశం తీర్మానించింది.

సుమారు రూ. 900 కోట్లతో నెలకొల్పనున్న ఈ విశ్వవిద్యాలయం రాష్ట్రంలో ఉన్నత విద్యా వ్యాప్తికి తోడ్పడడమే కాకుండా గిరిజన కళా సంస్కృతులు పరిరక్షణ, వారి పరిజ్ఞానంపై పరిశోధనలకు అవకాశం ఉంటుందని తెలిపింది. ★



# ‘వివక్ష వీడుదాం! సమరసతను సాధిద్దాం!’

## చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల సమ్మేళనంలో వక్తలు





**నెల్లూరు :** దేశాన్ని, సమాజాన్ని సమరసత వైపు మరలించే క్రమంలో హిందూ సమాజంలో నెలకొన్న సామాజిక వివక్షను, కులభేదాల నిర్మూలనకు కృషి చేయాల్సిన అవసరం ఉందని నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం గొలగమూడి శ్రీ వెంకయ్యస్వామి ఆడి టోరియంలో జరిగిన సమరసరత సమ్మేళనంలో వక్తలు పిలుపునిచ్చారు. చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల సమరసత సమ్మేళనం అక్టోబర్ 8న నిర్వహించారు.

పీటీ జగన్నాథాచారి అధ్యక్షత వహించిన ఈ సమ్మేళనంలో కమలానందభారతి స్వామి సందేశమిస్తూ, సమాజంలో మార్పు కోసం మార్గ దర్శనం అవసరమన్నారు. భారతీయతను సాధిం చేందుకు హిందూ ధర్మం కులాలకు అతీతంగా ఏకం కావలసిన అవసరాన్ని ఆయన వివరించారు. కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి మనకు మొట్ట మొదటి సంఘ సంస్కర్తగా ఉండడం 140 కోట్ల భారతీయులకు ఆదర్శమన్నారు.

ఆర్ఎస్ఎస్ సహ క్షేత్ర ప్రచారక్ భరత్‌కుమార్ తన సందేశంలో ప్రతి ఒక్కరిలో భగవంతుని దర్శించడం ద్వారా అందరం సమానం అన్న భావన కలగాలనీ, శబరి, జటాయువు, గుహుడు ఉదంతాలను వివరించి, అయోధ్యలో రామమందిరం ప్రారంభాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా పొట్లూరు శ్రీనివాసులు, డా॥ వేణుదీక్షిత్, కోట సునీల్ కుమార్ తమ సందేశాలలో సమరసత ఆవశ్యకతను వివరించారు. జిల్లా సమరసత వేదిక అధ్యక్షులు ఎన్. శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సామాజిక సమరసత వేదిక అఖిల భారతీయ సంయోజక్ శ్యాంప్రసాద్, ప్రధాన కార్యదర్శి వి. కేశవ్, రాష్ట్ర సమరసతా వేదిక నేత కోడూరు సత్యం, మహిళా నేత జయప్రద, పల్నాటి రామదండు, బాలు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ★

# ధన్యజీవి ఉప్పలపాటి

జ్యేష్ఠ స్వయంసేవక్ ఉప్పలపాటి సత్య నారాయణరాజు అక్టోబర్ 5న విజయవాడలోని తన స్వగృహంలో కన్నుమూశారు. ఆయన వయసు 102 సంవత్సరాలు. బందిప్టే 1940లో ప్రచారక్‌గా వచ్చి విజయవాడలో ఆర్ఎస్ఎస్ శాఖ ప్రారంభించినప్పుడు సత్యనారాయణరాజు స్వయంసేవక్ అయ్యారు. అప్పటి నుంచి తుదిశ్వాస వరకు ఆయన సంఘ్‌లో, జనసంఘ్‌లో వివిధ హోదాలలో సేవలు అందించిన ధన్యజీవి.

సంఘంలో వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ మద్రాస్‌లో 40 రోజులు సంఘ శిక్షావర్గ పూర్తి చేశారు. ఆ తరువాత 1948 గాంధీజీ హత్యారోపణతో ఆర్ఎస్ఎస్‌ను నిషేధించినప్పుడు అరెస్టయ్యారు. గన్నవరం, గుడివాడ, బళ్లారి సెంట్రల్ కారాగారాలలో శిక్ష అనుభవించారు. జైలు నుండి విడుదలైన తరువాత గాంధీజీని చంపిన సంస్థకు చెందినవారన్న కోపంతో వీరి తండ్రి ఇంటికి రానివ్వలేదు. పినతండ్రి విజయవాడ కృష్ణానదికి తీసుకొనివెళ్లి స్నానం



నివాళి

**(21.02.1922 - 05.10.2023)**

చేయించి తమ ఇంటికి తీసుకెళ్లి కొద్దిరోజుల తరువాత తండ్రి వద్దకు చేర్చారు. అప్పటికే రాజుకి వివాహమైంది. అప్పుడే ప్రారంభ మైన జాగృతి వారపత్రికలో చేరారు. జాగృతిలో మేనేజర్ స్థాయికి ఎదిగారు. జాగృతి నుండి బయటికి వచ్చాక సొంతంగా ప్రింటింగ్ ప్రెస్ పెట్టారు. కొద్దిరోజులలోనే ప్రింటింగ్ ప్రెస్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్‌కు అధ్యక్షులుగా బాధ్యత చేపట్టారు. జనసంఘ్‌లో విజయవాడ టౌన్ అధ్య క్షుడిగా కూడా సేవలు అందించారు. విజయవాడలో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి కౌన్సిలర్‌గా గెలు పొందారు. అప్పటి నుండి వారిని ప్రేమతో ‘కౌన్సిల్ సత్యనారాయణ’ అని అందరు పిలవ సాగారు.

రెండున్నరేళ్ల ముందుగా తన సంపాదన నుండి కొంత మొత్తాన్ని జాగృతి, సేవాభారతి మొదలైన సంస్థలకు విరాళంగా ఇచ్చిన ధన్యజీవి సత్య నారాయణరాజు. వారి ఆత్మకు సద్గతులు కలగాలని ఆశిద్దాం. ★

# బాల జాగృతి

## తెలుసుకుందాం

### దైద అమరలింగేశ్వర స్వామి



ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా దైదలో ఈ ఆలయం కొలువుదీరింది. ఉత్తరవాహినిగా ప్రవహించే కృష్ణానది ఒడ్డున ప్రకృతి సిద్ధమైన బిలం (గుహ)లో అమరలింగేశ్వరుడు కొలువై ఉన్నాడు. కొన్ని వందల సంవత్సరాల క్రితం శివుడు స్వయంభువుగా శివలింగం రూపంలో వెలసి భక్తుల నీరాజనాలను అందుకుంటున్నాడు. కార్తికమాసం, ప్రతి సోమవారం భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకుంటారు.

## కథ — కొడుకు కోసం!



విజయదుర్గం అనే ఊళ్లో విశ్వాచారి అనే పేరుమోసిన వైద్యుడు ఉన్నాడు. అతనిలో వైద్యం కంటే భేషజం హెచ్చు. దాన్నే అతను తన కొడుక్కి కూడా నేర్పుతున్నాడు.

ఇంతలో విశ్వాచారికి పెద్ద జబ్బు చేసింది. తన వైద్యం పారలేదు. ఇంకో వైద్యుడి చేత చికిత్స పొందాలంటే, తన పేరు పోవటమే గాక, తన కొడుక్కి భవిష్యత్తు ఉండదు. అందుచేత అతను తనకు తెలిసిన వైద్యమే తన కొడుకు చేత చేయించుకుంటూ, చివరి రోజులు గడుపుతున్నారు.

విశ్వాచారి చావుబతుకుల్లో ఉన్న వార్త విని శరభాచారి అనే వైద్యుడు చూడవచ్చాడు.

విశ్వాచారి పోతే రాజ్యంలో ఆ స్థానం తాను కొట్టేయాలని శరభాచారి ఉద్దేశం.

విశ్వాచారి ఇది గ్రహించి తన శక్తినంతా కూడగట్టుకుని, మంచంలో నుంచి లేచి కూర్చుని తన వ్యాధికి తన

## పద్యము

**పసుల వన్నె వేరు పాలెల్ల ఒక్కటి**
**పుష్పజాతి వేరు పూజ ఒకటి**
**దర్శనంబులారు దైవంబు ఒక్కటె**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

**భావం :** మనుష్యులంతా ఒక్కటే. పశువులు వేరువేరు రంగులలో ఉన్నప్పటికీ అవి ఇచ్చే పాలు మాత్రం తెల్లగానే ఉంటాయి. అలాగే మనుషులు వివిధ వర్ణాల వారైనా మనసులు ఒకటిగా మసలుకోవాలంటాడు వేమన. పూవులు వేరు వేరు రంగులతో ఉన్నా పూజకు వినియోగపడటంలో అవన్నీ ఒక్కటే గదా! అని అర్థం.

## శ్లోకము

**'సుజనో నయాతివైరం'**

**సుజనో నయాతివైరం**
**బాధితోపి దురాత్మనా**
**ఛేదేపి చందన తరుః**
**సురభయతి ముఖం కుఠారస్య**

**భావం :** దుర్జనుడు ఎంత బాధించినా సజ్జనుడు అతనిపై విరోధభావం చూపడు. మంచి గంధం చెట్టు తనను నరికిన గొడ్డలి పదునుకు కూడా సువాసనను ఇస్తుంది కదా!

## జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| పెన్నా | తుంగభద్ర |
| గోదావరి | జీలం |
| కృష్ణా | చిత్రావతి |
| గంగ | శబరి |
| సింధు | హేమావతి |
| కావేరి | యమున |

జవాబులు : పెన్నా–చిత్రావతి; గోదావరి–శబరి; కృష్ణా–తుంగభద్ర; సింధు–జీలం; గంగ–యమున; కావేరి–హేమావతి.

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### దాహ్యాబాయి పటేల్
### (1906-1973)



భారత స్వాతంత్ర్య సమరయోధుడు దాహ్యాబాయి పటేల్. స్వాతంత్ర్య ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. క్విట్ ఇండియా ఉద్యమంలో భాగంగా 1942లో అరెస్టై జైలు జీవితం కూడా గడిపారు. స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత 1962లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో లోక్‌సభకు ఎన్నికయ్యారు.



కొడుకు అద్భుతంగా చికిత్స చేస్తున్నట్టు శరభాచారితో చెప్పాడు.

శరభాచారి సంతోషం ప్రకటించి, విజయదుర్గంలో తాను స్థిరపడే ఉద్దేశం మానుకుని వెళ్లిపోయాడు.

విశ్వాచారి, ఆశ్చర్యంగా చూస్తున్న తన కొడుకుతో 'నీ గురించి గొప్ప అభిప్రాయం కలిగించటానికి శ్రమపడ్డాను. లేకపోతే వాడు ఇక్కడికి వచ్చి, నీకు తిండి పుట్టకుండా చేసే వాడు. కాబట్టి నువ్వు నాలాగా భేషజాలకు పోకుండా ఇప్పటికైనా కష్టపడి వైద్యం నేర్చుకొని రోగులకు మెరుగైన చికిత్స అందించాలంటూ తుదిశ్వాస విడిచాడు.

అప్పటి నుంచి విశ్వాచారి కొడుకు తన దగ్గరికి వచ్చే రోగులందరికీ మెరుగైన వైద్యాన్ని అందిస్తూ ఊర్లో మంచిపేరు గడించాడు. ★

## జనరల్ నాలెడ్జ్

1. హరిత విప్లవ పితామహుడు అని ఎవరిని పిలుస్తారు?
2. కులూ లోయ ఎక్కడుంది?
3. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం ఎప్పుడు జరుపుకుంటారు?

జవాబులు : 1. ఎం.ఎస్. స్వామినాథన్; 2. హిమాచల్‌ప్రదేశ్; 3. డిసెంబర్ 10.

## మెదడుకు మేత

చెయ్యని కుండ,
పొయ్యని నీరు,
పెట్టని సున్నం ఏమిటది?

జవాబు : తాంబూలం

## మంచిమాట

కొత్త స్నేహితులు దొరకగానే, పాత స్నేహితులను మరిచిపోకూడదు!



# వారఫలాలు

16-22 అక్టోబర్ 2023

**మేషం :** అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

ఎంతటి సమస్య ఎదురైనా అధిగమిస్తారు. ప్రఖ్యాతిగాంచిన వ్యక్తులతో పరిచయాలు. భూములు, వాహనాలు సమకూర్చుకుంటారు. అనుకున్న ఆదాయం సమకూరుతుంది. ఉద్యోగులకు ఉన్నత పోస్టులు దక్కవచ్చు. కళాకారులు, వైద్యులకు మరింతగా కలసివచ్చే కాలం. రచయితలకు మంచి గుర్తింపు లభిస్తుంది. 17,18 తేదీల్లో ధనవ్యయం. కుటుంబంలో చికాకులు. శివస్తోత్రాలు పఠించండి.

**వృషభం :** కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

ఇంతకాలం మీపట్ల విముఖంగా ఉన్న వ్యక్తులే మీదారికి వస్తారు. శత్రువులను సైతం ఆదరిస్తారు. కొన్ని ఆస్తి వివాదాలు పరిష్కారమై కొంత లబ్ధి చేకూరుతుంది. ఉద్యోగులకు ఆశాజనకంగా ఉంటుంది. పారిశ్రామిక, రాజకీయవేత్తలు, చిత్రకారులు అనుకున్న లక్ష్యాలు సాధిస్తారు. ఒక ఆహ్వానం సంతోషం కలిగిస్తుంది. 20,21తేదీల్లో శారీరక రుగ్మతలు. అనుకోని ప్రయాణాలు. ఆంజనేయ దండకం పఠించండి.

**మిథునం :** మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

ఆదాయం ఆశించినరీతిలో ఉంటుంది. దీర్ఘకాలిక సమస్యలు కొన్ని పరిష్కరించుకుంటారు. ప్రఖ్యాతిగాంచిన వారు పరిచయమవుతారు. వ్యాపారస్తులకు పెట్టుబడులు మరింత అంది ఆశ్చర్య పరుస్తాయి. ఉద్యోగులకు కొత్త హోదాలు రావచ్చు. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, పరిశోధకులు అనుకున్న విజయాలుసాధిస్తారు. 16,17తేదీల్లో వృథా ఖర్చులు. శారీరక రుగ్మతలు. గణేశాష్టకం పఠించండి.

**కర్కాటకం:** పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

పొరపాట్లు సరిదిద్దుకుని కొన్ని కార్యక్రమాలను చక్కదిద్దుతారు. దూరపు బంధువుల ద్వారా శుభవార్తలు. వివాహ, ఉద్యోగ ప్రయ త్నాలలో కొంత పురోగతి కనిపిస్తుంది. నూతన ఒప్పందాలు చేసుకుంటారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగులకు విధుల్లో ప్రతిబంధకాలు తొలగుతాయి. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, క్రీడాకారులకు అంచనాలు నిజం కాగలవు. 17,18 ల్లో ప్రయాణాలలో ఆటంకాలు. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.

**సింహం :** మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

అనుకున్న కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. సమాజంలో గౌరవం పొందుతారు. వ్యాపారస్తులకు తగినంతగా లాభాలు అందుతాయి. ఉద్యోగులు కొన్ని బాధ్యతల నుంచి విముక్తి పొందుతారు. పారిశ్రామిక, రాజకీయవేత్తలు, కళాకారులకు కాస్త ఊరట లభిస్తుంది. క్రీడాకారులకు అవకాశాలు దక్కవచ్చు. 18,19 తేదీల్లో దుబారా వ్యయం. అనారోగ్యం. ఆదిత్య హృదయం పఠించండి.

**కన్య :** ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

సమర్థులైనా కొన్ని వ్యవహారాలలో పొరపాట్లు దొర్లి నిరాశకు లోనవుతారు. రుణదాతలు ఒత్తిడులు పెంచుతారు. గృహం, వాహనాలు కొనుగోలు యత్నాలు వాయిదా వేస్తారు. వ్యాపారాలు కొంత గందరగోళంగా మారవచ్చు. రాజకీయవేత్తలు, కళాకారులు, పరిశోధకులకు కృషి ఫలించదు. 19,20 తేదీల్లో శుభవార్తలు. ఆకస్మిక ధనప్రాప్తి. కుజగ్రహ స్తోత్రాలు పఠించండి.

**తుల :** చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

కొత్త వ్యక్తులు పరిచయమై మీకు ఇతోధికంగా సహకరిస్తారు. అనుకున్న రాబడి దక్కి ఉత్సాహంతో ముందడుగు. వ్యాపారస్తులకు లాభాలు గతం కంటే మెరుగుపడతాయి. ఉద్యోగులు మరింత ఊపిరి పీల్చుకునే సమయం. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, రచయితలకు ఈతిబాధలు తొలగుతాయి. నిరుద్యోగుల కలలు ఫలిస్తాయి. 21,22 తేదీల్లో అనారోగ్యం. కుటుంబంలో ఒత్తిడులు. దుర్గాస్తుతి మంచిది.

**వృశ్చికం :** విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

చెప్పుకోతగ్గ రీతిలో డబ్బు అందుతుంది. కొన్ని సమస్యలు తీరే సమయం. విచిత్రమైన సంఘటనలు ఆకట్టుకుంటాయి. ఉద్యోగస్తులకు ఒడిదుడుకుల నుంచి విముక్తి. రాజకీయవేత్తలు, కళాకారులు, రచయితలకు గతం నుంచి వేధిస్తున్న వివాదాలు తీరతాయి. 16,17 తేదీల్లో శారీరక రుగ్మతలు, మానసిక అశాంతి. శివాలయ దర్శనం చేయండి.

**ధనుస్సు :** మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

సమస్యలు అధిగమించి విజయం సాధిస్తారు. పట్టుదలే మీ ఆయుధంగా మలుచుకోండి, సంతోషంగా ముందుకు సాగుతారు. చిరకాల ప్రత్యర్థులు మీకు అనుకూలమైన నిర్ణయాలు తీసుకుంటారు. రుణబాధలు తొలగుతాయి. క్రీడాకారులు, చిత్రకారులకు సంతోషకర సమాచారం అందుతుంది. 19,20తేదీల్లో ఖర్చులు పెరుగుతాయి. ఆకస్మిక ప్రయాణాలు. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మకరం :** ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

అనుకున్న మేరకు డబ్బు అందుతుంది. కొన్ని లక్ష్యాలను సాధించడంలో ముందడుగు వేస్తారు. కొన్ని సమయాలలో పట్టింది బంగారంగా ఉంటుంది. వ్యాపారాలు మరింత పుంజుకుని లాభాలు అందుతాయి. రాజకీయవేత్తలు, కళాకారుల ప్రయత్నాలు క్రమేపీ ఫలిస్తాయి. రచయితలు, పరిశోధకులకు ఆదరణ పెరుగుతుంది. 20,21 తేదీల్లో శారీరక రుగ్మతలు. శివాష్టకం పఠించండి.

**కుంభం :** ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

ఆర్థికంగా గతం కంటే మెరుగైన పరిస్థితి. దీర్ఘకాలిక సమస్యలు కొన్ని తీరే సమయం. ఇంటి నిర్మాణాలు ముమ్మరం చేస్తారు. సమాజంలో మరింత గౌరవమర్యాదలు పొందు తారు. ఉద్యోగస్తులకు విధుల్లో మరింత ప్రోత్సాహం కళాకారులు, రచయితలు, క్రీడాకారులకు సంతోషకరంగా గడుస్తుంది. 16,17తేదీల్లో దూరప్రయాణాలు. అనారోగ్యం. ధన వ్యయం. దేవీస్తుతి మంచిది.

**మీనం :** పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

ఎదుటివారు సహకరించలేకున్నా సహనంతో ముందుకు, విజయాలు వరిస్తాయి. భూములు, వాహనాలు కొనుగోలులో ఆటంకాలు తొలగుతాయి. వ్యాపారాలు కొంత మందగించినా క్రమేపీ అనుకూలిస్తాయి. రాజకీయ నాయకులు, కళాకారులు గతం కంటే మెరుగైన పరిస్థితులను చూస్తారు. క్రీడాకారులు, రచయితలకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. 17,18తేదీల్లో ధననష్టం. కుటుంబంలో చికాకులు. దుర్గామాతకు కుంకుమార్చన చేయండి.

# పదరసం-437

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | 3 | | | 4 | ✠ | 5 |
| | ✠ | | ✠ | | ✠ | ✠ | 6 | 7 | |
| 8 | | | ✠ | 9 | | 10 | ✠ | | ✠ |
| ✠ | ✠ | 11 | 12 | | ✠ | | ✠ | | ✠ |
| 13 | 14 | ✠ | | ✠ | 15 | | 16 | | 17 |
| ✠ | 18 | 19 | | ✠ | | ✠ | | ✠ | |
| 20 | ✠ | | ✠ | 21 | | 22 | | 23 | ✠ |
| | ✠ | 24 | | | ✠ | | ✠ | 25 | 26 |
| 27 | 28 | | ✠ | 29 | | | | ✠ | |
| ✠ | | ✠ | 30 | | ✠ | | ✠ | 31 | |

## ఆధారాలు

**అడ్డం**

1. భవిష్యత్తులో ఏమైనా జరగవచ్చు అని చెప్పే సామెత (8)
6. వంటలలో ఇది వేస్తే రుచి, ఆరోగ్యం (3)
8. మరోలా మరోలా (3)
9. ఒక దేవ నర్తకి తిరగబడింది (3)
11. దిటవు, ధైర్యంలాంటిది (3)
13. స్పర్థ (2)
15. ఆబగా తినడాన్ని సూచించేది (5)
18. ఒక ప్రముఖమైన నది (3)
21. చీకు చింత, జంజాటం (5)
24. మావి చిగురు తినిపాడేది (3)
25. ఎగిరే దాని తోక తెగింది (2)
27. ఒక దక్షిణాది రాష్ట్రపు కొత్తపేరు (3)
29. వాడుక భాషలో వదరు బోతుతనం (4)
30. దేవునికి సమర్పించుకునేది (2)
31. బంజరు (2)

**నిలువు**

1. తలక్రిందులైన మూఢత్వం (3)
2. ముఖ్యపట్టణం (4)
3. తీవ్రమైన, భీతిగొల్పేది (4)
4. పైకొచ్చిన స్త్రీ (2)
5. అర్జునునికి కృష్ణుడు (2)
7. గురువుకి గురువు (4)
10. శిఖరంపైన, హారంమధ్యలో ఉండే మణి (3)
12. దేవునికి నైవేద్యంగా కొట్టేకాయ పగిలింది (3)
14. జబ్బులు రాకుండా వేసే సూదిమందు (2)
15. కష్టం, సమస్య (3)
16. చచ్చినవాటిని తినే పక్షి చెదరిపోయింది (3)
17. పైకి లేచిన మొలక (2)
19. ఎగతాళి (4)
20. పైకెగిరిన జెండా (3)
21. దీనిని బ్రహ్మవాక్కు అంటారు (4)
22. నామకరణతంతు సరిగా లేదు (4)
23. ద్వీపం (2)
26. శివునికి ఇష్టమైన ఆకు (దళం) 3
28. ఇంట గెలిచి – గెలవమని సామెత (2)

**మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-27**

**పదరసం – 437**

పేరు : ..........................................................................

చిరునామా: ..........................................................................

..........................................................................

పిన్‌కోడ్ : .................. మొబైల్ : ..........................................

**సమాధానాలను** పైగడులలో పూరించి,కత్తిరించి కవర్‌పై పదరసం నెం.వేసి 2023 అక్టోబర్ 30 లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.

## పదరసం - 433 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 జా | గృ | 2 తి | ✠ | ✠ | 3 వి | ✠ | 4 ష్ణు | 5 అ | ✠ |
| గ | ✠ | 6 గ | జేం | ద్ర | మో | క్షం | ✠ | 7 మా | ద్రి |
| ర | ✠ | ర | ✠ | ✠ | చ | ✠ | ✠ | య | ✠ |
| 8 ణ | 9 ర | త | వి | ✠ | 10 న | 11 క్ష | త్ర | కు | డు |
| ✠ | మా | ✠ | ✠ | 12 అ | ✠ | త | ✠ | డు | ✠ |
| ✠ | ర | ✠ | 13 గా | నం | ద | గా | దు | ✠ | 14 గ |
| 15 తి | మి | 16 రం | ✠ | తం | ✠ | త్రు | ✠ | 17 తా | జా |
| ✠ | ✠ | 18 గ | వ్వ | ✠ | 19 తె | లు | 20 గు | ✠ | సు |
| 21 పం | ✠ | వ | ✠ | ✠ | నా | ✠ | 22 హు | షా | రు |
| 23 జా | బి | ల్లి | ✠ | 24 చె | లి | కా | డు | ✠ | డు |

పాఠకుల నుంచి సరైన సమాధానాలు రానందున ఈ వారం విజేతని ప్రకటించలేకపోతున్నాం.




అరుణ

# మెంటల్ తెప్పించే మామా మశ్చీంద్ర

సూపర్ స్టార్ కృష్ణ చిన్నల్లుడు సుధీర్‌బాబు హీరోగా ఎంట్రీ ఇచ్చి పదేళ్లు అవుతోంది. అయినా అతని కెరీర్‌లో సూపర్ డూపర్ హిట్స్ ఏమీ లేవు. హీరోగా నటించిన తొలి చిత్రం 'ఎస్.ఎమ్.ఎస్.' ఫర్వాలేదనిపిస్తే, 'ప్రేమకథా చిత్రమ్' చక్కని విజయాన్ని అందించింది. ఆ తర్వాత చేసిన సినిమాలలో మళ్లీ అతనికో మోడరేట్ హిట్ ఇచ్చింది 'సమ్మోహనం' చిత్రమే. తెలుగులో సిక్స్ ప్యాక్ హీరోలలో సుధీర్ బాబు కూడా ఒకడు. ఆ మాట ఎందుకు చెప్పుకోవాల్సి వచ్చిందంటే అతని తాజా చిత్రం 'మామా మశ్చీంద్ర'లోనూ సిక్స్ ప్యాక్‌తోనే కనిపించాడు. సొంత నిర్మాణ సంస్థను ప్రారంభించి ఐదేళ్ల క్రితం 'నన్ను దోచుకుందువటే' మూవీ చేశాడు. అదీ నిరాశకు గురిచేసింది. భిన్నమైన కథాం శాలతో సినిమాలు చేస్తున్నాడు కానీ సుధీర్‌బాబుకు విజయం అందని ద్రాక్షే అవుతోంది. తాజాగా వచ్చిన 'మామా మశ్చీంద్ర'దీ అదే పరిస్థితి.



ప్రముఖ ఎగ్జిబిటర్, డిస్ట్రిబ్యూటర్, ప్రొడ్యూసర్ సునీల్ నారంగ్, పుస్కర్ రామ్‌మోహన్‌తో కలిసి 'మామా మశ్చీంద్ర' మూవీని నిర్మించారు. ఈ సినిమాకు ప్రముఖ నటుడు, రచయిత హర్షవర్ధన్ దర్శకత్వం వహించారు. గతంలో అతను 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సినిమాను తీశాడు. తర్వాత దాని పేరు 'గుగ్లీ'గా మార్చారు. కానీ విడుదలైన దాఖలాలు లేవు! 'మామా మశ్చీంద్ర'కూ హర్షవర్ధనే కథ రాసుకోవడం విశేషం. అందువల్లే అతనికి దీనిని తెర మీద చూపించడం సులువైంది. వేరే ఎవరికైనా ఈ కథ ఇచ్చి ఉంటే.. ఇవాళ ఈ సినిమాను చూసిన వాళ్లలాగే, సదరు డైరెక్టర్‌కు కూడా మెంటల్ వచ్చేసి ఉండేది!

కథగా చెప్పుకోవాలంటే... పరశురామ్ చిన్నప్పుడే తల్లి చావుకు కారణమైన తండ్రిని, పిన్నిని చంపేసి జైలుకు వెళతాడు. తిరిగి వచ్చిన తర్వాత మేనమామ పంచన చేరి, ఆయన ఆస్తికి వారసుడుగా మారతాడు. అయితే సవతిచెల్లి తన మావయ్య కొడుకునే పెళ్లి చేసుకుందని, వారిని అడ్డుతొలిగిస్తే ఆస్తి మొత్తం తనకే దక్కుతుందని వారి హత్యకు కుట్ర పన్నుతాడు. అది వర్కౌట్ కాదు. చెల్లి, బావతో పాటు పాటు వాళ్ల ఇద్దరు కొడుకులు కూడా చావు నుండి తప్పించు కుంటారు. ఎప్పటికైనా వాళ్ల ద్వారా తనకు, తన కూతురుకు ప్రాణహాని ఉంటుందనే భయం పరశురామ్‌ను పట్టుకుంటుంది. దాంతో తన కూతురును తన స్నేహితుడు దాసు కూతురి ప్లేస్‌లోకి మార్చేస్తాడు. ఇది తెలియని దాసు పరశురామ్ కూతురిని రక్షించాలనే ఉద్దేశ్యంతో తన కూతురుగా ఉన్న పాపను తిరిగి పరశురామ్ చెంతకు చేర్చుతాడు. అంటే...ఎవరి పిల్లలు వారికి చేరిపోయినట్టే... కానీ ఆ విషయం ఈ తండ్రులకు మాత్రం తెలియదు. ఇక పరశురామ్ మేనలుల్లు పెరిగి పెద్ద అయిన తర్వాత అతను భయపడినట్టుగా పగప్రతీకారాలతో రగిలిపోయారా? తన మేనమామ మీద, అతని కూతురు మీద పగ తీర్చుకున్నారా? లేదా? అనేది మిగతా కథ. ఓ మామ చేసే మశ్చీంద్ర కాబట్టి ఈ సినిమాకు ఆ టైటిల్ పెట్టారు.

సినిమా ప్రారంభం నుండే ప్రేక్షకులు తికమక పడటం మొదలవుతుంది. మూవీని ఫ్లాష్ బ్యాక్‌లో చూపించడం, మధ్య మధ్య ప్రస్తుతానికి రావడం, తిరిగి పాత కథలోకి వెళ్లడం...ఆ క్రమంలో సరైన ఛేంజోవర్ లేకపోవడంతో ఏది, ఎప్పుడు జరుగుతోందో అర్థం కాని పరిస్థితి. అలానే సుధీర్‌బాబు ద్యుయల్ రోల్‌ను ట్రిబుల్ రోల్‌గా చూపడం ఊహించని ట్విస్ట్ అని దర్శకుడు అనుకున్నాడు కానీ అది మరీ గందరగోళానికి దారి తీసింది. అజయ్‌తో తండ్రీ కొడుకులుగా ద్విపాత్రాభినయం చేయించడం కూడా కన్ఫ్యూజన్‌కు గురిచేసేదే. కొన్ని విషయాలను లాజికల్‌గా ఆలోచించి, కథ రాసుకున్న హర్షవర్ధన్ అదే సమయంలో చాలా సన్నివేశాలను తనకు కన్వినెంట్‌గా రాసుకుని, తీసేశాడు. బహుశా ఈ సినిమా కథ గురించి నిర్మాతలకు చెప్పినప్పుడు వారికి కూడా అర్థమౌ ఉండదు. పదిరాళ్లు వేస్తే ఒకటైనా తగలపోతుందా? అనే ఉద్దేశ్యంతో ఈ సినిమా తీశారేమో అనిపిస్తోంది.

నటీనటుల విషయానికి వస్తే సుధీర్‌బాబు కాస్తంత కొత్తగా ట్రై చేశాడు. ఓల్డ్ గెటప్ సెట్ కాలేదు. యంగ్ బోయ్ ఓల్డ్ గెటప్ వేసినట్టుగా అనిపిస్తోంది తప్పితే బాడీలాంగ్వేజ్‌లో పెద్దంత మార్పులేదు. లావుగా ఉండే గెటప్ 'లడ్డూబాబు'లో నరేశ్‌ను గుర్తు చేసింది. డీజే పాత్ర మాత్రమే అతనికి నప్పింది. హీరోయిన్లుగా ఇషారెబ్బా, మృణాళిని రవి చేశారు. పరశురామ్ తల్లిగా అభినయ గెస్ట్ అప్పీయరెన్స్ ఇచ్చింది. పరశురామ్ స్నేహితుడు దాసుగా రచయిత, దర్శకుడు హర్షవర్ధన్ నటించాడు. రాజీవ్ కనకాలతో సహా చెప్పుకోవడానికి చాలా మందే నటీనటులు ఉన్నారు. నిర్మాతలు సైతం భారీగానే తీశారు. కానీ వీళ్లందరి కష్టం కథ, కథనాలు పూర్తి స్థాయిలో తికమకగా ఉండటంతో వృథా అయిపోయి నట్టయ్యింది. సాంకేతిక నిపుణుల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవడానికి ఏమీ లేదు. పాటలు పెద్దంత ఆకట్టుకునేలా లేవు. మొత్తం మీద రచయితలంతా దర్శకులుగా రాణించలేరనే విషయం హర్షవర్ధన్ తెరకెక్కించిన 'మామా మశ్చీంద్ర'తో మరోసారి రుజువైంది. నటుడు సుధీర్ బాబు కథల విషయంలో మరింత జాగ్రత్త తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే.. 'సమ్మోహనం' తర్వాత వచ్చిన 'వి' సినిమా కూడా నిరాశకు గురిచేసింది. ఇక ఈ యేడాది ప్రారంభంలో వచ్చిన మలయాళ రీమేక్ 'హంట్' ప్రేక్షకుల సహనానికి పరీక్ష పెట్టింది. ఇప్పుడీ సినిమాదీ ఇదే పరిస్థితి. ఈ సంవత్సరం చివరిలో సుధీర్‌బాబు నటించిన మరో సినిమా 'హరోంహర' విడుదల కావాల్సి ఉంది. అది అయినా ప్రేక్షకాదరణ పొందుతుందేమో చూడాలి!

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు




వెల : ₹.220/-




వెల : ₹.200/-




వెల : ₹.390/-




వెల : ₹.250/-




వెల : ₹.250/-




వెల : ₹.360/-




వెల : ₹.100/-




వెల : ₹.200/-




వెల : ₹.100/-




వెల : ₹.150/-




వెల : ₹.799/-




వెల : ₹.499/-




వెల :₹.495/-




వెల : ₹.799/-




వెల : ₹.549/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.

040-27563236, 9290127329

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ - 2, దూరవాణి : 8333812687

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2021-2023; RNI Regd. No. 3270/57.
Volume : 75 Issue : 52

శ్రీ గురుభ్యోనమ : శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య మహాసంస్థానం దక్షిణామ్నాయ శ్రీ శారదా పీఠం శృంగేరి పాలిత జైమాతాది

# శ్రీ కనకదుర్గా శ్రీ నాగలక్ష్మీ అమ్మవార్ల శరన్నవరాత్రోత్సవములు

కనకదుర్గా క్రాస్ రోడ్స్, బషీర్‌బాగ్, భాగ్యనగర్ - 500 029.
ఫోన్ : 040 - 2323 7431, 2323 0858 | e-mail : kdnltemple@gmail.com

శ్లో॥ దేహి సౌభాగ్యం ఆరోగ్యం దేహిదేవి పరం సుఖం రూపం దేహి జయం దేహి యశోదేహి ద్విశో జహి:

సనాతనముగా బషీర్‌బాగ్ చౌరస్తాలో వెలిసియుండి భక్తులకు కొంగుబంగారమై సదా కాపాడుతూ
శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య మహాసంస్థానం దక్షిణామ్నాయ శ్రీశారదా పీఠాధీశ్వర అనంత శ్రీవిభూషిత శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామి వారు
మరియు శ్రీ విధుశేఖర భారతీ స్వామి వారి దివ్య అనుగ్రహ ఆశీస్సులతో
శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి ఆదివారము 15.10.2023 నుండి ఆశ్వీయుజ శుద్ధ దశమి
మంగళవారము 24.10.2023 వరకు శ్రీ కనకదుర్గా, శ్రీ నాగలక్ష్మి అమ్మవార్లకు శరన్నవరాత్రోత్సవములు జరుగును.
కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని
అమ్మవార్ల కృపకు పాత్రులు కాగలరని మనవి.




## కార్యక్రమ వివరములు

**14.10.2023 శనివారము (మహాలయ అమావాస్య)**
**ఉ॥ 8.25 ని॥లకు మూల విరాట్టులకు మహాబలాభిషేకము**

| | | | |
|---|---|---|---|
| 15.10.2023 | ఆదివారము | పాడ్యమి | శ్రీ శైలపుత్రీదేవి అలంకారం |
| 16.10.2023 | సోమవారము | విదియ | శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారం |
| 17.10.2023 | మంగళవారము | తదియ | శ్రీ వైష్ణవిదేవి అలంకారం |
| 18.10.2023 | బుధవారము | చవితి | శ్రీ మహాగౌరీదేవి అలంకారం |
| 19.10.2023 | గురువారము | పంచమి | శ్రీ మీనాక్షీ దేవి అలంకారం |
| 20.10.2023 | శుక్రవారము | షష్ఠి | శ్రీ సరస్వతి అలంకారం (మూల నక్షత్రం) |
| 21.10.2023 | శనివారము | సప్తమి | శ్రీ మహాకాళీదేవి అలంకారం |
| 22.10.2023 | ఆదివారము | అష్టమి | శ్రీ మహాలక్ష్మీ అలంకారం (బతుకమ్మ పండుగ) |
| 23.10.2023 | సోమవారము | నవమి | శ్రీ సిద్ధిధాత్రి అలంకారం (పూర్ణాహుతి (శమీ పూజ) |
| 24.10.2023 | మంగళవారము | దశమి | శ్రీ విజయదుర్గ అలంకారం |

24.10.2023
మంగళవారం రాత్రి 7.30 ని॥లకు
నిజాం కాలేజీ గ్రౌండ్స్‌లో

## రావణ దహనం

తదుపరి శమీపూజ.
ఘటహారతి

Guruseva Dhurina, Padmasri **Dr.V.R. GOWRISHANKER** (C.E.O. and Administrator, Sri Sharada Peetham Sringeri)
**KASI V.RAO** (Branch Head) | **M. RAMARAJU** (Chairman)

## భక్తులకు విజయదశమి శుభాకాంక్షలు